
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 8.00

సంపుటి: 15
సంచిక: 121

ఆదివారం 15-1-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సిసోడియా ఆఫీస్‌లో సోదాలు

ఢిల్లీ మద్యం కేసుకు సంబంధించిన రికార్డుల కోసం ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ఆఫీస్‌లో సీబీఐ సోదాలు చేసింది.

వివరాలు 6లో ▸



లక్షద్వీప్ ఎంపీపై అనర్హత వేటు

హత్యాయత్నం నేరంలో దోషిగా తేలిన లక్షద్వీప్ ఎంపీ మహ్మద్‌ను అనర్హుడిగా ప్రకటిస్తూ లోక్‌సభ నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు 6లో ▸



నా భార్యకు క్షమాపణ చెప్పాలి

తన భార్య మేఘన్‌ను మానసికంగా వేధించినందుకు.. బ్రిటన్ రాజ కుటుంబం క్షమాపణ చెప్పాలని ప్రిన్స్ హ్యారీ డిమాండ్ చేశారు.

వివరాలు 6లో ▸



శుభాలకు వాకిలి

భూమి, ప్రకృతి, మనుషుల మధ్య ఉన్న సంబంధాన్ని సంక్రాంతి పండుగ ద్వారా తెలిపే ప్రత్యేక కథనం..

వివరాలు 11లో ▸

సంబరంలా సంక్రాంతి

సీఎం క్యాంప్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు

అందరికీ మంచి జరగాలంటూ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంక్రాంతి శుభాకాంక్షలు

- గోశాలలో గోవులకు, తులసి మొక్కలకు పూజలు చేసిన సీఎం దంపతులు
- భోగిమంటలు వెలిగించి.. హరిదాసులకు స్వయంపాకం
- గంగిరెద్దులకు అరటిపళ్లు తినిపించి సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరు
- కళాకారులను ఆప్యాయంగా పలకరించి ఫొటోలు దిగిన సీఎం దంపతులు

సాక్షి, అమరావతి: సీఎం క్యాంపు కార్యాలయంలో శనివారం సంక్రాంతి సంబరాలు నేత్రపర్వంగా జరిగాయి. సంప్రదాయ పంచెకట్టుతో సతీ సమేతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సంక్రాంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు అంతా మంచి జరగాలని, దేవుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలంటూ ఈ కార్యక్రమానికి వచ్చిన, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నా అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు, అవ్వాతాతలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. శాంతి చిహ్నానికి గుర్తుగా తెల్లని పావురాలను ఎగురవేశారు.

గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా..

అంతకుముందు.. సీఎం క్యాంపు కార్యాలయం పక్కనే ఉన్న గోశాలను చక్కగా పల్లెటూరు వాతావరణం ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. గ్రామ సచివాలయం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు, పాఠశాలల నాడు–నేడు వంటి ప్రభుత్వ ప్రాధాన్యతలను తెలియజేస్తూ రంగవల్లులు, గొబ్బెమ్మలు, గాలిపటాలు, ధాన్యాగారాలు, గడ్డివాములు, ఎడ్లబండ్లు ఇలా అసలుసిసలైన పల్లె వాతావరణం ప్రతిబింబించేలా ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి పర్యవేక్షణలో గ్రామ స్వరాజ్యాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు.

ఆద్యంతం ఉల్లాసంగా ఉత్సాహంగా..

ఇక ఈ కార్యక్రమానికి సంప్రదాయ దుస్తులతో హాజరైన సీఎం దంపతులను వేదపండితులు నుదుట తిలకం దిద్ది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారిరువురూ జ్యోతి ప్రజ్వలన చేసి సంక్రాంతి సంబరాలను

మిగతా 2వ పేజీలో ▶



హరిదాసుకు బియ్యం సమర్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దంపతులు



నేడే 'వందే భారత్'

సికింద్రాబాద్–విశాఖ మధ్య పరుగుతీయనున్న రైలు
ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

సాక్షి, హైదరాబాద్: రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు సంక్రాంతి కానుకగా సికింద్రాబాద్–విశాఖపట్నం వందే భారత్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ప్రారంభిస్తారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ఈ రైలును ప్రారంభిస్తారని పేర్కొన్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో నిర్వహించే కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, తాను పాల్గొంటామని చెప్పారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సీఎం కేసీఆర్‌కు, ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులకు కేంద్రం ఆహ్వానాలు పంపిందని తెలిపారు.

అమ్మ కడుపు చల్లగా..

- రాష్ట్రంలో తగ్గిన మాతా, శిశు మరణాలు
- 2018లో ప్రతి వెయ్యి జననాల్లో శిశు మరణాలు 29
- 2019లో 25కు, 2020లో 24కు తగ్గుదల
- 2018లో ప్రతి లక్ష మందిలో ప్రసూతి మరణాలు 58
- 2020లో 45కు తగ్గుదల.. కేంద్రం వెల్లడి

3లో

న్యూస్‌రీల్

రావణ వాహనంపై శివపార్వతులు



శ్రీశైల మహాక్షేత్రంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీశైల మల్లికార్జునుడు దేవేరి భ్రమరితో కలిసి రావణ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు.

వివరాలు 5 ▸

సింహగిరిపై భోగి పండుగ



సింహగిరిపై సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. ఆలయ రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో పెద్ద ఎత్తున వేసిన భోగి మంటకు విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి హారతి ఇచ్చి పిడకలు వేశారు.

వివరాలు 5 ▸

శబరిమలలో మకరజ్యోతి దర్శనం



మకరవిలక్కు పర్వదినం రోజు శనివారం శబరిమల భక్తజన సంద్రంగా మారిపోయింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు అయ్యప్పను, మకరజ్యోతి దర్శనం చేసుకున్నారు.

వివరాలు 6 ▸

కాలు దువ్విన కోడి పుంజులు

- భోగి రోజునే మొదలైన పందేలు
- గుండాటలకు చెక్ పెట్టిన పోలీసులు.. వీఐపీ గ్యాలరీలు.. ఎంట్రీ పాస్‌లు
- క్యూఆర్ కోడ్ ద్వారా నగదు చెల్లింపులకు ఏర్పాట్లు
- బహుమతులుగా కార్లు, బైక్‌లు

సాక్షి,అమరావతి/కాకినాడ/భీమవరం/పెనమలూరు: సంక్రాంతి సంబరాల తొలి రోజునే కోడి పందేల జాతర మొదలైంది. భోగి రోజైన శనివారం మొదలైన ఈ పందేలు మూడు రోజులపాటు నిర్వహించేలా ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేసుకున్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఊరూ వాడా కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని అనేకచోట్ల పందేలు మొదలయ్యాయి. ఈ సారి భారీ బరుల వద్ద కోడి పందేల్లో పాల్గొనే వారి కోసం ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్ ద్వారా నగదు చెల్లింపులకు వీలుగా ఏర్పాట్లు చేశారు. విశాలమైన మైదానాలు, తోటల్లో బరులను ఏర్పాటు చేశారు. భారీ టెంట్లు వేసి కూర్చునేందుకు వీవీఐపీ, వీఐపీ, సాధారణ గ్యాలరీలను సైతం ఏర్పాటు చేశారు. రాత్రి వేళలోనూ పందేలు కొనసాగేలా బరుల వద్ద ఫ్లడ్ లైట్లను అమర్చారు.




కృష్ణా జిల్లా అంపాపురం వద్ద ఏర్పాటు చేసిన బరిలో తలపడుతున్న పుంజులు

కేరవాన్లు.. స్పెషల్ పాస్‌లు

కోడి పందేలకు పెట్టింది పేరైన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ప్రాంతంలో భారీ ఏర్పాట్ల నడుమ కోడి పందేలు నిర్వహిస్తున్నారు. కాకినాడ రూరల్ పరిధిలోని వలసపాకలో పందేలు వీక్షించేందుకు పాస్‌లు జారీ చేశారు. కొన్నిచోట్ల పందేల్లో గెలిచిన వారికి బుల్లెట్ వాహనం, కారు బహుమతిగా ప్రకటించారు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం అంపాపురంలో భారీ ఏర్పాట్లతో ఒక్కో కోడి పందెం రూ.లక్షల్లో నిర్వహించారు. పందేల్లో పాల్గొనే వారికి వీవీఐపీ పాస్ ధర రూ.60 వేలు..

మిగతా 2వ పేజీలో ▶

మోదీకి ఆ సలహా ఇచ్చింది నేనే



పల్లె జనం చెవుల్లో చంద్రబాబు పువ్వులు

- ప్రపంచంలో ఉన్న తెలుగువారు నావల్లే స్థిరపడ్డారు
- జనాభా తగ్గిపోతే ఇబ్బందులు.. పిల్లల్ని కనడం మన ధర్మం
- దేశంలో మొదట జాతీయ రహదారి ఏర్పాటు చేసింది నేనే
- మహిళలను ఉద్యోగాలకు పంపిన పార్టీ టీడీపీనే

- వివరాలు 3లో

భారత్ జోడో యాత్రలో విషాదం

కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేస్తున్న భారత్ జోడో యాత్రలో విషాదం చోటుచేసుకుంది. శనివారం ఉదయం యాత్రలో రాహుల్‌తో పాటు నడుస్తున్న ఆ పార్టీ ఎంపీ సంతోఖ్ సింగ్ చౌదరి(76) గుండెపోటుకు గురయ్యారు. వెంటనే ఆయన్ని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. సంతోఖ్‌సింగ్ హఠాన్మరణం పట్ల రాహుల్‌గాంధీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి.. యాత్రకు 24 గంటలు విరామం ప్రకటించారు.



- వివరాలు 6లో

సెలవు..

సంక్రాంతి పండుగ సందర్భంగా నేడు (ఆదివారం) సాక్షి కార్యాలయానికి సెలవు. కావున సోమవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం మంగళవారం.



ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌పై కీలక తీర్పు

అభ్యంతరం ఆధారంగా సర్టిఫికెట్ నిరాకరించకూడదు

- ఈ నిబంధనను మార్చండి.. జీవోను సవరించండి
- రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శికి హైకోర్టు ఆదేశం
- పిటిషనర్‌కు రెండు వారాల్లో సర్టిఫికెట్ ఇవ్వాలని ఆదేశం
- అత్త అభ్యంతరంతో ఓ మహిళకు సర్టిఫికెట్ ఇవ్వని అధికారులు
- ఆస్తిపై హక్కు వదులుకోవాలని అత్త షరతు.. న్యాయ పోరాటం చేసి సర్టిఫికెట్ సాధించిన మహిళ



సాక్షి, అమరావతి: పెళ్లయిన ఏడాదిన్నరకే భర్తను కోల్పోయిన ఓ మహిళకు కారుణ్య నియామకం కోసం ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ రాకుండా అత్త అభ్యంతరం చెప్పింది. దీంతో అధికారులు సర్టిఫికెట్ జారీ చేయలేదు. ఆస్తిపై హక్కు వదులుకుంటేనే సర్టిఫికెట్‌కు అభ్యంతరం లేదని చెబుతానని అత్త తేల్చి చెప్పింది. ఆ మహిళ చేసిన న్యాయపోరాటంలో విజయం సాధించడమే కాదు, అనేక ఏళ్లుగా అమలు చేస్తున్న జీవోను సవరించేలా కోర్టు ద్వారా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వడానికి కారణమయ్యారు. కోర్టు ఆదేశాలతో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ విషయంలో 'లిఖితపూర్వక అభ్యంతరం' నిబంధన వల్ల దరఖాస్తుదారులకు ఇబ్బందులు తొలగనున్నాయి. 'కుటుంబంలో ఇతర సభ్యులెవ్వరూ లిఖితపూర్వక అభ్యంతరం లేవనెత్తకపోతేనే దరఖాస్తుదారుకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇవ్వాలి' అని జీవోలో పేర్కొనడాన్ని హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. అభ్యంతరాన్ని కేవలం దరఖాస్తుదారు కుటుంబ సభ్యుడా/సభ్యురాలా అన్న దానికే పరిమితం చేయాలని ప్రభుత్వాన్ని

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

సీఎం జగన్ సంక్రాంతి శుభాకాంక్షలు

మన వైఎస్సార్‌సీపీ కుటుంబానికి ప్రత్యేక శుభాకాంక్షలు అంటూ ట్వీట్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు. 'మన పల్లెలు ధాన్యాగారాలుగా, ఇంగ్లీషు విద్యకు నెలవుగా, ఆరోగ్య చికిత్సలకు కేంద్రంగా, మన పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేలా విప్లవాత్మక కార్యక్రమాలు అమలవుతున్నాయి. సంక్రాంతిని అవి మరింత ద్విగుణీకృతం చేస్తాయని విశ్వసిస్తున్నాను. మన వైఎస్సార్‌సీపీ కుటుంబానికి నా ప్రత్యేక శుభాకాంక్షలు' అంటూ శనివారం ట్వీట్ చేశారు.

ఏరువాక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

10 కేటగిరిల్లో అవార్డులు.. నెలాఖరులోగా దరఖాస్తుకు అవకాశం

సాక్షి, అమరావతి: ఏపీ వ్యవసాయ రంగంలో విశిష్ట సేవలందించిన వారికి ఏరువాక ఫౌండేషన్-వ్యవసాయ వార్షిక అవార్డులు-2022ను త్వరలో ప్రదానం చేయబోతున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారా రాఘవరావు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏటా వివిధ కేటగిరీల్లో ఈ అవార్డులను ప్రదానం చేసే వారమని, 2022-23 నుంచి తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు వేర్వేరుగా అవార్డులందజేస్తున్నామన్నారు. ఉత్తమ శాస్త్రవేత్త, ఉత్తమ రైతు-మహిళా రైతు, ఉత్తమమిద్దె తోటల పెంపకందారుడు, ఉత్తమ సేంద్రీయ రైతు, ఉత్తమ విస్తరణ విభాగం, వ్యవసాయ సేవలో ఉత్తమ డిజిటల్ వేదిక, ఉత్తమ వ్యవసాయ ఈ యాప్, ఉత్తమ రైతు ఉత్పత్తిదారుల సంఘం(ఎఫ్‌పీఓ), ఉత్తమవ్యవసాయ పాత్రికేయుడు, ఉత్తమ సృజనాత్మక ఆలోచన (యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు) కేటగిరీల్లో అవార్డులను ప్రదానం చేయబోతున్నామని చెప్పారు. దరఖాస్తులను జనవరి 31వ తేదీలోగా గుంటూరు లాలాపేట్‌లోని ఏరువాక ఫౌండేషన్ కార్యాలయానికి నేరుగా లేదా మెయిల్ ఐడీ ingo@eruvaaka.com ద్వారా పంపించవచ్చునన్నారు. వివరాలకు ఫోన్‌నం 7075612969, 7075751969, 9849106633లో సంప్రదించవచ్చునని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ

టోల్ ప్లాజాకు 'పండుగ'

- పంతంగి టోల్‌ప్లాజా నుంచి రికార్డు స్థాయిలో వాహనాల రాకపోకలు
- 12వ తేదీన 56,595, 13న 67,577 వాహనాలు

చౌటుప్పల్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి రద్దీగా మారింది. హైదరాబాద్ జంటనగరాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి మూడు రోజులుగా పెద్ద ఎత్తున ప్రజలు తమ స్వగ్రామాలకు తరలివెళుతున్నారు. ఈ క్రమంలో చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా నుంచి రికార్డు స్థాయిలో వాహనాలు వెళ్లాయి. 12వ తేదీన ఇరువైపులా 56,595 వాహనాలు రాకపోకలు సాగించాయి. ఇందులో కార్లు 42,844, ఆర్టీసీ బస్సులు 1,300, ప్రైవేట్ బస్సులు 4,913, గూడ్స్ వాహనాలు 7,538 ఉన్నాయి. 13వ తేదీన 67,577 వాహనాలు ఇరుమార్గాల్లో వెళ్లాయి. ఇందులో కార్లు 53,561, ఆర్టీసీ బస్సులు 1,851, ప్రైవేట్ బస్సులు 4,906, అలాగే 7,259 గూడ్స్, ఇతర వాహనాలు రాకపోకలు సాగించాయి.

11 ఏళ్లలో ఇదే మొదటిసారి

హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా మార్చిన తర్వాత 11 ఏళ్ల కాలంలో ఒక్క రోజులో ఇంత పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించడం ఇదే మొదటిసారని అంటున్నారు. సాధారణ రోజుల్లో పంతంగి టోల్‌ప్లాజా నుంచి రోజుకు 30 వేల నుంచి 40 వేల వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా అదనంగా రోజుకు 30 వేల నుంచి 35 వేల వాహనాలు టోల్‌ప్లాజా గుండా వెళ్లాయి.

ముందస్తు జాగ్రత్తలు

సంక్రాంతి పండుగకు ఈ రహదారిగుండా పెద్ద సంఖ్యలో ప్రజానీకం వెళ్తుండటంతో పోలీసులు, జీఎమ్మార్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పంతంగి టోల్‌ప్లాజా, గ్రామాల కూడళ్ల వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించారు.


సీఎం నివాస ప్రాంగణంలో కనువిందు చేస్తున్న రంగవల్లులు

సంబరంలా సంక్రాంతి

▶ మొదటి పేజీ తరువాయి

లాంఛనంగా ప్రారంభించారు. గోశాలలోని గోవులకు పూజచేసి దండలు వేసి వాటిని నిమురుతూ కొద్దిసేపు సంతోషంగా అక్కడ గడిపిన అనంతరం తులసి మొక్కకు నీళ్లుపోసి నమస్కరించుకున్నారు. అక్కడి వినాయకుడి గుడిలోనూ పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన భోగిమంటను కాగడాతో వెలిగించారు. హరిదాసుకు బియ్యం పోయడంతోపాటు పండ్లు కూరగాయలతో కూడిన స్వయంపాకాన్ని సమర్పించారు. గ్రామీణ సంక్రాంతి వేడుకల్లో ప్రధానంగా కనిపించే వివిధ కళాకారులను సీఎం ఆప్యాయంగా పలకరించారు. అంతేకాక.. తెలుగింటి సంక్రాంతి పిండివంటలను ముఖ్యమంత్రి దంపతులు రుచి చూశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించడం కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పర్ణశాలలో సీఎం దంపతులు ఆశీనులయ్యారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రముఖ శాస్త్రీయ నృత్య కళాకారుడు ఆనంద్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన 'శ్రీనివాస కల్యాణం' నృత్య రూపకాన్ని సీఎం వైఎస్ జగన్ దంపతులు ఆద్యంతం ఆస్వాదించారు. నవరత్నాలతో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలను అందించిన నేపథ్యంలో గ్రామ సచివాలయం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, రైతుభరోసా కేంద్రాలు తదితర సేవల ద్వారా గ్రామ స్వరాజ్యాన్ని సాక్షాత్కారం చేసిన తీరును కళ్లకు కట్టినట్లు చూపించారు. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో కొమ్మా ఉయ్యాల కోన జంపాల.. పాట పాడిన గాయని ప్రకృతిరెడ్డి, అదే సినిమాలో ఎత్తర జెండా.. పాట పాడిన హారిక నారాయణ్, ప్రముఖ జానపద గాయని కనకవ్వ తదితర కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎక్కడో తెలంగాణ మారుమూల గ్రామంలో ఉన్న నన్ను గుర్తించి పిలిపించిన సీఎం వైఎస్ జగన్ దీర్ఘకాలం సీఎంగా ఉండాలంటూ కనకవ్వ ఆశీర్వదించారు. అనంతరం.. శాంతి చిహ్నానికి ప్రతీకగా సీఎం దంపతులు తెల్ల పావురాలను ఎగురవేశారు. ఈ సంబరాల్లో పాల్గొన్న వివిధ కళాకారులను ముఖ్యమంత్రి ఆప్యాయంగా పలకరించడంతో పాటు వారితో ఫొటోలు దిగుతూ వెన్నుతట్టి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రి జోగి రమేష్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ నందిగం సురేష్, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానులతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీఎం అభినందనలు

ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రతిబింబించేలా.. తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలా.. చక్కని ఏర్పాట్లతో, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సంక్రాంతి సంబరాలు నిర్వహించిన ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కరరెడ్డిని సీఎం వైఎస్ జగన్ ప్రత్యేకంగా అభినందించారు.


ముఖ్యమంత్రి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న వేద పండితులు


జ్యోతి ప్రజ్వలన చేసి సంక్రాంతి సంబరాలను లాంఛనంగా ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్, సతీమణి భారతి


గోమాతను ఆప్యాయంగా నిమురుతున్న సీఎం జగన్ దంపతులు


భోగి మంట వెలిగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్


శాంతికి చిహ్నంగా పావురాన్ని ఎగురవేస్తున్న సీఎం వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతి


జానపద గాయని కనకవ్వను ఆప్యాయంగా పలకరిస్తున్న సీఎం జగన్ దంపతులు


శ్రీనివాస కళ్యాణం నృత్య రూపకంలో కళాకారులు


సీఎం జగన్ దంపతుల మాటామంతీ


పిండివంటలను రుచిచూస్తున్న సీఎం జగన్ దంపతులు


కళాకారులతో సీఎం దంపతులు


వేదపండితుల ఆశీర్వచనం అందుకుంటున్న సీఎం వైఎస్ జగన్

పెళ్లయిన ఆ జంటలు.. ఇక ప్రత్యేక కుటుంబాలు

నవశకం డేటా కుటుంబ వివరాల్లో మార్పులు, చేర్పులకు అవకాశం

- మంగళవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు
- వివాహ ధ్రువీకరణ పత్రం లేదా భార్య, భర్త పేరు ఉన్న ధ్రువీకరణ పత్రం తప్పనిసరి
- తర్వాత దశలో వితంతు, విడాకులు తీసుకున్న వారికీ అవకాశం

సాక్షి, అమరావతి: మా అబ్బాయికి ఉద్యోగం ఉందనో లేదంటే ఇన్‌కం టాక్స్ కడుతున్నారనో మాకు ప్రభుత్వ పథకాలు రావడం లేదు.. ఈ తరహా కారణంగా ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న వారికి ప్రభుత్వం సంక్రాంతి కానుకను ప్రకటించింది ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటికీ ప్రాతిపదికగా తీసుకుంటున్న నవశకం సర్వే డేటాలోని కుటుంబ సభ్యుల డేటాలో మార్పులు, చేర్పులకు వీలు కల్పించింది. ఆ సర్వే డేటాలో.. పెళ్లైన రెండు మూడు జంటలు కూడా ఒకే కుటుంబంగా నమోదై ఉండి.. ప్రస్తుతం వారు వేర్వేరుగా నివాసముంటుంటే.. వారిని వేర్వేరు కుటుంబాలుగా వర్గీకరించేందుకు అవకాశం కల్పించింది. మంగళవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ వార్డు సచివాలయాల్లో ఈ సేవలను పొందొచ్చని గ్రామ, వార్డు సచివాలయ అధికారులు వెల్లడించారు.

ఆ కారణంతో ప్రభుత్వ పథకాలకు పలువురు దూరం

ప్రభుత్వం 2019 ఆగస్టులో గ్రామ, వార్డు వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశాక.. వలంటీర్ల ఆధ్వర్యంలో నవశకం సర్వే నిర్వహించింది. వలంటీర్లు తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి, ఆ ఇంటి పెద్ద లేదా ఇతర కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఆ కుటుంబ వివరాలను నమోదు చేశారు. రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కలిపి మొత్తం 1.67 కోట్ల కుటుంబాలున్నట్టు ఆ సర్వే తేల్చింది. నవశకం పేరుతో జరిగిన ఆ సర్వే వివరాల డేటాను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు. ప్రభుత్వం నవరత్నాల పేరుతో అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల వివరాలను ఆ నవశకం డేటాలో పేర్కొన్న కుటుంబాల వారీగా సభ్యుల వివరాలతో అధికారులు పోల్చి చూస్తున్నారు. అయితే, అప్పట్లో ఒకే కుటుంబంగా తమ వివరాలను నమోదు చేసుకున్న వారు పలు చోట్ల ఇబ్బంది పడుతున్నారు. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారనో, లేదంటే ఇన్‌కం ట్యాక్స్ కడుతున్నారనో, లేదా కారు ఉందనో, లేదంటే వ్యక్తిగత పేరుతో ఎక్కువ ఆస్తి నమోదై ఉందనో.. ఇలా పలు కారణాల వల్ల ఆ కుటుంబంలోని మిగతా వారికి ప్రభుత్వ పథకాలు అందడం లేదు. దీంతో కుటుంబ సభ్యుల వివరాల విభజనకు అవకాశం కల్పించాలని వారు ప్రభుత్వానికి అర్జీలిస్తూ వస్తున్నారు. ఇలాంటి వినతులు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో రావడంతో ప్రభుత్వం నవశకం సర్వే డేటాలో కుటుంబ వివరాల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది.



ఆ ఆరింటిలో ఏదో ఒక ఆధారం తప్పనిసరి..

నవశకం సర్వే డేటాలోని కుటుంబ సభ్యుల వివరాల్లో మార్పులు, చేర్పులు చేసుకోదలచిన వారు ఆరు రకాల్లో ఏదో ఒక ధ్రువీకరణ పత్రాన్ని చూపించాల్సి ఉంటుంది. సర్వే డేటాలో.. ఇప్పుడు ఒకే కుటుంబంగా పేర్కొంటున్న వారిలో పెళ్లై వేరుగా ఉంటున్న వారు.. వివాహ ధ్రువీకరణ పత్రం, లేదంటే ఆధార్, బియ్యం కార్డు, ఆరోగ్య శ్రీకార్డు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, పాస్‌పోర్టుల్లో భర్త లేదా భార్య పేర్లు ధ్రువీకరించేలా ఉంటే.. ఆ కుటుంబ సభ్యులను మరో కుటుంబంగా గుర్తిస్తారు. అయితే, ఆయా ధ్రువీకరణ పత్రాలుండటంతో పాటు ఆ కుటుంబ సభ్యులు తప్పనిసరిగా వేరుగా నివాసం ఉండాలి.

ప్రయోగాత్మక పరిశీలన అనంతరం..

నవశకం సర్వే డేటాలో కుటుంబ సభ్యుల వర్గీకరణను ముందుగా గ్రామీణ ప్రాంతంలో ఒక మండలంలో, పట్టణ ప్రాంతంలో ఒక నగర కార్పొరేషన్ పరిధిలో ఈ నెల 9వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు ప్రయోగాత్మకం(పైలెట్)గా పరిశీలన పూర్తి చేశారు. విజయనగరం జిల్లా గరివిడి మండలం, వైఎస్సార్ జిల్లా కడప నగర కార్పొరేషన్‌ను ఇందుకు ఎంపిక చేశారు. మొదటి దశలో.. పెళ్లైన వారి వివరాల ప్రకారం మార్పులు చేర్పులకు అవకాశం కల్పించారు. మరో రెండు దశల్లో వితంతు, విడాకులు తీసుకున్న వారిని వేరే కుటుంబాలుగా గుర్తించే ప్రక్రియ కూడా ఈ రెండు ప్రాంతాల్లో శుక్రవారం నుంచే ప్రయోగాత్మకంగా కొనసాగుతోందని అధికారులు చెప్పారు.

కాలు దువ్విన కోడి పుంజులు

▶ మొదటి పేజీ తరువాయి

వీవీఐపీ పాస్ రూ.40 వేలుగా నిర్ణయించారు. పందేల రాయుళ్ల కోసం క్యూఆర్ కోడ్ నగదు చెల్లింపుల సౌకర్యం కల్పించారు. కొన్నిచోట్ల వీవీఐపీల కోసం బరులకు సమీపంలో కేరవాన్లు (బస చేసే వాహనాలు) కూడా ఏర్పాటు చేశారు.

అతిథి మర్యాదలకు లోటు లేకుండా..

పందేలను చూసేందుకు, పందేలు ఒడ్డేందుకు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వారి అభిలాషకు అనుగుణంగా పలుచోట్ల బరుల నిర్వాహకులు అతిథి మర్యాదలు సిద్ధం చేశారు. ప్రత్యేకంగా హోటళ్లు, అతిథి గృహాలు, చేపల చెరువులపై మకాంలను కేటాయించి ప్రత్యేకంగా మాంసాహార వంటకాలు, విదేశీ మద్యంతో అతిథి మర్యాదల్లో ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

'పశ్చిమ'లో 270 బరులు

పశ్చిమ గోదావరి, జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో చిన్నాపెద్దా అన్నీ కలిపి కోడి పందేల బరులు దాదాపు 270 వరకు ఏర్పాటయ్యాయి. ఉండి, ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాల్లో ఎక్కువ కోడి పందేలు గెలిచిన వారికి బుల్లెట్ మోటార్ సైకిల్ బహుమతిగా ప్రకటించారు. దుంపగడప బరిలో ఏలూరు జిల్లా తాడినాడకు చెందిన వ్యక్తి 9 పందేలకు గాను 5 పందేలు గెలిచి బుల్లెట్ మోటార్ సైకిల్ బహుమతి అందుకున్నాడు. ఏలూరు జిల్లా పరిధిలోనూ సంక్రాంతి సంబరాలు కొనసాగుతున్నాయి.


పెనమలూరు నియోజకవర్గం పరిధిలోని ఈడుపుగల్లులో కోడిపందేల బరి

'తూర్పు' పందేలు డీలా

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కోడి పందేలు నిర్వహించినప్పటికీ.. గుండాటలను పోలీసులు అడ్డుకోవడంతో జూదరులు డీలా పడ్డారు. తూర్పు గోదావరి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో దాదాపు 300 చోట్ల కోడి పందేల బరులు వెలిశాయి. గత సంక్రాంతితో పోల్చితే ఈ సారి కోడి పందేలు సాధారణంగా జరిగాయే తప్ప భారీ ఎత్తున ఎక్కడా జరగలేదు.

ప్రత్యేక వాహనాల్లో రాక

ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా కోడి పందేల బరులను సిద్ధం చేశారు. పెనమలూరు, గన్నవరం, మచిలీపట్నం, పామర్రు, ఎన్టీఆర్ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా సిద్ధం చేసిన బరుల్లో సంప్రదాయంగా, రైతువారీగా కోడిపందేలు నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ముంబై, పంజాబ్, తమిళనాడు, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి పందెంరాయుళ్లు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. వారి కోసం బరుల నిర్వాహకులు ప్రత్యేక వసతి సదుపాయాలను సమకూర్చారు.

ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌పై కీలక తీర్పు

▶ మొదటి పేజీ తరువాయి

ఆదేశించింది. ఈ దిశగా జీవో 145కు సవరణ చేయాలని, దానికి అనుగుణంగా నడుచుకునేలా తహసీల్దార్లు, ఎమ్మార్వోలను ఆదేశించాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. దరఖాస్తుదారుల హక్కును హరించేందుకు కొందరు ఈ నిబంధనను వాడుకుంటున్నారని తెలిపింది. ప్రస్తుత కేసులో అత్త అభ్యంతరం చెప్పిన కారణంగా కోడలికి సర్టిఫికెట్ జారీ చేయకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. పిటిషనర్‌కు రెండు వారాల్లో సర్టిఫికెట్ ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించింది. తమ ఆదేశాలు అమలయ్యాయో లేదో తెలుసుకునేందుకు తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఇటీవల తీర్పు వెలువరించారు.



ఇదీ కేసు..

విశాఖపట్నంకు చెందిన జ్యోతి, బంగారాజు భార్యాభర్తలు. విశాఖపట్నం మహిళా కోర్టులో అటెండర్‌గా పనిచేస్తున్న రాజు పెళ్లయిన ఏడాదిన్నరకే కరోనా కారణంగా చనిపోయాడు. దీంతో కారుణ్య నియామకం కోసం జ్యోతి జిల్లా జడ్జికి దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుతో పాటు సమర్పించడానికి ఆమె ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం మాకవరపాలెం తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై బంగార్రాజు తల్లి, జ్యోతి అత్త అయిన వరహాలమ్మ తహసీల్దార్‌కు లిఖితపూర్వక అభ్యంతరం తెలిపారు. బంగార్రాజు మరణానంతర ఆర్థిక ప్రయోజనాల్లో 75 శాతం ఇవ్వడంతో పాటు ఇంటిపైన, ఎకరా భూమిపైన హక్కును వదులుకుంటేనే జ్యోతికి సర్టిఫికెట్ ఇచ్చేందుకు 'నో అబ్జక్షన్' ఇస్తానని వరహాలమ్మ స్పష్టం చేశారు. ఈ అభ్యంతరంతో జ్యోతికి తహసీల్దార్ సర్టిఫికెట్ ఇవ్వలేదు. జ్యోతి జిల్లా కలెక్టర్‌ను, జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ విచారణ జరిపారు. పిటిషనర్ తరపు న్యాయవాది టీవీ శ్రీదేవి, అత్త తరపున న్యాయవాది సాయి నవీన్ వాదనలు వినిపించారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ విషయంలో 2017లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును అమికస్ క్యూరీ ఒ.మనోహర్‌రెడ్డి వివరించారు. ఈ సర్టిఫికెట్ జారీకి ఉద్దేశించిన జీవో 145ను న్యాయమూర్తి పరిశీలించారు. కుటుంబ సభ్యుల్లో ఎవరూ అభ్యంతరం చెప్పకపోతేనే సర్టిఫికేట్ ఇవ్వాలన్న నిబంధనపై న్యాయమూర్తి అభ్యంతరం తెలిపారు. విచారణ సమయంలో దరఖాస్తు గురించి సదరు కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకొచ్చి, దరఖాస్తుదారు వారి కుటుంబ సభ్యుడా? కాదా? అన్న విషయాన్ని తేల్చేందుకే ఆ నిబంధనను ఉపయోగించాలి తప్ప, మరో ప్రయోజనం కోసం కాదని న్యాయమూర్తి తెలిపారు. సర్టిఫికెట్ జారీకి ఎలాంటి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలి, వేటిని తోసిపుచ్చాలి తదితర విషయాలపై జీవోలో మరింత స్పష్టత ఇచ్చి ఉండాల్సిందని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు.

పారిశుద్ధ్య కార్మికులకు మంత్రి పాదపూజ

రామచంద్రపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల పాదాలను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ శనివారం కడిగారు. దుశ్శాలువాలు, పూలమాలలు, నూతన వస్త్రాలతో ఘనంగా సత్కరించారు. వీరితో పాటు పోలీసులు, వైద్యులను కూడా సన్మానించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ స్వచ్ఛతకు భోగి, స్వేచ్ఛకు సంక్రాంతి, సేవకు గుర్తుగా కనుమ పండుగ జరుపుకొంటారని తెలిపారు.


పారిశుద్ధ్య కార్మికుల పాదాలను కడుగుతున్న మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ

క్లుప్తంగా...

న్యాయమూర్తిగా పూర్తి సంతృప్తి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు



సింగరాయకొండ: తన జీవితంలో 30 ఏళ్ల న్యాయవాదవృత్తి కన్నా న్యాయమూర్తిగా ఒక ఏడాదిలోనే ఎంతో సంతృప్తి చెందానని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు చెప్పారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆయన తన స్వగ్రామం అయిన ప్రకాశం జిల్లా సింగరాయకొండకు వచ్చారు. తన నివాసంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జస్టిస్ కె.మన్మథరావు మాట్లాడుతూ న్యాయవాదిగా కేసులను న్యాయమూర్తుల దృష్టికి తీసుకువెళ్లగలమని, పరిష్కారం చూపలేమని తెలిపారు. అయితే, తాను న్యాయమూర్తి అయిన ఏడాదిలోనే 2,300 కేసులు పరిష్కరించానని, ఇది తనకు ఎంతో సంతృప్తిని కలిగిస్తోందని చెప్పారు. రెండుసార్లు జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొని 200 కేసులు పరిష్కరించానని వివరించారు. సింగరాయకొండలో కోర్టు ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తున్నానని చెప్పారు. కందుకూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ కేపీ రెడ్డయ్యకు కన్నీటి వీడ్కోలు

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



కేపీ రెడ్డయ్య భౌతికకాయం వద్ద గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

మొవ్వ(పామర్రు): బందరు మాజీ ఎంపీ కేపీ రెడ్డయ్యకు కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. అనారోగ్యం కారణంగా శుక్రవారం మరణించిన కేపీ రెడ్డయ్య అంత్యక్రియలను శనివారం ఆయన స్వగ్రామమైన కృష్ణా జిల్లా మొవ్వ మండలం కారకంపాడులో ప్రభుత్వ అధికార లాంఛనాలతో నిర్వహించారు. రెడ్డయ్యను కడసారి చూసేందుకు బంధుమిత్రులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున కారకంపాడుకు చేరుకున్నారు. ఆయన భౌతికకాయం వద్ద నివాళి అర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. గ్రామ శివారులోని తమ పొలంలో కేపీ రెడ్డయ్య అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. రెడ్డయ్య పెద్ద కుమారుడు, పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అంతిమ సంస్కారాలను పూర్తి చేశారు. రెడ్డయ్య కుమారులు కొలుసు సురేష్ బాబు, కొలుసు శ్రీకాంత్ పాల్గొన్నారు. రెడ్డయ్య భౌతికకాయం వద్ద నివాళి అర్పించినవారిలో మంత్రులు మేరుగు నాగార్జున, జోగి రమేష్, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కైలే అనిల్‌కుమార్, సింహాద్రి రమేష్, బి.మధుసూదన్ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు పాటూరి రామయ్య, ఉప్పులేటి కల్పన, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్, కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా, పలువురు నాయకులు ఉన్నారు.

అమ్మ కడుపు చల్లగా..

రాష్ట్రంలో రెండేళ్లుగా తగ్గిన మాతా, శిశు మరణాలు

- 2018లో ప్రతి వెయ్యి జననాల్లో శిశు మరణాలు 29
- 2019లో 25కు, 2020లో 24కు తగ్గుదల
- 2018లో ప్రతి లక్ష మందిలో ప్రసూతి మరణాలు 58
- 2020లో 45కు తగ్గిన ప్రసూతి మరణాలు
- కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ వెల్లడి
- మాతా శిశు మరణాల కట్టడికి వైఎస్ జగన్ సర్కారు పటిష్ట ప్రణాళిక..
- గ్రామ, వార్డు సచివాలయాల కేంద్రంగా కార్యాచరణ
- బాలింతల ఆరోగ్యంపై రాష్ట్రంలో నిరంతర పర్యవేక్షణ.. వైద్యం, మందులు, పౌష్టికాహారం అందిస్తున్న ప్రభుత్వం
- శిశువులకూ టీకాలు, నిరంతర వైద్య సేవలు



ఆస్పత్రుల్లోనే 97 శాతం ప్రసవాలు

ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. గతంలో ఆస్పత్రుల్లో కాన్పులు 92 శాతమే ఉంటే.. 2019 – 21లో 97 శాతానికి పెరిగింది. అత్యధిక కాన్పులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయి. మూడు శాతమే ఇళ్ల వద్ద జరుగుతున్నాయి.

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే ప్రజారోగ్యంపై దృష్టి పెట్టారు. మరీ ముఖ్యంగా మహిళలు, బాలల ఆరోగ్యం పరిరక్షణకు అనేక చర్యలు చేపట్టారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించడం, ఎప్పటికప్పుడు వైద్యం, మందులు అందిస్తున్నారు. ప్రభుత్వ చర్యలతో రాష్ట్రంలో మాతా, శిశు మరణాలు గణనీయంగా తగ్గాయి. జాతీయ స్థాయి సగటుతో పోల్చితే ప్రసూతి మరణాలతో పాటు శిశు మరణాలు రాష్ట్రంలో తక్కువగా ఉన్నాయి. అంతే కాకుండా ప్రసూతి మరణాలు తగ్గించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ సుస్థిర ప్రగతి లక్ష్యాలను సాధించినట్లు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ప్రసూతి మరణాలను తగ్గించడంలో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ప్రగతిని సాధించిందని పేర్కొంది. సుస్థిర ప్రగతి లక్ష్యం మేరకు ప్రతి లక్ష ప్రసవాల్లో ప్రసూతి మరణాలు 70లోపు ఉండాలి. 2017–18లో రాష్ట్రంలో లక్ష ప్రసవాల్లో 58 ప్రసూతి మరణాలు సంభవించగా 2020లో ఈ సంఖ్య 45కు తగ్గినట్లు కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ గత నెలలో విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. జాతీయ స్థాయిలో కూడా ప్రసూతి మరణాలు గణనీయంగా తగ్గినప్పటికీ రాష్ట్ర సగటు కన్నా ఎక్కువ ఉన్నాయి. 2017–18లో జాతీయ స్థాయిలో ప్రతి లక్ష ప్రసవాల్లో 103 ప్రసూతి మరణాలు సంభవించగా 2020లో 97కు తగ్గాయి. అలాగే సజీవ జననాల్లో శిశు మరణాలు జాతీయ స్థాయికన్నా రాష్ట్రంలో తక్కువగా ఉన్నాయి. రాష్ట్రంలో ప్రతి వెయ్యి సజీవ జననాల్లో శిశు మరణాలు 2018లో 29 ఉండగా 2019లో 25కు, 2020లో 24కు తగ్గినట్లు ఆ నివేదిక పేర్కొంది. ఇదే జాతీయ స్థాయిలో వెయ్యి సజీవ జననాల్లో 2018లో 32 శిశు మరణాలు సంభవించగా 2019లో 30కు, 2020లో 28కు తగ్గినట్లు తెలిపింది.

పటిష్ట ప్రణాళికతో గర్భిణులు, శిశువుల పరిరక్షణ



మాతా శిశు మరణాల సంఖ్య తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం గత మూడేళ్లుగా తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. గర్భిణులు, శిశువుల పరిరక్షణకు గ్రామ, వార్డు సచివాలయాల కేంద్రంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పటిష్ట ప్రణాళికను అమలు చేస్తోంది. వలంటీర్లు సచివాలయాల స్థాయిలో గర్భిణులు, 5 ఏళ్లలోపు బాలల వివరాలను ఇంటింటికీ వెళ్లి సేకరిస్తున్నారు. పిల్లలు, గర్భిణుల డేటా, ఆధార్‌ను ఆర్‌సీహెచ్ (పునరుత్పత్తి, పిల్లల ఆరోగ్య) పోర్టల్ ఐడీతో మ్యాపింగ్ చేస్తున్నారు. ఇప్పటికే 2.59 లక్షల గర్భిణుల వివరాలను మ్యాపింగ్ చేశారు. ఈ వివరాలను సచివాలయాల గృహ కుటుంబాల డేటాలో నిక్షిప్తం చేస్తున్నారు. ప్రత్యేక యాప్ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోఎక్కువ ప్రమాదం గల గర్భిణులను గుర్తించి వారికి సుఖ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో ఏఎన్ఎంలతో పాటు ఆశా వర్కర్లు నిరంతరం గర్భిణులు, పిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తున్నారు. ప్రతి పదిహేను రోజులకు ఏఎన్ఎం స్వయానా ఇంటికి వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్నారు. మందులు అందిస్తున్నారు. అవసరమైన వారికి వైద్య సహాయం అందిస్తున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద గర్భిణులకు బలవర్ధకమైన ఆహారాన్ని ఇస్తున్నారు. శిశువుల రక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక నవజాత సంరక్షణ యూనిట్ (ఎస్ఎన్సీయూ)లు పనిచేస్తున్నాయి. 5 ఏళ్లలోపు పిల్లలకు అవసరమైన టీకాలు ప్రభుత్వం వేయిస్తోంది. బాలలకు ఐఎఫ్ఏ సిరప్, డి–వార్మింగ్, విటమిన్ ఏ చుక్కలు అందిస్తోంది. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల కొరత లేకుండా చూడటం వలన గర్భిణులు, శిశువులకు నిరంతర వైద్య సేవలు అందుతున్నాయి.

మోదీకి ఆ సలహా ఇచ్చింది నేనే

సంక్రాంతికి సొంతూరొచ్చి చంద్రబాబు అర్థంపర్థం లేని మాటలు



జీవో నంబర్ 1 కాపీలను దహనం చేస్తున్న చంద్రబాబు నాయుడు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: సంక్రాంతి పండగకు సొంతూరు నారావారిపల్లెకు వచ్చిన చంద్రబాబు అక్కడా రాజకీయ ప్రసంగాలే చేశారు. భోగి మంట వేయడానికి అని చెప్పి వేకువజామునే రోడ్డుపైకి వచ్చి జీవో నంబర్ 1 ప్రతులను తగులబెట్టారు. మూడేళ్ల తరువాత స్వగ్రామానికి కుటుంబ సమేతంగా వచ్చిన ఆయన.. శనివారం మీడియా సమావేశంలో అర్థంపర్థం లేకుండా మాట్లాడారు. జీ–20 సదస్సుల్లో ప్రధాని మోదీకి తాను సలహా ఇచ్చానని చెప్పిన చంద్రబాబు.. ఆ సలహా ఏమిటో చెప్పలేదు. 'అదే 2047.. వందేళ్ల స్వాతంత్య్ర ఉత్సవాలను జరుపుకోబోతున్నాం. రాబోయే 2047కు ప్రపంచంలోనే తెలుగు జాతిని నంబర్–1గా నిలుపుతాను. ప్రపంచంలో ఉన్న తెలుగు వారందరూ స్థిరపడడానికి నేనే కారణం...' అంటూ అర్థంలేకుండా మాట్లాడారు. టెక్నాలజీ శక్తి ఉండడంతో 2047 వరకు యువత మనకు అండగా ఉంటుందని, ఆ తర్వాత మన యువత తగ్గిపోతుందన్నారు. దేశ భవిష్యత్తు కోసం పిల్లలను కనడం మన ధర్మమని చెప్పుకొచ్చారు. దేశంలోనే మొదటిసారిగా జాతీయ రహదారిని తానే ఏర్పాటు చేశానని చెప్పారు. వంటింటికే పరిమితమైన మహిళలను ఉద్యోగాలకు పంపించిన పార్టీ టీడీపీ అని అన్నారు. అది భువనేశ్వరి ప్రోత్సాహంతో జరిగిందన్నారు. ఏపీలోనే పెట్రోల్, విద్యుత్, నిత్యావసరాలు, ఇంటి పన్నుల రూపంలో అధికంగా వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. 'పుంగనూరులో 40 రోజుల్లో 100 మందిని అరెస్టు చేశారు. పెద్దిరెడ్డీ గుర్తుపెట్టుకో.. పండుగపూట నావాళ్లు జైల్లో ఉన్నారు. నువ్వెక్కడ ఉంటావో గుర్తుపెట్టుకో..' అని అన్నారు.

రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు

సినీ నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ

చంద్రగిరి(తిరుపతి జిల్లా): రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు ఉన్నాయని సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. ఓ నటుడిగా, ఎమ్మెల్యేగా, ఓటరుగా ఇది తన అభిప్రాయమని, రాష్ట్రంలోని పరిస్థితులనే 'వీరసింహారెడ్డి' సినిమాలో చూపించామని చెప్పారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నారావారిపల్లెకి వచ్చిన బాలకృష్ణ... శనివారం తన సతీమణి వసుంధర, కుమారుడు మోక్షజ్ఞ, కుమార్తెలు, కుటుంబ సభ్యులు, అభిమానులతో కలసి చంద్రగిరిలో 'వీరసింహారెడ్డి' సినిమాను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'వీరసింహారెడ్డి' ఫ్యాక్షన్ సినిమా కాదని, ప్రేక్షకులు కుటుంబ సమేతంగా చూస్తున్నారని తెలిపారు. ఈ సినిమాలో ప్రభుత్వాన్ని విమర్శిస్తూ డైలాగ్‌లు ఉన్నాయన్న దానిపై బాలకృష్ణ స్పందిస్తూ... ప్రజల అభిమానాన్ని ఎవరూ అడ్డుకోలేరని, అందరికీ వాస్తవాలు తెలుసని అన్నారు.



పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

ఎత్తిపోతలకు గట్టిమేలు

- సమర్థవంతంగా నిర్వహించే విధానాన్ని రూపొందించాలని సీఎం జగన్ ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎత్తిపోతల పథకాలను ప్రణాళికబద్ధంగా నిర్వహించడం ద్వారా ఆయకట్టుకు మరింత సమర్థవంతంగా నీళ్లందించడానికి రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఎత్తిపోతల పథకాల నిర్వహణలో కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలలో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనంచేసి.. మెరుగైన విధానాన్ని రూపొందించాలని జలవనరుల శాఖ అధికారులను సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. ఈ విధానం ప్రకారం ఆయకట్టు పరిధిలోని రైతులతో సంఘాలను ఏర్పాటుచేసి ఆయా ఎత్తిపోతలను నిర్వహించాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఐడీసీ) పరిధిలో రాష్ట్రంలో 1,117 ఎత్తిపోతల పథకాలున్నాయి. ఇందులో 916 పెద్ద ఎత్తిపోతల పథకాలు. 154 ఎత్తిపోతల పథకాలు మనుగడలో లేవు. చిన్న ఎత్తిపోతల పథకాలు 56 ఉండగా.. అందులో ఒక ఎత్తిపోతల మాత్రమే మనుగడలో లేదు. ఈ ఎత్తిపోతల పథకాల కింద 6,90,183.72 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ పథకాల పరిధిలో 3,70,635మంది రైతులు పంటలు సాగుచేసుకుంటున్నారు. ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తోంది. పెద్దపెద్ద మరమ్మతులూ చేయిస్తోంది. కానీ.. ఈ నిర్వహణ సక్రమంగా లేకపోవడంవల్ల తరచూ నీటి తోడకంలో సమస్యలు తలెత్తుతున్నాయి. దీనివల్ల ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే నిర్వహణ లోపాలను అధిగమించడం .. సమర్థవంతంగా ఎత్తిపోతలను నిర్వహించే విధానాలను రూపొందించాలని సీఎం జగన్ ఆదేశించారు. దీంతో ఇతర రాష్ట్రాల్లో ఎత్తిపోతల నిర్వహణకు అమలుచేస్తున్న విధానాలను అధికారులు అధ్యయనం చేస్తున్నారు. అత్యంత సమర్థవంతంగా ఎత్తిపోతలను నిర్వహించే విధానాన్ని రూపొందించేందుకు కసరత్తు చేస్తున్నారు.

రైతు సంఘాలతో నిర్వహణ..

ఇక ఎత్తిపోతలను సమర్థవంతంగా నిర్వహించడానికి రూపొందించిన విధానం అమలు బాధ్యతను వాటి పరిధిలోని ఆయకట్టు రైతులకే అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏపీఎస్ఐడీసీ అధికారుల పర్యవేక్షణలో రైతులే ఎత్తిపోతలను నిర్వహించేలా విధానాన్ని రూపొందించనున్నారు. ఇది రైతుల్లో బాధ్యతను పెంచుతుందని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ బిల్లులతోపాటు పెద్దపెద్ద మరమ్మతులకు ప్రభుత్వం నిధులు ఇస్తుండటం.. నిర్వహణ బాధ్యతలను రైతులకే అప్పగించడంవల్ల ఎత్తిపోతల పథకాలు సమర్థవంతంగా పనిచేయడానికి అవకాశాలు మెండుగా ఉంటాయని నీటిపారుదలరంగ నిపుణులు చెబుతున్నారు.

మానవ వ్యర్థాల శుద్ధికి ఎఫ్ఎస్టీపీలు

- 90 పట్టణాల్లో నిర్మాణం

సాక్షి, అమరావతి: మానవ వ్యర్థాలను నూరుశాతం శుద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. లక్ష కంటే తక్కువ జనాభా ఉన్న 90 పట్టణాల్లో ఫీకల్ స్లెడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్ఎస్టీపీ)లను నిర్మిస్తోంది. పట్టణాల్లోని నివాసాల నుంచి విడుదలవుతున్న మానవ వ్యర్థాలను వీటిలో శుద్ధి చేస్తారు. ఈ మానవ వ్యర్థాల తరలింపు ఇబ్బందికరంగా మారడంతోపాటు వాటిని బహిరంగ ప్రదేశాలు, నదుల్లో పారవేస్తుండడంతో భూగర్భ, నదీ జలాలు సైతం కలుషితమవుతున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా గోదావరి పరీవాహక ప్రాంతంలో ఈ కాలుష్యం అధికంగా ఉన్నట్టు గుర్తించారు. నీటిలో ఈ–కోలీ బ్యాక్టీరియా కూడా అధిక మోతాదులో ఉన్నట్లు గుర్తించారు. దీంతో నదుల్లో, భూగర్భ జలాల్లో మానవ వ్యర్థాలు చేరకుండా మున్సిపల్ శాఖ చర్యలు చేపట్టింది. అన్ని మున్సిపాలిటీల్లో సెప్టిక్ ట్యాంకుల నుంచి సేకరించిన వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు తరలించేలా చర్యలు చేపట్టారు. కొత్తగా చేపట్టిన 90 ఎఫ్ఎస్టీపీలు అందుబాటులోకి వస్తే చాలావరకు సమస్య పరిష్కారమవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఒక్కో ట్రీట్‌మెంట్ ప్లాంట్ రోజుకు 15 మిలియన్ లీటర్ల ఫీకల్ స్లెడ్జ్‌ను శుద్ధి చేసేసామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే రాజాం, బొబ్బిలి, పలమనేరు, వినుకొండ, నర్సాపూర్‌లో వినియోగంలోకి వచ్చాయి. మార్కాపురంలో ప్లాంట్ నిర్మాణం పూర్తి చేసుని ట్రయల్ రన్‌లో ఉండగా, గూడూరు, కనిగిరి, చీరాల, పొన్నూరు పట్టణాల్లో ప్లాంట్ల పనులు సగం పూర్తయ్యాయి. మరో 55 ప్లాంట్లకు టెండర్లు ఖరారు కాగా, మరో 25 ప్లాంట్లకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ టెండర్లు పిలవాల్సి ఉంది. మొత్తం 90 ప్లాంట్లు అందుబాటులోకి వస్తే రోజుకు సుమారు 1,350 మిలియన్ లీటర్ల మానవ వ్యర్థాలను శుద్ధి చేసేందుకు వీలుంటుంది.

వ్యర్థాల తరలింపునకు జీపీఎస్ వాహనాలు

నివాసాల నుంచి సేకరించిన మానవ వ్యర్థాలు నేరుగా ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు చేరేలా ఆధునిక వాహనాలను ఎస్సీ కార్పొరేషన్‌తో కలిసి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సమకూరుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 300 వాహనాలు అవసరం కాగా, తొలిదశలో 138 వాహనాలను సమకూరుస్తోంది. ప్రస్తుతం పారిశుధ్య పనులు చేస్తున్న సఫాయికరంచారీలకే వీటిని అందించాలని నిర్ణయించింది. అందుకోసం పట్టణాల్లో సభ్యుల బృందాలను ఎంపిక చేశారు. ఈ విధంగా దాదాపు 690 మందికి లబ్ధి చేకూరుతుంది. వీరు సెప్టిక్ ట్యాంకుల నుంచి వ్యర్థాలను వాహనంలో ప్లాంట్‌కు తరలించాలి. వాహనం కదలికలను గుర్తించి రికార్డు చేసేందుకు జీపీఎస్ అమరుస్తారు.

పోషకాల్లో మీసం మెలేస్తున్న రొయ్య



రొయ్యలతో రుచికరమైన వంటకం

- కొవ్వు తక్కువ.. ప్రొటీన్ ఎక్కువ
- కాల్షియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్ కూడా..
- గ్లైసమిక్ ఇండెక్స్ శాతం చాలా తక్కువ
- షుగర్, థైరాయిడ్, అల్జీమర్స్, క్యాన్సర్ వంటి వ్యాధులు దూరం
- 100 గ్రాముల చికెన్‌లో 8.1 గ్రాములు, మటన్‌లో 12.4 గ్రాముల కొవ్వు
- అదే రొయ్యల్లో కేవలం 0.51 గ్రాములు మాత్రమే
- వినియోగం పెంచేలా ప్రధాన నగరాల్లో ప్రాన్ ఫెస్టివల్స్

రొయ్యల్లో కొవ్వుశాతం ఎక్కువగా ఉంటుందని, తింటే పక్షవాతం వస్తుందని, గుండె జబ్బులొస్తాయని వింటుంటాం. కానీ ఇవేమి నిజం కాదని.. ఇతర మాంసాహారాలతో పోల్చుకుంటే రొయ్యల్లో ఉండే పోషకాలు చాలా ఎక్కువని, తింటే ఆరోగ్యానికి ఎంతోమేలని వైద్యనిపుణులు చెబుతున్నారు. రొయ్యల వినియోగాన్ని పెంచేందుకు కాకినాడ తరహాలో దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో ప్రాన్స్ ఫెస్టివల్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సాక్షి, అమరావతి

దేశీయ సగటు వినియోగం 800 గ్రాములే

రొయ్యల వినియోగంలో ప్రపంచంలో చైనా నంబర్ వన్ అని చెప్పాలి. ఇక్కడ సగటున ప్రతి ఒక్కరు 10–12 కిలోల రొయ్యలు తింటారు. అమెరికాలో సగటున 8–10 కిలోలు తింటారు. యూరోపియన్ దేశాల్లో సగటున ఎనిమిది కిలోలకు తక్కువ కాకుండా తింటుంటారు. రొయ్యల ఉత్పత్తిలో రారాజుగా ఉన్న మనదేశంలో మాత్రం రొయ్యల వినియోగం తక్కువే. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే సగటున 1.5 కిలోలు తింటున్నారు. దేశవ్యాప్తంగా సగటున రొయ్యల వినియోగం 800 గ్రాములకు మించడంలేదు. తలసరి వినియోగం పెంచడమే లక్ష్యంగా రొయ్యరైతు సంఘాలు, హేచరీలు, ప్రాసెసింగ్ కంపెనీలతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం వినూత్న ప్రయత్నం చేస్తోంది. దేశంలోనే తొలిసారి ప్రాన్స్ ఫెస్టివల్స్‌కు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే కాకినాడలో విజయవంతం కావడంతో ఇతర నగరాలపై దృష్టి సారించింది.

రొయ్యలతో దీర్ఘకాలిక జబ్బులకు క్షేమం

రొయ్యల్లో అధిక నాణ్యత కలిగిన ప్రొటీన్ పుష్కలంగా ఉండటం వల్ల మానవులకు అవసరమైన అన్ని అమైనోయాసిడ్స్‌తో సమతుల్యంగా ఉంటుందని ప్రపంచ ఆరోగ్యసంస్థ తన అధ్యయనంలో వెల్లడించింది. మనిషికి బరువును బట్టి కిలోకి 0.8 గ్రాముల ప్రొటీన్ అవసరం. క్రీడాకారులకైతే కిలోకి 1.4 గ్రాముల ప్రొటీన్ కావాలి. రోజూ వందగ్రాముల రొయ్యలు తింటే శరీరానికి అవసరమైన ప్రొటీన్ లభిస్తుంది. రొయ్యల్లోని పిండి పదార్థాలు, కొవ్వుల ద్వారా వచ్చే కేలరీలు తక్కువ. ఇవి బరువు పెరగకుండా ఉండటానికి దోహదపడతాయి. ఇతర మాంసాల కంటే టోటల్ ఫ్యాట్, సాచురేటెడ్ ఫ్యాట్‌తో పాటు గ్లైసమిక్ ఇండెక్స్ చాలా తక్కువ. ఈ కారణంగా గుండె జబ్బులు, టైప్–2 మధుమేహంతోపాటు రక్తపోటును నియంత్రిస్తాయి. ఆరోగ్యకరమైన ఆహారంలో కనీసం 0.54 కంటే ఎక్కువ నిష్పత్తిలో ఉండే పుఫా (పాలీ అన్‌సాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్), ఎస్ఎఫ్ఏ (సాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్) ఆరోగ్యకరమైన కొవ్వు ఆమ్లాల సమృద్ధిని సూచిస్తుంది. ఇవి రొయ్యల్లో 1.5 నిష్పత్తిలో ఉండడం వలన రక్తంలో కొలెస్ట్రాల్ ఆరోగ్యకరమైన రీతిలో ఉంటుంది.

పిల్లల్లో జ్ఞాపకశక్తి వృద్ధి

రొయ్యల్లోని లైపోఫిలిక్ కేరోటీనోయిడ్స్ (ఎల్ఎఫ్సీ) అనే యాంటి ఆక్సిడెంట్ మిగిలిన వాటికంటే 10 నుంచి 100 రెట్లు శక్తిమంతంగా ఉంటాయి. ఇది కణాల వాపును తగ్గిస్తుంది. చర్మాన్ని ఆరోగ్యకరంగా ఉంచడం ద్వారా వృద్ధాప్యఛాయలను తగ్గిస్తుంది. ధమనులను బలోపేతం చేస్తుంది. రొయ్యల్లోని డీహెచ్ఏ (డెకోసా హెక్సానోక్ యాసిడ్) మెదడు కణాల పనితీరును మెరుగుపరుస్తుంది. ఆస్టాక్సన్‌తిన్ యాసిడ్స్ వల్ల వృద్ధుల్లో అల్జీమర్స్ వ్యాధిని తగ్గించడంతోపాటు పిల్లల్లో జ్ఞాపకశక్తిని పెంపొందిస్తుంది. రొయ్యల్లోని మినరల్స్ కాల్షియం , మెగ్నీషియం, పొటాషియం, ఫాస్ఫరస్, అయోడిన్, జింక్, కాపర్, ఐరన్, సెలీనియం, విటమిన్లు ఏ, బీ, డీ, ఈ.. ఎముకల బలాన్ని, రోగనిరోధకశక్తిని పెంచడమేగాక థైరాయిడ్ గ్రంథుల పనితీరును మెరుగుపరుస్తాయి. అంతర్గత అవయవాలవాపు తగ్గించడం, నరాలు, మెదడు పనితీరు మెరుగుపర్చడంతోపాటు క్యాన్సర్ వ్యాధిని తగ్గించడంలో తోడ్పడతాయి. ఇలా అన్ని విధాలుగా రొయ్యల్లో ఉండే పోషకాలు మానవాళికి ఉపయోగపడతాయి.



పరాక్రమశాలి కంటే దీర్ఘశాంతము గలవాడు శ్రేష్ఠుడు.
పట్టణము పట్టుకొనువానికంటే తన మనస్సును
స్వాధీన పరచుకొనువాడు శ్రేష్ఠుడు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు పుష్య మాసం, **తిథి:** బ.అష్టమి ప.2.29 వరకు తదుపరి నవమి, **నక్షత్రం:** చిత్త ప.2.44 వరకు తదుపరి స్వాతి, **వర్జ్యం:** ఉ.8.11 నుండి 9.47 వరకు, తిరిగి రా.8.20 నుండి 9.55 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.11 నుండి 4.55 వరకు వరకు, **అమృతఘడియలు:** ఉ.8.10 నుండి 9.43 వరకు, మకర సంక్రాంతి.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.39
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

ఎం.కె. స్టాలిన్ (తమిళనాడు సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు


మనిషిని చూస్తే శుభ్రంగా ఉన్నాడు. సంప్రదాయంగా ఉన్నాడు. ధోతీ–చొక్కా ధరించి ఉన్నాడు. శ్రీమతితో కలిసి నడుస్తున్నాడు!

"ఈయన రవి కదా, మన తమిళనాడు గవర్నర్!" అన్నాను... ఫొటోలో అలా శుభ్రంగా, సంప్రదాయంగా, ధోతీ–చొక్కా ధరించి, శ్రీమతితో కలిసి నడుస్తున్న వ్యక్తిని రఘుపతికి చూపిస్తూ.

"ఆమా తలైవా. అలాగే అనిపిస్తోంది.." అన్నారు రఘుపతి. ఆయన 'లా' మినిస్టర్.

"అనిపించడం కాదు, కనిపిస్తున్నది ఆయనే" అని నవ్వారు పెరియస్వామి. ఆయన రూరల్ మినిస్టర్. ఆయన చేతిలో మరికొన్ని ఫొటోలు ఉన్నాయి.

ఆ ఫొటోల్లో కూడా రవి శుభ్రంగా, సంప్రదాయంగా ఉన్నారు. రాజ్‌భవన్ పొంగల్ ఈవెంట్‌కు వచ్చిన వారందరినీ వారి దగ్గరకు వెళ్లి మరీ ఆత్మీయంగా పలకరిస్తున్నారు. పొంగల్ శుభాకాంక్షలు చెబుతున్నారు. నీలగిరి ట్రైబల్స్ కొందరు ఎంపికగా తెంపుకొచ్చి,



గుత్తిగా ముడి వేసి తెచ్చిన కొండపూల బొకేను అపురూపంగా స్వీకరిస్తున్నారు. కేరళ నుంచి వచ్చిన బ్రాహ్మణులు పూజలు నిర్వహించి ఇచ్చిన 'పరివట్టమ్'ను భక్తి ప్రపత్తులతో శ్రద్ధగా తన తలకు చుట్టుకుంటున్నారు.

ఆ ఫొటోలను పెరియస్వామికి తిరిగి ఇచ్చేస్తూ... "ఇంత శుభ్రమైన, సంప్రదాయ బద్ధమైన మనిషి మొన్న అసెంబ్లీలో అలా ఎందుకు బిహేవ్ చేశారంటారు!!" అన్నాను.

రఘుపతి, పెరియస్వామి మాట్లాడలేదు. ఆ ప్రశ్న అందరిలోనూ ఉంది. సమాధానం గవర్నర్ రవి మాత్రమే చెప్పగలిగింది.

రవికి, తమిళనాడుకు సంబంధమే లేదు. బిహార్ అతడి రాష్ట్రం. కేరళ అతడి క్యాడర్. ఢిల్లీ అతడి వర్క్‌ప్లేస్. మేఘాలయకు, నాగాలాండ్‌కు గవర్నర్‌గా ఉన్నారు. అలాగే ఇప్పుడు తమిళనాడుకు.

మేఘాలయకు గవర్నర్‌గా ఉన్నప్పుడు ఆయన మేఘాలయను మేఘాలయ అనే అన్నారు. నాగాలాండ్‌కు గవర్నర్‌గా ఉన్నప్పుడు నాగాలాండ్‌ను నాగాలాండ్ అనే అన్నారు. తమిళనాడును మాత్రం తమిళనాడు అనడం లేదు. 'తమిళగం' అంటున్నారు. బయటా అదే మాట. అసెంబ్లీలోనూ అదే మాట!

తమిళనాడు అంటే 'తమిళభూమి' అనే అర్థం వస్తుంది కనుక.. అప్పుడది భరత భూమికి సంబంధం లేని స్వతంత్ర దేశంగా అనిపించే ప్రమాదం ఉంది కనుక.. తమిళ నాడును 'తమిళుల ప్రాంతం' అనే అర్థం వచ్చేలా 'తమిళగం' అనడమే కరెక్ట్ అని తను గవర్నర్‌గా వచ్చినప్పటి నుంచీ రవి అంటూనే ఉన్నారు.

కాన్‌స్టిట్యూషన్‌ని రవి కాస్త ఎక్కువగా చదివినట్లున్నారు. ఎక్కువ చదివితే ముఖ్యమైనవి కొన్ని తక్కువగా అనిపిస్తాయి. మంత్రి మండలి తీసుకున్న నిర్ణయాలలో గవర్నర్ తల దూర్చకూడదని, వేలు పెట్టకూడదని, కాలు దువ్వకూడదని ఆర్టికల్ 163 (1) లో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రాసిచ్చిన అసెంబ్లీ ప్రసంగంలోంచి మహనీయులు పెరియార్‌ని, అంబేడ్కర్‌ని, కామరాజ్‌ని అన్నాదురైని తొలగించి, తమిళనాడుకు బదులు తమిళగంను చేర్చి, అలా ఎలా చేస్తారని ప్రశ్నించినందుకు వాకౌట్ చేసి.. గవర్నర్ రవి ఎవరి ఔన్నత్యాన్ని నిలబెట్టినట్లు! రాజ్యాంగానిదా, రాజ్‌భవన్‌దా?

రాజ్యాంగ నియమాలను శిరసావహించని ఈ పెద్దమనిషేనా ఇప్పుడు పొంగల్ సంప్రదాయాలను గౌరవిస్తూ కనిపిస్తున్నది!!

"ఫొటోలు మనకెందుకు పంపారట?" అని పెరియస్వామిని అడిగాను.

"పొంగల్ ఈవెంట్‌కి పిలిచినా మనం వెళ్లలేదని పొంగల్ ఈవెంట్‌నే మనకు పంపారు" అన్నారు నవ్వుతూ పెరియస్వామి. ఆ నవ్వుకు ఆయన చేతిలోంచి ఒక ఫొటో జారి కింద పడింది.

'హ్యాపీ పొంగల్ – ఇట్లు మీ ప్రియమైన రవి'.. అని ఆ ఫొటో వెనుక రాసి ఉంది!

క్రాంతి - సంక్రాంతి



జనతంత్రం

వర్ధెల్లి మురళి



'అగ్రికల్చర్ ఈజ్ అవర్ కల్చర్' అని గర్వంగా చెప్పుకునే జాతి మనది. వ్యవసాయం మన జీవన విధానం అనే నానుడి కూడా ఉన్నది. వ్యవసాయేతర వృత్తులు కూడా ఒకనాడు వ్యవసాయానికి అనుబంధంగానో, దాని చుట్టూనో అల్లుకున్నవే కావడం ఈ నానుడికి కారణం. కనుకనే మన జీవన గమనంలో ఇప్పటికీ అడుగడుగునా వ్యవసాయ సంస్కృతి తొంగి చూస్తున్నది. పలకరిస్తున్నది. ఆటలో, పాటలో, పలకరింపులో, వేడుకలో, వంటలో, విందులో, పండుగలో... ఇలా ప్రతి ఉత్సాహంలో, ఉద్వేగంలో, ఉత్తేజంలో వెన్నంటే నడుస్తున్న మన మేనిఛాయ వ్యవసాయం.

వ్యవసాయ జీవితపు శిరస్సుపై ప్రకృతీ, పర్యావరణాలు అందంగా అలంకరించిన శిరోభూషణం – పట్టుకుచ్చుల పంచరంగుల తలపాగా సంక్రాంతి పండుగ. ఈ పండుగ హరిదాసులు పాడే ఒక పాట. గాలిపటాలు, కోడి పుంజుల ఆట. రంగవల్లుల రంగుల చిత్రం. గొబ్బెమ్మల ఆరోగ్య తంత్రం. తృప్తిపడిన జీవితపు నర్తనోత్సవం. ఒక్క మానవ జీవితపు ఉల్లాసమే కాదు... సమస్త ప్రకృతి పర్యావరణ శక్తుల సమష్టి సెలబ్రేషన్ సంక్రాంతి.

దేశంలోని ప్రధాన వ్యవసాయాధార రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ఇప్పటికీ ఎక్కువమంది ప్రజలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వ్యవసాయరంగంపై ఆధారపడుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమైనది. వ్యవసాయ అనుబంధ రంగాలు రాష్ట్ర సంపదకు చేర్చుతున్న వాటా కూడా దేశ సగటుతో పోలిస్తే ఎక్కువే. మకర సంక్రాంతి పండుగ వైభవం కూడా ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువ. ఇక్కడే ఇప్పుడు సంక్రాంతి శోభతో ముడిపడిన ఒక రాజకీయ యుద్ధమేఘం ఆవహించి ఉన్నది. సంక్రాంతి స్ఫూర్తిని రగిలించే రాజకీయం ఒకవైపు, దహించే రాజకీయం ఒకవైపు మోహరించి ఉన్నాయి.

ప్రజా జీవితాల్లోకి పాలనా కాంతుల సంక్రమణం చేయించిన సంక్రాంతి రాజనీతి ఒకవైపు – ఆ క్రాంతిని కబళించాలని చూస్తున్న రాహు, కేతు పన్నాగం మరోవైపూ నిలబడి తలపడేందుకు సిద్ధపడుతున్నాయి. ముక్కారు పంటలతో అలరారిన ముప్పై మూడువేల ఎకరాల హరితావరణాన్ని బీడుగా మార్చి, ప్రకృతి గుండెల్లో కాంక్రీట్ గునపం గుచ్చాలని చూస్తున్న రాజకీయ పెత్తందార్లు ఒకపక్కన నిలబడ్డారు. ప్రతి పల్లెకూ పట్టాభిషేకం చేసి రాజధానిగా గౌరవించి, పంట చేనుకూ, రైతుబిడ్డకూ రాచ మర్యాదను కల్పించిన ప్రజానాయకుడు మరోపక్కన నిలబడ్డాడు. తల్లీ సంక్రాంతీ, పుష్యలక్ష్మీ నీవే తీర్పు చెప్పాలి!

జంధ్యాల పాపయ్యశాస్త్రి రచించిన అజరామర కావ్యం 'పుష్పవిలాపం' గుర్తుకొస్తున్నది. "నేనొక పూలమొక్క కడ నిల్చి, చివాలున కొమ్మ వంచి గోరానెడు నంతలోన విరులన్నియు జాలిగ నోళ్లు విప్పి 'మా ప్రాణము తీతువా' యనుచు బావురుమన్నవి, కృంగిపోతి" అంటాడు. బావురుమనడమే కాదు, చివర్లో ఆ పూమొగ్గలన్నీ మనుషుల్ని శపించాయని కూడా అంటాడు.

'ఓయీ మానవుడా... బుద్ధదేవుని భూమిలో పుట్టినావు, సహజమగు ప్రేమ నీలోన చచ్చెనేమి? అందమును హత్యచేసెడి హంతకుండ! మైలపడిపోయె నోయి నీ మనుజ జన్మ' అన్నాయట! పాపయ్యశాస్త్రి సొంత జిల్లా గుంటూరులోనే ముప్పై మూడు వేల ఎకరాలను బీడు చేసినప్పుడు ఎన్ని లక్షల పూబాలలు ఎన్ని రకాల శాపనార్థాలు పెట్టి ఉంటాయో!

మన పెత్తందార్ల ముఠామేస్త్రీ చంద్రబాబును ఇప్పుడు కొందరు 'బోల్సోనారో ఆఫ్ ఆంధ్రా' అని పిలుస్తున్నారు. నిజానికి అలా పిలవడం తప్పు. బోల్సోనారోనే 'చంద్రబాబు ఆఫ్ బ్రెజిల్'గా పిలవాలి. ప్రపంచవ్యాప్తంగా ఉండే పెత్తందార్లందరూ అభివృద్ధి పేరుతో ముద్దుగా పిలుచుకునే దోపిడీ మోడల్‌ను అనుసరించడంలో బోల్సోనారో కంటే చంద్రబాబు ఇరవయ్యేళ్లు సీనియర్. ఈ మధ్యకాలంలో అపురూపమైన అమెజాన్ అడవులను వందల కిలోమీటర్ల పర్యంతం నరికివేసి, ప్రాణవాయువును సైతం లూటీ చేయడానికి తెగబడిన ఘనుడు బోల్సోనారో. ఎన్నికల్లో ఓడిపోయినా ఒప్పుకోకుండా కబ్జాకోరుతనంతో కాలు దువ్వి 'ట్రంపరి'తనాన్ని ప్రదర్శించడాన్ని కూడా ప్రపంచం గమనించింది.

అటువంటి బోల్సోనారోలకు గురుపాదులు మన బాబు. వీరి అభివృద్ధి మోడల్ సిద్ధాంతం ప్రకారం డబ్బే పెట్టుబడి. అధికారం దానికి అండ. ఈ రెండూ ఉన్నవారు సమస్త సహజ వనరుల్నీ, మానవ

> వేల ఎకరాల్లో విస్తరించిన పచ్చందనాలకు ఉరి బిగించే చంద్రబాబు అభివృద్ధి నమూనాను వైఎస్ జగన్ తిరస్కరించారు. రాజధాని వికేంద్రీకరణకు నడుం కట్టారు. జనసాధికారతలో వికేంద్రీకరణ అనేది తొలి అడుగు. ఆ వికేంద్రీకరణను మరింత విప్లవాత్మకం చేసి 15 వేల మినీ రాజధానులను ఆయన సృష్టించారు. పేద ప్రజల పురోగతికి అత్యవసరమైన నాణ్యమైన విద్య, వైద్యాలను ధనికులతో సమానంగా ఉచితంగా అందుబాటులోకి తెచ్చారు. వ్యవసాయ రంగానికి అవసరమైన ఉపకరణాలు ఇంటి ముంగిట కొచ్చాయి. నడివయసు మహిళలు కూడా ప్రభుత్వ 'చేయూత'తో చిన్నచిన్న వ్యాపారాలు చేయగలుగుతున్నారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు పెద్దపెద్ద అడుగులు వేస్తున్నాయి. ఈ పరిణామాల ప్రభావం సంక్రాంతిపై పడింది.
>
> పల్లెపల్లెనా సంక్రాంతి శోభ పరుచుకున్నది. పండుగ షాపింగ్‌లతో పట్టణాలు కళకళలాడుతున్నాయి. పండుగలకు పల్లెటూళ్లకొచ్చే జనం కూడా పాత రికార్డులను బద్దలు కొట్టారు. మూడేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురవడం, ఒక్కటంటే ఒక్కటైనా కరువు మండలం లేకపోవడం పల్లెల్లో పండుగ కాంతిని ద్విగుణీకృతం చేసింది. ధాన్యానికి గిట్టుబాటు ధర దొరకలేదన్న మాట వినిపించడం లేదు. పొలం నుంచి రైతునూ, సముద్రం నుంచి మత్స్యకారుణ్ణి, అడవి నుంచి గిరిజన బిడ్డను వేరుచేయని సుస్థిర అభివృద్ధి మార్గాలను జగన్ ప్రభుత్వం అనుసరిస్తున్నది.

శ్రమనూ యథేచ్ఛగా దోపిడీ చేయవచ్చు. నదుల్ని కలుషితం చేయవచ్చు. కొండల్ని పిండి చేయవచ్చు. అడవుల్ని నరికేయవచ్చు. కాంక్రీట్ అరణ్యాలను నిర్మించవచ్చు. మానవ శ్రమను, మేధను కారుచౌకగా కొనేయవచ్చు. ఫలితంగా ఇబ్బడి ముబ్బడిగా సంపద సృష్టి సాధ్యమవుతుంది. ఈరకంగా అభివృద్ధి సాధిద్దామంటారు మన బాబులు, ప్రపంచవ్యాప్తంగా ఉండే వారి బాబులు కూడా!

ఇది అమానవీయమైన అభివృద్ధి అనే విమర్శలు చాలాకాలంగా ఉన్నాయి. ఇందుకు ప్రత్యామ్నాయంగా చాలా నమూనాలు ముందుకొస్తున్నాయి. సుస్థిర అభివృద్ధి నమూనా ఒకటి. మానవ వికాసానికి అవసరమైన మేరకు సహజ వనరుల్ని హేతుబద్ధంగా వాడుకొని వాటిని భవిష్యత్ తరాల అవసరాలకోసం కూడా మిగిల్చే పద్ధతులను ఈ నమూనా అనుసరిస్తుంది. మానవ శ్రమను, మేధను వనరులుగా కాక పెట్టుబడిగానే గుర్తించాలన్న ఆలోచనలు కూడా ముందుకు వస్తున్నాయి. వీటి సారాంశం ఒక్కటే – ఈ ప్రపంచం అందరిదీ, సమస్త జీవరాశిది. ఈ తరాలకే కాదు భవిష్యత్తు తరాలకు కూడా చెందినది. మానవ జాతి సమష్టిగా సృష్టించుకునే సంపద కూడా అందరికీ చెందినది. సంపద సృష్టి – పంపిణీ హేతుబద్ధంగా ఉండాలి. ఇది ప్రజాహితమైన, పర్యావరణ హితమైన అభివృద్ధి మోడల్.

ఈ రెండో రకమైన అభివృద్ధిలోనే నిజమైన జనక్రాంతి ఇమిడి ఉన్నది. అసలైన సంక్రాంతి దాగి ఉన్నది. ఈ సంక్రాంతికి సంకెళ్లు వేయాలంటుంది బోల్సోనారో – బాబు అభివృద్ధి మోడల్. ఈ సంక్రాంతులు జనజీవితమంతా పరుచుకోవాలంటుంది ప్రత్యామ్నాయ అభివృద్ధి మోడల్. ఆంధ్రప్రదేశ్‌లో మొదటి మోడల్‌కు చంద్రబాబు, రెండో మోడల్‌కు ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం వహిస్తున్నారని ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరమే లేదు. వారిద్దరి విధాన నిర్ణయాల బేరీజుతోనే ఈ అంచనాకు రావచ్చు.

వేల ఎకరాల్లో విస్తరించిన పచ్చందనాలకు ఉరి బిగించే చంద్రబాబు అభివృద్ధి నమూనాను వైఎస్ జగన్ తిరస్కరించారు. రాజధాని వికేంద్రీకరణకు నడుం కట్టారు. జనసాధికారతలో వికేంద్రీకరణ అనేది తొలి అడుగు. ఆ వికేంద్రీకరణను మరింత విప్లవాత్మకం చేసి పదిహేను వేల మినీ రాజధానులను ఆయన సృష్టించారు. పేద ప్రజల పురోగతికి అత్యవసరమైన నాణ్యమైన విద్య, వైద్యాలను ధనికులతో సమానంగా ఉచితంగా అందుబాటులోకి తెచ్చారు. వ్యవసాయ రంగానికి అవసరమైన ఉపకరణాలు ఇంటి ముంగిటకొచ్చాయి. నడివయసు మహిళలు కూడా ప్రభుత్వ 'చేయూత'తో చిన్నచిన్న వ్యాపారాలు చేయగలుగుతున్నారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు పెద్దపెద్ద అడుగులు వేస్తున్నాయి. ఈ పరిణామాల ప్రభావం సంక్రాంతి పండుగపై కూడా పడింది.

పల్లెపల్లెనా సంక్రాంతి శోభ పరుచుకున్నది. పండుగ షాపింగ్‌లతో పట్టణాలు కళకళలాడుతున్నాయి. బట్టలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాహనాల కొనుగోళ్లు కొత్త రికార్డులు నెలకొల్పాయి. పండుగలకు పల్లెటూళ్లకొచ్చే జనం కూడా పాత రికార్డులను బద్దలు కొట్టారు. మూడేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురవడం, ఒక్కటంటే ఒక్కటైనా కరువు మండలం లేకపోవడం పల్లెటూళ్లలో పండుగ కాంతిని ద్విగుణీకృతం చేసింది. ధాన్యానికి గిట్టుబాటు ధర దొరకలేదన్న మాట వినిపించడం లేదు. అమూల్ డెయిరీ ప్రవేశంతో రాష్ట్రంలో మళ్లీ సహకార పాడి వ్యవస్థ జవజీవాలు పుంజుకున్నది.

పొలం నుంచి రైతునూ, సముద్రం నుంచి మత్స్యకారుణ్ణి, అడవి నుంచి గిరిజన బిడ్డను వేరుచేయని సుస్థిర అభివృద్ధి మార్గాలను వైఎస్ జగన్ ప్రభుత్వం అనుసరిస్తున్నది. పరిశ్రమల పేరిట కార్పొరేట్ పెద్దలకు కట్టబెట్టడానికి ఎక్కడా చారెడు పొలం లాక్కోలేదు. పైగా రైతు భరోసాతోపాటు ఆర్బీకేల ద్వారా బతుకు భరోసాను కూడా రైతులకు కల్పిస్తున్నది. గనుల తవ్వకం పేరిట గిరిజనుల్ని తరిమేయలేదు. గిరిజన రైతులకు అన్నివిధాల అండగా నిలబడి వాణిజ్య పంటల సాగును ప్రోత్సహిస్తున్నది. గత్యంతరం లేక గంజాయి ఉచ్చులో చిక్కుకున్న వారిలో పరివర్తన తీసుకు వస్తున్నది. మత్స్యకారులు దూర దేశాలకు వలస పోకుండా అనేక చర్యలు తీసుకున్నది. ఆధునికమైన ఫిషింగ్ హార్బర్లను నిర్మిస్తున్నది. ఈ పరిణామాలన్నీ నేటి సంక్రాంతి పండుగ కాంతులీనేందుకు కారణమవు తున్నాయి. కొత్త కాంతితో, కొత్త క్రాంతితో సంక్రాంతి మెరుస్తున్నది.

vardhelli1959@gmail.com

ఆ పాటను ఇక వినలేమా?

కామెంట్




కరణ్ థాపర్

డూన్ స్కూల్‌లో పిల్లలందరూ సమావేశమయ్యే వేళ తరుచుగా పాడే పాట నా బాల్య జీవితంలోనే అత్యంత మధురమైన జ్ఞాపకాల్లో ఒకటిగా నిలిచింది. మాలో కొద్దిమందిమి మాత్రమే ఆ పాటలోని పదాలను అర్థం చేసుకునేవాళ్లం. ఎందుకంటే, ఆ పాట ఉర్దూలో ఉండేది. కానీ దాని వెంటాడే శ్రావ్యత మమ్మల్ని కట్టిపడేసేది. యాభై సంవత్సరాల తర్వాత కూడా ఆ పాటను ఎవరైనా మర్చిపోయి ఉంటారంటే నాకు సందేహమే. "లబ్ పే ఆతీ హై దువా బన్‌కే తమన్నా మేరీ" మాకెంతో ఇష్టమైనది. దశాబ్దాల తర్వాత మాత్రమే ఆ పాటను రాసింది సుప్రసిద్ధ కవి ఇక్బాల్ అని నేను తెలుసుకున్నాను. ఆయనే రాసిన "సారే జహాసె అచ్ఛా హిందూస్తాన్ హమారా" స్థాయిలో నేను దీన్ని కూడా ఇష్టపడతాను.

గత నెలలో, ఈ పాటను బరేలీ(ఉత్తరప్రదేశ్)లోని ఒక పాఠశాలలో పాడినప్పుడు, విశ్వహిందూ పరిషత్‌కు చెందిన సోంపాల్ సింగ్ రాథోడ్ దానిమీద పోలీసులకు ఫిర్యాదు చేశారు. "హిందువుల మనోభావాలను గాయపర్చే ఉద్దేశంతో ఉపాధ్యాయులు పాఠశాల పిల్లల చేత ముస్లిం పద్ధతిలో పఠింపజేస్తున్నారు... ఇస్లాం వైపు పిల్లలను ఆకర్షించడానికే ఇలా చేస్తున్నారు... ఉపాధ్యాయులు హిందువుల మనోభావాలను గాయపరుస్తూ విద్యార్థులను మతమార్పిడికి సిద్ధం చేస్తున్నారు" అని ఆయన ఆరోపించారు. మనోభావాలను గాయపర్చే ఆ పదాలు ఏవంటే... "మేరే అల్లా బురాయీ సే బచానా ముఝ్‌కో". దీనికి వెంటనే స్పందించిన విద్యా శాఖ ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసింది.

ఈ సంఘటన నన్ను దిగ్భ్రాంతికి గురిచేసింది. నిజానికి అది ఒక వెర్రి మాట. ఇది నన్ను విచారపడేలా, కలవరపడేలా చేసింది. ఇది మన దేశంలో మనం ఎలా మారుతున్నామో చూపుతున్న ఒక విచారకరమైన ప్రతిఫలనమా? లేక నేను యుగాల వెనుకటి మర్చిపోదగిన డైనోసార్‌లా ఉంటున్నానా? నాలో నేను ఈ ప్రశ్నలను వేసుకుంటున్నప్పుడు, డూన్ స్కూల్లో మాకు మరో ఇష్టమైన గీతం అయిన విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ సుప్రసిద్ధ ప్రార్థనా గీతం గుర్తుకొచ్చింది.



'సారే జహాసే అచ్ఛా' రచయిత మహమ్మద్ ఇక్బాల్

"ఎక్కడ మనసు నిర్భయంగా ఉంటుందో, ఎక్కడ మనుషులు తలలెత్తి తిరుగుతారో, ఎక్కడ జ్ఞానం విరివిగా వెలుస్తుందో, ఎక్కడ సంసారపు గోడల భాగాల కింద ప్రపంచం విడిపోలేదో... ఆ స్వేచ్ఛా స్వర్గానికి, తండ్రీ, నా దేశాన్ని మేల్కొలుపు!" కానీ మన దేశంలో ఇలాంటిది ఇప్పుడు జరుగుతోందా?

అలా జరగాలని నేను ఆశిస్తున్నాను. కానీ నా భయాలు అతిశయోక్తులని నేను భావించడం లేదు. క్రిస్మస్ పర్వదినానికి కొన్ని రోజుల ముందు న్యూఢిల్లీలో ఒక పాస్టర్ ప్రజలను మతమార్పిడి చేస్తున్నాడన్న ఆరోపణలు వచ్చాయి. నిజానికి, ఆయన అధ్యక్షత వహించిన ఆ సమూహం క్రిస్మస్ గీతాలను పాడింది. నిరసనకారులు ఆ సమావేశం జరుగుతున్న ప్రాంతానికి వెలుపల పోగయ్యి 'జై శ్రీరామ్', 'భారత్ మాతా కీ జై' అంటూ నినాదాలు ఇవ్వడం ప్రారంభించారని పత్రికలు నివేదించాయి. దీంతో వెంటనే అది హిందూ వర్సెస్ క్రిస్టియన్ ఘర్షణగా మారిపోయింది.

మహాత్మాగాంధీకి ఎంతో ఇష్టమైన 'ఎబైడ్ విత్ మి' కీర్తనను గణతంత్ర దినోత్సవం ముగింపు వేడుకల్లో భాగంగా సైన్యం నిర్వహించే బీటింగ్ రిట్రీట్‌లో వినిపించేవారు. ఎంతో మంది ఇష్టంగా ఎదురుచూసే దీన్ని ఏడు దశాబ్దాలపాటు వినిపిస్తూ వచ్చారు. అనేకమంది ప్రజలు ఈ కీర్తనను వింటూ ప్రత్యేకించి ముందుకు సాగేవారు. ఎందుకంటే వెంటాడే ఈ రాగం నార్త్ బ్లాక్ నుండి గంటల గణగణ శబ్దంతో ప్రతిధ్వనించేది. కానీ గత సంవత్సరం ఈ సుప్రసిద్ధమైన బీట్‌ను తొలగించారు. దశాబ్దాలుగా సైనిక సంప్రదాయంగా కొనసాగుతూ వచ్చిన దీని స్థానంలో 'యే మేరే వతన్ కే లోగో' పాటను చేర్చారు. ఇది వలస సామ్రాజ్య వారసత్వం నుంచి "విముక్తి పొందుతున్న నవ భారతం" అంటూ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సీనియర్ సలహాదారు కంచన్ గుప్తా 'బీబీసీ'కి వెల్లడించారు. "బ్రిటిష్ వారు ప్రారంభించిన ట్యూన్‌లను మన మిలిటరీ బ్యాండులు 75 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత కూడా ఆలపించడంలో ఏ అర్థమూ లేదు" అని ఆయన పేర్కొన్నారు. 'ఎబైడ్ విత్ మి' పాటను తీసివేయడం అనేది భారత్‌ను నిర్వలసీకరించే కొనసాగింపు ప్రక్రియలో భాగమేనని ఆయన అభిప్రాయపడ్డారు.

నిజమే కావచ్చు. కానీ మహాత్మా గాంధీ దీనిగురించి ఏం అనుకునేవారు? ఈరోజు నుంచి 11 రోజులపాటు నేను ఎదురుచూస్తుంటాను... అధికారుల మనస్సు మారుతుందని కోరుకుంటూ, వేడుకుంటూ ఈ సంవత్సరం బీటింగ్ రిట్రీట్‌ను నేను తిలకిస్తాను. అయితే నా అభిప్రాయం తప్పవుతుందని నా నిశ్చితాభిప్రాయం.

మార్పు అనివార్యమనీ, ప్రపంచం పరిణమించడం తప్పనిసరనీ నాకు తెలుసు. కానీ, మనం నిలబెట్టుకోవలసిన సంప్రదాయాలు అంటూ ఏమీ లేవా? 'ఎబైడ్ విత్ మి' అనేది వలసవాద నమూనా అయితే, బీటింగ్ రిట్రీట్ మాటేమిటి? సమాధానం లేదు. అయితే దానికి కూడా ప్రమాదం పొంచి ఉందా? దీపావళికి ఆరతి, పటాసులు; ఈద్‌కు సేమియాతో చేసే ఖీర్ ఎలాగో క్రిస్మస్‌కు ప్రార్థనా గీతాలు అలాగా! కానీ మనం ఏం పాడాలో, ఏవి అట్టిపెట్టుకోవాలో, ఏవి వదిలేయాలో ఇప్పుడు మతమే నిర్ణయిస్తుందా? ప్రశ్నకు సమాధానం తెలీనప్పుడు మా నానమ్మ తరచుగా 'రబ్ జానే' అని చెప్పేది. దేవుడి కోసం వాడే ఆ ఉర్దూ పదం ఈరోజు ముస్లింలకు ప్రతీకగా గుర్తించబడుతోంది. కాబట్టి అది హిందువులకు నిషిద్ధమైపోయిందా? ఇది నిజంగా సిగ్గుపడాల్సిన విషయం. అయితే చాలా కొద్ది మంది ప్రజలు మాత్రమే దానిగురించి మాట్లాడటం నేను వింటున్నాను.

నా భయాలు తప్పు అని నేను కేవలం ఆశించగలను. 2023 సంవత్సరం ఇంకా దాదాపుగా 350 రోజులు సాగుతుంది. నేను ప్రేమిస్తున్న, గుర్తుపెట్టుకుంటున్న భారత దేశం మరింతగా మతి పోగొట్టుకుంటుందా? ఇప్పటినుంచి 12 నెలలు భారంగా సాగుతాయా? లేదా కొత్త ఉషోదయాల వైపు మనం సాగిపోతున్నప్పుడు మన గతంలోని ఉత్తమమైన అంశాలను అదరించి, అక్కున చేర్చుకుంటామా?

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

అనారోగ్య అగ్రరాజ్యం

అమెరికా అనగానే మనలో చాలామంది పులకించి పోతారు. అది అకారణమైనా సకారణమైనా అగ్ర రాజ్యాన్ని బలంగా నమ్ముతారు. అందుకు కొన్ని సత్యాలు, కొన్ని అర్ధసత్యాలు, మరిన్ని అసత్యాలు కారణం కావచ్చు. అలాంటి దేశాన్ని 'అనారోగ్య దేశం' అనటం నమ్మశక్యం కాదు. అంతగా దాని ప్రతిష్ఠ నెలకొని ఉంది. అయితే అక్కడ కొన్ని అంశాల్లో ప్రగతి తక్కువేమీ కాదు. వాటిలో జీవన ప్రమాణాలు పెరగడం, ఎక్కువ మందికి వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండటం, పొగత్రాగడం తగ్గటం, వివాహపూర్వ గర్భిణీలు తగ్గడం, జాతుల మధ్య వివక్ష అంతరాలు తగ్గడం లాంటివి ముఖ్యమైనవి.

వీటిని పరిశీలించినప్పుడు సాధారణంగా ఆశావహ అంచనాతో అమెరికా అన్ని విధాలా ఆరోగ్యకరమైన దిశగా పయనిస్తోంది అనుకుంటాము. కానీ గత రెండు దశాబ్దాల పరిణామాలను నిశితంగా గమనిస్తే వీటిలో వాస్తవం ఉన్నట్లు కనిపించదు. కోవిడ్–19 నేపథ్యంలో బయటపడిన అమెరికా డొల్లతనం, ఇటీవలి 'వాల్‌స్ట్రీట్ జర్నల్'లోని గణాంక వివరాలు ఇందుకు తార్కాణం.

అమెరికాలో శిశుమరణాలు ఆందోళనకరంగానే ఉన్నాయి. 2019లో కోవిడ్–19 ముందు ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో– ఆపరేషన్ అండ్ డెవ లప్మెంట్ (ఓఈసీడీ) దేశాల్లో అమెరికా స్థానం చాలా దేశాల కన్నా ఈ విషయంలో అధమ స్థితిలో ఉంది. అమెరికన్ల జీవన ప్రమాణం జర్మనీ కన్నా 2.5 ఏళ్లు, కెనడా కన్నా 3.2 ఏళ్లు, ఫ్రాన్స్ కన్నా



నాలుగు సంవత్సరాలు తక్కువగా ఉంది. యూరోపియన్ యూనియన్, ఆసియాకు చెందిన ఓఈసీడీ దేశాల్లోకన్నా తక్కువగా... 33వ స్థానంలో ఉంది. కోవిడ్ మృత్యుహేల అమెరికాలోని పరిస్థితులను మరింత దిగజార్చింది. కోవిడ్ మరణాలు అన్ని సంపన్న దేశాల్లో కన్నా అక్కడ ఎక్కువగా నమోదయ్యాయి. అమెరికాలో ప్రతి లక్ష మందికి 332 మరణాలు సంభవించగా ఫ్రాన్స్‌లో ఇవి 240, జర్మనీలో 194, కెనడాలో 128. అలాగే అమెరికాలో జీవన ప్రమాణం 2021లో 76.4కి పడిపోయింది. ఇది 1996 తర్వాత అతి తక్కువ. దీనితో అక్కడ ఓ పాతిక సంవత్సరాల ప్రగతి తుడిచిపెట్టుకు పోయినట్లయింది. ఇదే సమయంలో అక్కడ మాదక ద్రవ్యాల వినియోగం పెరుగుదల మరో రకపు ప్రతికూలత సూచిస్తోంది.

అక్కడి పౌర సమాజంలో అధిక సంఖ్యాకులలో గల ఊబకాయం అనేక రకాల రుగ్మతలకు కారణంగా పరిగణిస్తున్నారు. జీవన ప్రమాణాలు ఉండవలసిన స్థాయిలో ఉండకపోవడానికి ఇదొక కారణంగా పేర్కొంటున్నారు. 2000 నుండి 2020 సంవత్సరం వరకూ ఊబకాయులు 30.5 శాతం నుండి 41.9 శాతానికి పెరిగారు. ఊబకాయం అనేక వ్యాధులకు కారకం. వాటిలో ముఖ్యమైనది చక్కెర వ్యాధి.

మొత్తంగా అమెరికాలోని ఈ పరిస్థితులను గమనించినప్పుడు... అక్కడి గొప్పదైన సంపద, వైద్య సాంకేతికత, అత్యంత ఎక్కువ ఆరోగ్య సంరక్షణ తలసరి వ్యయం, ప్రజారోగ్య వ్యవస్థ వంటి సమస్తం సంక్షోభంలో ఉండి అత్యంత పేలవంగా పనితీరు కనపరుస్తూ ఉన్నట్లు స్పష్టమౌతుంది. మెరిసేదంతా బంగారం కాదనే నానుడిని అమెరికా ప్రస్తుత పరిస్థితి నిరూపిస్తోంది.

– బి. లలితానంద ప్రసాద్, రిటైర్డ్ ప్రొఫెసర్

సంక్రాంతి లక్ష్మి

లక్ష్మి అంటే లక్ష్మీదేవి అని మాత్రమే కాదు. శోభ, సౌభాగ్యం, సమృద్ధి, సౌందర్యం, సిరి, సంపద, కళ, కాంతి – వీటన్నిటినీ లక్ష్మి అనే పదం సూచిస్తుంది. ఇవన్నీ లక్ష్మీదేవి అంశలే, ఆమె ప్రసాదాలే. మకర సంక్రాంతి నాడు సంక్రాంతి లక్ష్మి ఈ అంశలన్నీ ప్రదర్శిస్తూ మనకు దశావతారాలతో దర్శనమిస్తుంది.

సంక్రాంతి నెలలో ప్రకృతి సౌందర్యం సాటిలేనిది. అందుకే పుష్యమాస శోభను అభివర్ణిస్తూ పింగళి–కాటూరి కవులు దానిని 'పరమ కళ్యాణి, మాతల్లి, పౌష్యలక్ష్మి'గా భావించారు. 'పౌష్యలక్ష్మి'ని

జ్యోతిర్మయం

సంక్రాంతి లక్ష్మి ప్రథమావతారంగా పరిగణించవచ్చు. సేమంతీ స్యందనం (చేమంతుల రథం) మీద వెడలి వచ్చే సంక్రాంతి నాటి 'ప్రాభాత లక్ష్మి'ని కృష్ణశాస్త్రి కీర్తించారు. అది ఆమె రెండవ అవతారం.

పొలాలనన్నీ హలాల దున్నే కర్షకుల శ్రమ సంక్రాంతి నాటికి 'ధాన్యలక్ష్మి' రూపంగా మారి గాదెలనూ, గోదాములనూ నింపటమే కాక, హాలికుల హృదయాలను కూడా ఆత్మస్థైర్యంతో, హాయితో నింపుతుంది. 'ధనలక్ష్మి', ధాన్యలక్ష్మికి కవల. ఇది ఉంటే, అది ఉన్నట్టే!

ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి పుష్కలంగా ఉన్న సంక్రాంతి రోజులలో, 'ఉత్సాహ లక్ష్మి' కూడా సమాజాన్ని ఆవహించి పరిపరి విధాల ఉరకలు వేస్తూ, వేయిస్తూ సాక్షాత్కరిస్తుంది. రంగులూ, రంగవల్లులూ, బంతులూ, చేమంతులతో, కొత్తదనాలతో, కళకళలతో, కిలకిలలతో అలరారే గృహ శోభ, సంక్రాంతి లక్ష్మి ప్రదర్శించే 'గృహలక్ష్మి' అవతారం.

క్షీర సమృద్ధి, శాక బాహుళ్యం ఉండే కాలం కనక, భాగ్యశాలుల భోజనాలలో పాయసాలుగా, పప్పు ధప్పళాలుగా, రసాలూరే అతిరసాలు(అరిసెలు)గా, కొత్త బెల్లపు అప్పచ్చులుగా, నవనవలాడే కాయగూరలతో చేసిన చవులూరే వంటకాలుగా, 'అన్నలక్ష్మి' విలాసం విస్తళ్ళల్లోనే విస్తరించి అగుపిస్తుంది.

హరిదాసుల పాటలూ, గంగిరెద్దుల ఆటలూ, బుడబుక్కల మాటలు ఇత్యాదుల నుంచి, సవాళ్లా సందడుల సరికొత్త చలనచిత్రాలదాకా, అన్ని కళలూ అక్కున చేర్చుకొనే కళాలక్ష్మి సమగ్ర స్వరూపాన్ని సంక్రాంతి లక్ష్మి ఆవిష్కృతం చేస్తుంది. దాన ధర్మాలలో, దైవ పితృతర్పణాలలో ఆసక్తి ఉంచే ఆస్తికుల గృహాలలో 'శ్రద్ధాలక్ష్మి' లాస్యం అడుగడుగునా కనిపిస్తుంది. ఇన్ని శోభలు వెల్లివిరిసే సంక్రాంతి సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు.

– ఎం. మారుతి శాస్త్రి

క్లుప్తంగా...

సింహగిరిపై భోగి పండుగ



సింహగిరిపై ఏర్పాటు చేసిన భోగి మంటలో పిడకలు వేస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి

సింహాచలం: సింహగిరిపై సంక్రాంతి సంబరాలను విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి శనివారం ప్రారంభించారు. ఆలయ రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో పెద్ద ఎత్తున వేసిన భోగి మంటకు స్వాత్మానందేంద్ర సరస్వతి హారతి ఇచ్చి పిడకలు వేశారు. వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సింహగిరి వచ్చిన భక్తులు సంబరాలను తిలకించారు. ఈ సందర్భంగా స్వాత్మానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సామాన్యుల పండగ అన్నారు. పల్లె సంప్రదాయాలను పాటిస్తూ పట్టణ ప్రాంతాల్లోనూ సంక్రాంతిని విశేషంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.

తాగునీటికి బాలసాయి ట్రస్ట్ రూ.10 కోట్ల విరాళం



రామారావు, ట్రస్టీ ఉషను సన్మానిస్తున్న కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య


కర్నూలు కల్చరల్: కర్నూలు నగర పాలక సంస్థకు భగవాన్ బాలసాయి సేవా ట్రస్ట్ రూ.10 కోట్ల విరా ళం ప్రకటించింది. కర్నూలు శ్రీనిలయంలో భగ వాన్ శ్రీబాలసాయి బాబా 62వ జయంతి వేడుకలు, ప్రపంచ శాంతి సదస్సు, దీనజన సేవ కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నగర మేయర్ బి.వై.రామయ్య హాజరై ప్రసంగించారు. కర్నూలు నగరంలో తాగునీటి ఎద్దడి నివారణకు సహకరించాలని బాలసాయి బాబా మేనేజింగ్ ట్రస్టీ రామారావును కోరారు. స్పందించిన రామారావు రూ.10 కోట్లు విరాళం ఇస్తున్నట్లు ప్రకటించారు. నగర పాలక సంస్థ తరఫున ఆయనను ఘనంగా సన్మానించి, బాలసాయి బాబా సేవా ట్రస్ట్ సేవలను అభినందించారు. అనంతరం 700 మంది జీవనోపాధికి తోపుడు బండ్లు, గ్రైండర్లు, ఇస్త్రీ పెట్టెలు, టీస్టాల్ బండ్లు, కుట్టు మిషన్లు పంపిణీ చేశారు.

కుక్కుట శాస్త్రం.. 'బరి'లో అస్త్రం!

పందేల రాయుళ్లకు ఈ శాస్త్రమే ప్రామాణికం

- ఇది కోడి పోరు పంచాంగం
- నక్షత్ర బలంతోనే గెలుపోటములనే నమ్మకం
- వారం, తిథి, దిశను బట్టి బరిలోకి రంగుల పుంజులు

సంక్రాంతి పర్వదినాన కోడి పందేలు హోరెత్తుతాయి. పుంజును బరిలో దించడానికి కూడా పలువురు పందేల రాయుళ్లు శాస్త్రాన్ని నమ్ముతారు. దాని ప్రకారమే నడుచుకుంటారు. ఆ శాస్త్రం పేరే కుక్కుట శాస్త్రం. ఇది కోడి పుంజుల పోరుకు దిశా నిర్దేశం చేసే పంచాంగం వంటిది. ఏళ్ల తరబడి కోడి పందేలు నిర్వహించే పలువురికి ఇదే ప్రామాణికం.



సాక్షి, అమరావతి : నక్షత్ర బలంపైనే బరిలోకి దిగిన కోళ్ల గెలుపోటములు ఆధారపడి ఉంటాయని వారి నమ్మకం. బరిలో పోరుకు దిగిన పుంజుకు పిక్క బలంతో పాటు దాని యజమాని పేరు బలం కూడా తోడవుతుందని వారి ప్రగాఢ విశ్వాసం. అందుకే కోడి పందేల్లో సీనియర్లయిన వారంతా కుక్కుట శాస్త్రాన్ని ఔపోసన పట్టి మరీ.. వారం, తిథి, దిశను బట్టి అందుకు అనుగుణమైన రంగుల పుంజులను బరిలోకి దించుతారు. ఇంతకీ ఏమిటా కుక్కుట శాస్త్రం.. అది ఏం చెబుతోందంటే..

ఈకల రంగును బట్టి పేర్లు

నల్లని ఈకలున్న పుంజును కాకి అని, తెల్లని ఈకలుంటే సేతు అని పిలుస్తారు. మెడపై నలుపు, తెలుపు ఈకలు సమానంగా గల కోడి పుంజును పర్ల అంటారు. మెడపై నల్లని ఈకలు గలవాటిని సవలగా పిలుస్తారు. నల్లటి శరీరం, 2, 3 రంగుల ఈకలు గలవి కొక్కిరాయి(కోడి). ఎర్రటి ఈకలుంటే.. డేగ, రెక్కలపై, వీపుపై పసుపు రంగు ఈకలుంటే.. నెమలి. నలుపు, ఎరుపు, పసుపు ఈకలుంటే.. కొజు. ఎరుపు, బూడిద రంగుల ఈకలున్నవాటిని మైలగా పిలుస్తారు. ఒక్కో ఈకపై నలుపు, తెలుపు, ఎరుపు రంగులుంటే.. పూల. తెలుపు రెక్కలపై అక్కడక్కడా నలుపు రంగు, లేత గోధుమ రంగు ఈకలు గల కోడి పుంజు పింగళి. లేత బంగారు రంగు ఈకలు గలవి అబ్రాసు. ముంగిస జూలు రంగు గల పుంజు ముంగిస. తెలుపు, లేత ఎరుపు ఈకలు గల పుంజు గేరువా. నలుపు, తెలుపు ఈకలు గలవి తెల్లగౌడు. నలుపు, ఎరుపు ఈకలున్న ఎర్రగౌడు. తెల్లని ఈకలపై నల్ల మచ్చలుంటే.. సేతు. రెక్కలపై నల్ల మచ్చలుంటే.. నల్ల సవల. వీటితో పాటు కోడి నెమలి, కాకి నెమలి, పచ్చ కాకి వంటి మిశ్రమ రకాలున్నాయి. కోడి పుంజుల్లో కాకి, పచ్చ కాకి, కాకి నెమలి, డేగ ప్రసిద్ధమైనవి. సంక్రాంతి పండగ రోజుల్లో పందెం వేసే రోజున నక్షత్రాన్ని బట్టి తారా బలం చూసి కోడి రంగు, జాతిని ఎంపిక చేసి పందేలు వేస్తారు. భోగి రోజున గౌడ నెమలి, నెమలికి చెందిన పుంజులు, సంక్రాంతి రోజున యాసర కాకి డేగ, కాకి నెమలి, పసిమగల్ల కాకి, కాకి డేగ, కనుమ రోజున డేగ, ఎర్రకాకి డేగలు విజయం సాధిస్తాయని నమ్ముతారు.

'దిశ'తో దశ తిరుగుతుంది

కుక్కుట శాస్త్రం ప్రకారం.. ఏ రోజు ఏ దిశలో కోడి పుంజును పందేనికి వదలాలనే దానిపై స్పష్టమైన అంచనా ఉంటుంది. ఆది, శుక్రవారాల్లో ఉత్తర దిశలో, సోమ, శనివారాల్లో దక్షిణ దిశలో, మంగళవారం తూర్పు దిశలో, బుధవారం, గురువారం పడమర దిశలో బరిలో దించుతుంటారు. వారాలను, పక్షాలను అనుసరించి కొన్ని జాతుల కోడి పుంజుల జీర్ణశక్తి మందగించి అవి ఓటమి పాలవుతాయని, వాటి ప్రత్యర్థులు విజయం సాధిస్తాయని అంటారు. ఎనిమిది దిక్కుల్లో వారాన్ని బట్టి ఏ దిశలో ఉండే బరిలో.. పోటీకి పుంజును దించితే విజయం దక్కుతుందో కూడా చూస్తారు. జ్యోతిష్య శాస్త్రంలో నవగ్రహాల సమయాన్ని అనుసరించి అవస్థా భేదాలు లెక్కిస్తుంటారు. ఇదే తరహాలో పక్షి జాతుల్లో పగటి సమయంలో గల ఐదు జాములకు ఐదు అవస్థలుగా ప్రస్తావించారు. భోజవావస్థలో కోడి పుంజును బరిలోకి దించితే విజయం దక్కుతుందని, రాజ్యావస్థలో పుంజు సులభంగా గెలుస్తుందని, గమనావస్థలో పందేనికి దించితే సామాన్య లాభం మాత్రమే వస్తుందని, నిద్రావస్థలో అపజయం పాలవుతుందని, జపావస్థలో బరిలోకి దించితే మృతి చెందుతుందని నమ్ముతారు.

నక్షత్రాన్ని బట్టి కోడి పోరు

నక్షత్ర ప్రభావం మనుషుల మీదే కాకుండా పక్షులు, జంతువుల మీద కూడా ఉంటుందని నమ్ముతారు. ముఖ్యంగా కోడి పుంజుల్లో రక్త ప్రసరణపై గ్రహ ప్రభావం ఉంటుందని విశ్వసిస్తారు. దీంతో నక్షత్రాన్ని బట్టి ఆయా రంగుల కోడి పుంజులను బరిలోకి దించేందుకు దాని యజమాని పేరులోని మొదటి అక్షరాన్ని బట్టి జాతకాన్ని జోడించి లెక్క చూసి మరీ పోటీకి దిగుతారు. 27 నక్షత్రాలు, పందెం కోళ్లపై ప్రభావం చూపిస్తాయని చెబుతుంటారు. నక్షత్రాలను బట్టి అనుకూలమైన రంగుల కోళ్లను బరిలోకి దించితే గెలుపు ఖాయమని నమ్ముతారు.

కన్న బిడ్డల్ని గొడ్డలితో నరికి.. తండ్రి ఆత్మహత్య

- మానసికస్థితి సరిగా లేక..
- వైఎస్సార్ జిల్లా నక్కలదిన్నెలో దారుణం



భార్య, పిల్లలతో నరసింహారెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : కన్న బిడ్డల్ని గొడ్డలితో నరికి, తండ్రి ఆత్మహత్య చేసుకున్న హృదయ విదారక ఘటన వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలంలోని నక్కలదిన్నె గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. నక్కలదిన్నె గ్రామానికి చెందిన నరసింహారెడ్డి (47) పురుగు మందుల కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా పని చేసేవాడు.ఇతనికి భార్య తులసమ్మ, కుమారుడు అభితేజారెడ్డి, కుమార్తె పావని ఉన్నారు. నరసింహారెడ్డి మానసిక ఆరోగ్య సమస్య వల్ల పనికి వెళ్లడం లేదు. ఐదు నెలల క్రితం అతనికి పిత్తాశయానికి సంబంధించిన ఆపరేషన్ జరిగింది. అప్పటి నుంచి గ్రామంలో ఎవరితోనూ మాట్లాడకుండా మౌనంగా ఉండేవాడు. శుక్రవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగిన నరసింహారెడ్డి భార్య పడుకున్న గది తలుపునకు చిలుకు పెట్టాడు. కొంత సేపటి తర్వాత ఇంట్లో గొడ్డలి తీసుకుని ముందుగా నిద్రిస్తున్న కుమారుడు అభితేజరెడ్డి తలపై బలంగా కొట్టడంతో రక్తపు మడుగులో కుప్పకూలి పోయాడు. తర్వాత కుమార్తె పావనిపై కూడా గొడ్డలితో దాడి చేశాడు. పిల్లలిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు పిల్లలను, పురుగుమందు తాగిన నరసింహారెడ్డిని ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు నరసింహారెడ్డి మృతి చెందినట్లు నిర్ధారించారు. అభితేజరెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. తన భర్త మానసిక స్థితి సరిగా లేక పిల్లలపై దాడి చేసి, తానూ ఆత్మహత్య చేసుకున్నాడని భార్య తులశమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు.

పండుగ వేళ రెండు కుటుంబాల్లో పెను విషాదం



గుడి రాజేష్ (ఫైల్)



కె.వి. సత్యనారాయణ (ఫైల్)



ప్రమాదంలో ధ్వంసమైన కారు

- అదుపుతప్పి పల్టీలు కొట్టిన కారు
- ఇద్దరు యువకులు మృతి
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

చల్లపల్లి(అవనిగడ్డ): పండుగ వేళ రెండు కుటుంబాల్లో పెను విషాదం నెలకొంది. కారు అదుపు తప్పి పల్టీలు కొట్టిన ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. ఈ ప్రమాదం కృష్ణా జిల్లా చల్లపల్లి వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చల్లపల్లి గ్రామానికి చెందిన కొప్పాళ్ల వెంకట సత్యనారాయణ (పండు) (30), గుడి రాజేష్ (39), ఆరేపల్లి అశోక్ కుమార్, కొప్పాళ్ల సాయివంశి, మదిరి నవీన్ కుమార్ శుక్రవారం అర్ధరాత్రి ఘంటసాల మండలం లంకపల్లి నుంచి కారులో జాతీయ రహదారి మీదుగా స్వగ్రామానికి వస్తున్నారు. చల్లపల్లి పడమర వైపు వస్తుండగా స్పీడ్ బ్రేకర్ల వద్ద అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి పాగోలు రోడ్డు మలుపులో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రహరీని ఢీకొట్టింది. ఈ ప్రమాదం ధాటికి ప్రహరీ ధ్వంసమైంది. ప్రమాద వేగానికి కారు నుజ్జునుజ్జయింది. ఎయిర్ బెలూన్లు తెరుచుకున్నప్పటికీ సత్యనారాయణ, రాజేష్ తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మృతి చెందారు. మిగిలిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద శబ్దం విని స్థానికులు ఘటనాస్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాలను అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి, క్షతగాత్రులను మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంపై ఆరేపల్లి అశోక్ కుమార్ ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జి ఎస్ఐ కుడిపూడి శ్రీనివాసు, ఏఎస్ఐ లక్ష్మణరాజు కేసు దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుల్లో ఒకరైన కొప్పాళ్ల సత్యన్నారాయణ (పండు) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా ఇంకా వివాహం కాలేదు. మరో మృతుడు గుడి రాజేష్ ట్రక్కు ఆటో నడుపుకుని జీవనం సాగించేవాడు. రాజేష్‌కు భార్య రాజేశ్వరి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పండుగ వేళ ఇద్దరు మృతితో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

రావణ వాహనంపై శివపార్వతులు



రావణ వాహనంపై దేవేరి భ్రమరితో మల్లికార్జునుడు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం భోగి పర్వదినాన శ్రీశైల మల్లికార్జునుడు దేవేరి భ్రమరితో కలిసి రావణ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. అనంతరం ఆలయ ప్రదక్షిణ చేయించి పురవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లు నందివాహన సేవలో భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి 8 గంటలకు గంగా పార్వతీ సమేత మల్లికార్జున స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు.

తిరుపతిలో క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం

- స్విమ్స్‌లో 300 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం
- ప్రపంచస్థాయి ప్రమాణాలతో సదుపాయాలు
- సెప్టెంబర్ నాటికి అందుబాటులోకి సేవలు

రూ.300 కోట్లతో శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ



తిరుపతిలోని స్విమ్స్‌లో నిర్మాణంలో ఉన్న శ్రీబయో బ్లాక్

సాక్షి, అమరావతి: క్యాన్సర్ బాధితులకు రాష్ట్రంలోనే మెరుగైన చికిత్స అందించడంపై దృష్టి సారించిన సీఎం జగన్ ప్రభుత్వం ఆ దిశగా చకచకా అడుగులు వేస్తోంది. దీనికోసం వైద్య ఆరోగ్యశాఖ ఇప్పటికే రోడ్‌మ్యాప్ సిద్ధం చేసింది. ప్రస్తుతం ఉన్న వైద్య కళాశాలల్లో క్యాన్సర్ విభాగాల బలోపేతానికి చర్యలు చేపట్టింది. క్యాన్సర్ బాధితులకు అత్యాధునిక చికిత్స అందించేందుకు టీటీడీ సహకారంతో తిరుపతిలోని స్విమ్స్‌లో శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ (శ్రీబయో) విభాగాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. రూ.300 కోట్లతో జీ+5 భవనం నిర్మిస్తున్నారు. రెండులక్షల చదరపు అడుగుల విస్తీర్ణం ఉండే ఈ భవనం నిర్మాణ పనులు తుదిదశలో ఉన్నాయి. భవన నిర్మాణం పూర్తి కాగానే వైద్య పరికరాలు, ఇతర సదుపాయాలు సమకూరుస్తారు. 300 పడకలతో ఏర్పాటు చేస్తున్న ఈ ఆస్పత్రిలో సర్జికల్, మెడికల్, రేడియేషన్ ఆంకాలజీల విభాగాలతో పాటు ఎముకమజ్జ మార్పిడి (బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంటేషన్), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ ఆంకాలజీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీడియాట్రిక్ ఆంకాలజీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెయిన్, పాలియేషన్, క్యాన్సర్ రిజిస్ట్రీ విభాగాలు ఉంటాయి.

రోబోటిక్ సర్జరీ వంటి అధునాతన సౌకర్యాలు

క్యాన్సర్ చికిత్సలో సర్జికల్ ఆంకాలజీ ప్రధానమైంది. శ్రీబయోలోని ఈ విభాగంలో అధునాతన వైద్య పరికరాలు ఏర్పాటు చేస్తారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా అడ్వాన్స్ రోబోటిక్ సర్జరీలు చేసే విధానాన్ని తీసుకొచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 4డీ పరిజ్ఞానం కలిగిన ల్యాప్రోస్కోపిక్ పరికరాలను కూడా అందుబాటులోకి తేవడం ద్వారా కోత, కుట్లు లేకుండానే సర్జరీలు చేసేలా వనరులు సమకూరుస్తారు. రేడియేషన్ ఆంకాలజీ విభాగంలో గామానైఫ్ విధానాన్ని అందుబాటులోకి తేనున్నారు. దీంతో మెదడులో చిన్నపాటి గడ్డలను సైతం ఆపరేషన్, కోత, కుట్లు లేకుండా తొలగించే వీలుంటుంది.

దేశంలోనే మొదటిది



ప్రభుత్వ రంగంలో ప్రపంచ ప్రమాణాలతో దేశంలో ఏర్పాటవుతున్న మొదటి క్యాన్సర్ ఆస్పత్రి శ్రీబయో. ఈ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే అన్ని రకాల క్యాన్సర్లకు అత్యాధునిక చికిత్స అందుబాటులోకి వస్తుంది. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకుని రావాలన్నది లక్ష్యం. ఆ మేరకు వేగంగా పనులు జరుగుతున్నాయి. శ్రీబయోలో క్యాన్సర్ చికిత్సలన్నీ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు లభిస్తాయి.

– డాక్టర్ జయచంద్రరెడ్డి, శ్రీబయో ప్రత్యేకాధికారి

దేశానికే రోల్‌మోడల్



రాష్ట్రంలో ఏ ఒక్క క్యాన్సర్ బాధితుడు చికిత్స కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లకూడదనేది సీఎం వైఎస్ జగన్ లక్ష్యం. ఇందుకు అనుగుణంగా క్యాన్సర్ రోగులకు కాంప్రహెన్సివ్ హెల్త్‌కేర్ శ్రీబయోలో అందుబాటులోకి రానుంది. ఈ ఆస్పత్రి భవిష్యత్‌లో దేశానికే రోల్‌మోడల్‌గా నిలవనుంది.

– జి.ఎస్.నవీన్‌కుమార్, రాష్ట్ర వైద్యశాఖ ప్రత్యేక కార్యదర్శి (క్యాన్సర్ కేర్)

నల్లమల జీవవైవిధ్యం.. శ్రీశైలంలో లభ్యం

- శ్రీశైలం బయో డైవర్సిటీ రీసెర్చ్ సెంటర్‌లో ఎన్నో ప్రత్యేకతలు
- జంతుజాలం, వృక్షజాలం, కొత్త జాతుల వంటి ఎన్నో వివరాలు
- పులుల గణన.. పులుల ఆనవాళ్లు గుర్తించేది అక్కడే



శ్రీశైలం బయో డైవర్సిటీ రీసెర్చ్ సెంటర్

సాక్షి, అమరావతి: ప్రకృతి ప్రసాదించిన వరం నల్లమల అటవీ ప్రాంతం. ఎత్తయిన కొండలు.. జలపాతాలు.. అరుదైన వృక్షాలు.. వన్య ప్రాణులు.. అన్నిటికీ మించి పులులు జీవించేందుకు నల్లమల అత్యంత అనుకూలమైంది. విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు. ఎన్నో విశేషాలు, వింతలు, అద్భుతాలతో అలరారుతున్న నల్లమలను చుట్టి రావాలంటే.. మామూలుగా అయితే సాధ్యం కాదు. కానీ.. అక్కడి జీవ వైవిధ్యం అంతటినీ శ్రీశైలం బయో డైవర్సిటీ రీసెర్చ్ సెంటర్‌లో చూడవచ్చు. నల్లమల ప్రత్యేకతలు, జీవజాలం, జంతుజాలం, పులులు, ఇతర వన్యప్రాణులు వంటి సమస్త సమాచారం అక్కడ ఉంటుంది. నాగార్జున సాగర్ టైగర్ రిజర్వు ప్రాంతంలో జీవవైవిధ్య కార్యకలాపాల కోసం 2001లో స్వతంత్ర జీవవైవిధ్య పరిశోధన కేంద్రాన్ని శ్రీశైలంలో ప్రారంభించారు. దశాబ్ద కాలంలో వన్యప్రాణుల సంరక్షణ, జీవవైవిధ్యం, వివిధ జాతుల జాబితాకు సంబంధించి అత్యుత్తమ పరిశోధనలు ఇక్కడ జరిగాయి. ఈ అటవీ ప్రాంతంలోని వెన్నెముక లేని, వెన్నెముక ఉన్న జీవుల నమూనాలను సేకరించి బయోడైవర్సిటీ రీసెర్చ్ సెంటర్ ల్యాబొరేటరీలో భద్రపరిచారు.

ఇదీ నల్లమల జీవవైవిధ్యం

పులులు, ఎలుగుబంట్లు వంటి 80 రకాల పాలిచ్చే జంతువులు, 303 జాతుల పక్షులు, 80 రకాల పాకే ప్రాణులు, కప్పల వంటి 20 ఉభయ చరాలు, 55 రకాల చేపలు, 102 రకాల సీతాకోక చిలుకలు, 57 రకాల తూనీగలు, 47 జాతుల కీటకాలు ఇంకా అనేక రకాల కీటక జాతులను ఈ అటవీ ప్రాంతంలో గుర్తించిన పరిశోధనా కేంద్రం చెక్‌లిస్ట్‌ను తయారు చేసింది.

నాగార్జున సాగర్–శ్రీశైలం పులుల అభయారణ్యం, గుండ్ల బ్రహ్మేశ్వరం, రోళ్లపాడు వన్యప్రాణుల అభయారణ్యాలలో అన్ని రకాల జీవవైవిధ్య సర్వేలు నిర్వహించింది. నల్లమలలోని జంతు, పుష్ప సంపదపై డిజిటల్ ఫొటో డాక్యుమెంటేషన్ చేసింది. అక్కడి జంతుజాలం, వృక్షజాలం యొక్క జాతుల స్థాయిపై సమగ్ర తనిఖీ జాబితాను రూపొందించింది. మాంసాహార ప్రాణుల ఆహారపు అలవాట్లను అధ్యయనం నిర్వహిస్తోంది. శాకాహార ప్రాణుల వెంట్రుకల ద్వారా వాటి లక్షణాలను గుర్తిస్తోంది. ఇక్కడి గడ్డి జాతుల వైవిధ్యం, వృక్ష జాతులతో వాటిపై సంబంధాలపై అధ్యయనం చేసింది.

పులుల గణన ఇక్కడే..

నల్లమల అటవీ ప్రాంతంలోని పులుల గణన చేపట్టేది ఈ పరిశోధనా కేంద్రంలోనే. అటవీ ప్రాంతంలో పులులు తిరిగే ప్రాంతంలో ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్‌ల నుంచి సేకరించిన లక్షలాది ఫొటోలను విశ్లేషించి ప్రతి సంవత్సరం పులులను ఇక్కడ లెక్కిస్తారు. పులుల సంఖ్య, వాటి తీరు, ఆడవా, మగవా, వాటి మధ్య తేడాలు వంటి అన్ని అంశాలను గుర్తిస్తారు. పులులపై ఉండే చారల ద్వారా ప్రతి పులి ఆనవాలును ఇక్కడ సేకరించి దాని కదలికలను గమనిస్తారు. చిరుతలు, ఎలుగుబంట్లు వంటి ఇతర జంతువులను కూడా ఈ ఫొటోల ద్వారా గుర్తించి లెక్కిస్తారు. అటవీ సిబ్బందికి శిక్షణ తరగతులు, ప్రజలకు జీవవైవిధ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. 8.6 హెక్టార్ల విస్తీర్ణంలో శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీ పక్కన పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో ఎకోలాజికల్ నాలెడ్జ్ పార్కును అభివృద్ధి చేశారు. ఇందులోని 4.96 హెక్టార్ల విస్తీర్ణంలో భూమి ఆవిర్భావం నుండి ఆధునిక మనిషి జీవ పరిణామ క్రమాన్ని వివరించే థీమ్‌తో ఏర్పాటు చేసిన పార్కు ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది.



బయో డైవర్సిటీ రీసెర్చ్ సెంటర్



నల్లమల అటవీ ప్రాంతం

గంటలో శ్రీవారి దర్శనం



గాత్ర కచ్చేరి చేస్తున్న శోభారాజు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో ఒక కంపార్ట్‌మెంటు నిండింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 59,090 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. 21,054 మంది తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.59 కోట్లు వేశారు. శ్రీవారి దర్శనం టికెట్లు లేని భక్తులకు ఒక గంట సమయంలో దర్శనం లభిస్తోంది. టైంస్లాట్ దర్శన టికెట్ కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ కలిగిన భక్తులకు ఒక గంట సమయం పడుతోంది.

యదుకుల స్వామికిని గొబ్బిళ్లో..

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సహస్ర దీపాలంకరణ సేవలో శనివారం సాయంత్రం శోభారాజు తన శిష్య బృందంతో కలసి సంకీర్తనాలాపన చేశారు. 'కొలని దోపరికి గొబ్బిళ్లో.. యదుకుల స్వామికిని గొబ్బిళ్లో.. వాడె వేంకటేశుడనే వాడే వీడు..' అంటూ శ్రీవారి వైభవాన్ని అన్నమాచార్యుల వారు వర్ణించే సంకీర్తనను శోభారాజు తన గానంతో శ్రోతలను రంజింపజేశారు. వారి శిష్యులు సువర్ణ, అక్షయ గాత్ర సహకారం అందించారు.

16న శ్రీవారి పార్వేట ఉత్సవం.. ఆర్జిత సేవలు రద్దు

తిరుమలలో కనుమ పండుగ సందర్భంగా ఈ నెల 16న శ్రీ వేంకటేశ్వరస్వామివారి పార్వేట ఉత్సవం జరగనుంది. అదేరోజున గోదాపరిణయోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల కారణంగా 16న శ్రీవారి ఆలయంలో నిర్వహించే కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.



లారీని విరాళంగా అందజేస్తున్న దాతలు

టీటీడీకి రూ.80 లక్షల విలువైన లారీల విరాళం

టీవీఎస్ సంస్థ తరఫున ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ చెన్నైకి చెందిన సెల్వం శనివారం ఏసీ సౌకర్యంతో కూడిన రెండు కూరగాయల లారీలను టీటీడీకి విరాళంగా అందించారు. ఈ వాహనాల విలువ రూ.80 లక్షలని దాత తెలిపారు. ముందుగా శ్రీవారి ఆలయం ఎదుట కొత్త వాహనాలకు పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డికి వాహనాల తాళం చెవులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఐ జానకిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ప్రధాని మోదీ పండుగ శుభాకాంక్షలు



న్యూఢిల్లీ: భోగి, ఉత్తరాయణ పర్వదినాలను పురస్కరించుకుని ప్రధాని మోదీ శనివారం దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'ప్రజలకు ఉత్తరాయణ, భోగి శుభాకాంక్షలు. ఈ పండుగ రోజులు అందరికీ సంతోషాన్ని, శుభాలను కలుగజేయాలని, జీవితాల్లో ఆనందాన్ని నింపాలని ప్రార్థిస్తున్నాను'అని ఆయన ట్వీట్లు చేశారు. దక్షిణాది రాష్ట్రాల్లో భోగి పండుగను, ఉత్తరాయణం సందర్భంగా గుజరాత్ తదితర ప్రాంతాల్లో గాలిపటాలు ఎగురవేస్తారు.

సుదూర తారలు



వాషింగ్టన్: మన పాలపుంతలో అత్యంత సుదూరంలో ఉన్న నక్షత్రాల సమూహాన్ని తాజాగా గుర్తించారు. ఆర్ఆర్ లైర్‌గా పిలుస్తున్న ఈ తారలు పాలపుంత చివరి అంచుల్లో, మనకు అతి సమీపంలో ఉన్న నక్షత్ర మండలమైన ఆండ్రోమెడాకు ఏకంగా సగం దూరంలో ఉండటం విశేషం! ఇప్పటిదాకా కనీసం ఇలాంటి 200 నక్షత్రాలను గుర్తించారు. వీటిల్లో అత్యంత దూరాన ఉన్న నక్షత్రమైతే భూమి నుంచి ఏకంగా 10 లక్షల కాంతి సంవత్సరాల దూరంలో ఉంది! ఆండ్రోమెడా నక్షత్ర మండలం భూమి నుంచి 25 లక్షల కాంతి సంవత్సరాల దూరంలో ఉందన్న సంగతి తెలిసిందే. మిగతా విశ్వంలో మాదిరిగా పాలపుంత చివరి అంచుల్లో అత్యధిక భాగం డార్క్ మ్యాటర్‌తోనే నిండి ఉంటుంది. విశ్వపు మౌలిక నిర్మాణానికి ఆధారం ఇదేనని భావిస్తారు. దీని గురుత్వాకర్షణ శక్తి కారణంగానే అంతరిక్షంలోని దృగ్గోచర ద్రవ్యరాశి ఒక్కచోటికి చేరి తారలు, తారా మండలాలు పుట్టుకొస్తాయన్నది శాస్త్రవేత్తల సిద్ధాంతం. ఈ పరిశోధన వల్ల పాలపుంత ఆవలి హద్దుల్లో ఏముందనే దానిపై కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయని దీనిలో భాగం పంచుకున్న యూసీ శాంతాక్రుజ్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ ప్రొఫెసర్ రాజగుహ ఠాకూర్త చెబుతున్నారు.

మరో భూమి



వాషింగ్టన్: దాదాపుగా భూమి మాదిరిగానే ఉన్న ఒక గ్రహాన్ని జేమ్స్ వెబ్ టెలిస్కోప్ తాజాగా గుర్తించింది. పైగా అది సరిగ్గా భూమి పరిమాణంలోనే ఉందట. మనకు కేవలం 41 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ఈ గ్రహాన్ని ఎల్‌హెచ్ఎస్475గా పిలుస్తున్నారు. ఇలా మన సౌరవ్యవస్థకు ఆవల ఓ గ్రహాన్ని ఇంతటి స్పష్టతతో, కచ్చితత్వంతో గుర్తించడం ఇదే తొలిసారంటూ నాసా సైంటిస్టులు సంబరపడుతున్నారు! పైగా అది కూడా భూమి మాదిరిగానే రాళ్లు, పర్వతాలమయంగా ఉండటం మరింత ఉత్సాహాన్నిచ్చే అంశమని వారు చెబుతున్నారు. ఈ సోదర గ్రహంపై వాతావరణం ఉందో, లేదో, ఉంటే ఎలా ఉందో తేల్చే పనిలో పడ్డారు. అన్నట్టూ, ఇది తన సూర్యుని చుట్టూ కేవలం రెండు రోజులకు ఒక రౌండ్ చొప్పున వేసేస్తోందట! పైగా దానికి అతి సమీపంలో ఉందట. "కాకపోతే సదరు నక్షత్రపు ఉష్ణోగ్రత సూర్యునితో పోలిస్తే సగమే. కాబట్టి ఎల్‌హెచ్ఎస్475పై వాతావరణం ఉండే అవకాశాన్ని కొట్టిపారేయలేం'' అని నాసా అంటోంది.

క్లుప్తంగా...

లక్షద్వీప్ ఎంపీపై వేటు

న్యూఢిల్లీ/తిరువనంతపురం: హత్యాయత్నం నేరంలో ఇటీవల దోషిగా తేలిన లక్షద్వీప్ ఎంపీ మహ్మద్ ఫైజల్‌ను అనర్హుడిగా ప్రకటిస్తూ శుక్రవారం లోక్‌సభ సెక్రటేరియట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. కవరట్టిలోని సెషన్స్ కోర్టు ఆయన్ను దోషిగా ప్రకటించిన జనవరి 11వ తేదీ నుంచి ఆయన లోక్‌సభ సభ్యత్వ అనర్హత అమల్లోకి వస్తుందని అందులో పేర్కొంది. ప్రజాప్రాతినిధ్య చట్టం–1951లోని ఆర్టికల్ 102(1)(ఇ) ప్రకారం ఈ మేరకు ప్రకటిస్తున్నట్టు వివరించింది. హత్యాయత్నం నేరం రుజువు కావడంతో లక్షద్వీప్‌లోని కోర్టు ఫైజల్ సహా నలుగురికి 10 ఏళ్ల జైలు శిక్ష విధించిన విషయం తెలిసిందే.

చైనాలో 35 రోజుల్లో... 60 వేల కరోనా మరణాలు

బీజింగ్: చైనాలో కోవిడ్–19 కల్లోలం కొనసాగుతూనే ఉంది. గత 35 రోజుల వ్యవధిలో దేశవ్యాప్తంగా 59,938 మంది కరోనా వల్ల మరణించారని నేషనల్ హెల్త్ కమిషన్ శనివారం తెలియజేసింది. గత ఏడాది డిసెంబర్ 8 నుంచి ఈ ఏడాది జనవరి 12 దాకా ఈ మరణాలు సంభవించాయని పేర్కొంది.

ఇరాన్‌లో మాజీ అధికారికి ఉరి

దుబాయ్: బ్రిటన్ రహస్య నిఘా సంస్థ 'ఎం 16'కు సమాచారం చేర వేస్తున్నాడనే అనుమానంతో రక్షణ శాఖ మాజీ అధికారి అలీ రెజా అక్బారీని ఉరి తీసినట్లు ఇరాన్ ప్రభుత్వం తెలిపింది. బ్రిటన్–ఇరాన్ ద్వంద్వ పౌరసత్వం ఉన్న అక్బారీ ఇరాన్ రక్షణ శాఖలో కీలకంగా ఉన్న అలీ షంఖానీకి సన్నిహితుడిగా పేరుంది. ఇరాన్ ప్రభుత్వం అక్బారీని 2019లోనే అదుపులోకి తీసుకున్నట్లు అనుమానిస్తున్నారు. గతంలోనే అక్బారీకి మరణ శిక్ష విధించి, తాజాగా ఆ విషయం బయటపెట్టి ఉంటుందని భావిస్తున్నారు. దేశంలో అంతర్గతంగా ఆధిపత్య పోరు జరుగుతున్నట్లు అర్థమవుతోందని పరిశీలకులు అంటున్నారు. తాము వద్దంటున్న అక్బారీకి ఇరాన్ ప్రభుత్వం మరణ శిక్ష విధించడంపై బ్రిటన్, అమెరికా మండిపడుతున్నాయి.

స్నేహితుడి ఎదుటే విద్యార్థినిపై గ్యాంగ్ రేప్

కాంచీపురం: కళాశాల విద్యార్థినిని బెదిరించి ఆమె స్నేహితుడి ఎదుటే ఐదుగురు దుండగులు గ్యాంగ్‌రేప్‌కు పాల్పడ్డారు. ఈ ఘటన తమిళనాడులోని కాంచీపురం సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బెంగళూరు–పుదుచ్చేరి రహదారి పక్కనున్న ప్రైవేట్ స్కూల్ ఆవరణలో బాధితురాలు తన స్నేహితుడితో మాట్లాడుతోంది. అదే సమయంలో అక్కడికి చేరుకున్న ఐదుగురు వ్యక్తులు వారిని ముట్టడించారు. చంపుతామని బెదిరిస్తూ స్నేహితుడు చూస్తుండగానే ఆ విద్యార్థినిపై అత్యాచారానికి వడిగట్టారు. వారి నుంచి ఎలాగోలా తప్పించుకుని బాధితురాలు, ఆమె స్నేహితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బోల్సోనారోపై విచారణకు బ్రెజిల్ సుప్రీంకోర్టు ఓకే

రియోడీజనీరో: జనవరి 8వ తేదీన బ్రెజిల్ రాజధానిలో జరిగిన విధ్వంసానికి కారకులను గుర్తించేందుకు మాజీ అధ్యక్షుడు బోల్సోనారో తదితరులపై విచారణకు ఆ దేశ సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది. అల్లర్లు జరిగిన రెండు రోజుల తర్వాత బోల్సోనారో ఫేస్‌బుక్‌లో ఒక వీడియో పోస్ట్ చేశారు. 'దేశ సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం కారణంగానే లులా డిసిల్వా అధ్యక్షుడయ్యారే తప్ప, ప్రజల ఓట్లతో కాదు' అంటూ అందులో వ్యాఖ్యానించారు. దీనిని బట్టి బోల్సోనారో కొట్లాటలను ప్రేరేపించినట్లుగా ఉందని దేశ ప్రాసిక్యూటర్ జనరల్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన చేసిన వినతిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలెగ్జాండర్ డి మోరెస్ విచారణకు అనుమతి మంజూరు చేశారు. కాగా, ఆ వీడియోను అనంతరం బోల్సోనారో తొలగించారు.

అతనివన్నీ కట్టు కథలు

'ఎయిర్ ఇండియా' బాధితురాలి అసహనం

న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా విమానంలో మూత్ర విసర్జన ఘటనలో నిందితుడు శంకర్ మిశ్రా యూటర్న్ తీసుకోవడంపై బాధితురాలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బహుశా ఆమే మూత్రం పోసి ఉంటారని మిశ్రా కోర్టులో చేసిన వాదనల్ని ఖండించారు. అతను చెబుతున్నవన్నీ అబద్ధాలని, తనను అవమానపరచడానికే అలాంటి వాదన చేశాడని అన్నారు. "నిందితుడు చెబుతున్నవన్నీ కట్టు కథలు. అతని బెయిల్ దరఖాస్తులో చేసిన వాదనలకి, కోర్టులో చెప్పిన వాటికి పొంతనలేదు. హఠాత్తుగా యూటర్న్ తీసుకున్నాడు'' అని బాధితురాలి తరఫున కేసుని వాదిస్తున్న లాయర్ అంకూర్ మహీంద్రో ఒక ప్రకటనలో తెలిపారు.

జోషిమఠ్ బాటలో...

ఉత్తరాఖండ్‌లో కుంగుతున్న ఊళ్లు

- బీటలు వారుతున్న ఇళ్లు
- ఏడాదికి 6.5 సెం.మీ కుంగిపోతున్న పట్టణాలు



జోషిమఠ్‌లో హోటల్‌ను కూల్చివేస్తున్న అధికారులు (ఇన్‌సెట్లో) బీటలువారిన ఓ ఇల్లు

ప్రకృతిలో సహజసిద్ధంగా వచ్చే మార్పులు కొన్ని, మానవ తప్పిదాలు మరిన్ని మొత్తంగా ఉత్తరాఖండ్‌నే ముంచే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. భూగర్భ పొరల్లో జరుగుతున్న మార్పులు, కొండల్ని తొలచి కట్టే అభివృద్ధి ప్రాజెక్టులు హిమాలయాల్లో కొన్ని పట్టణాలకు పెను ముప్పుగా మారుతున్నాయి. జోషిమఠ్ తరహాలో మరిన్ని పట్టణాలు కుంగిపోయే ప్రమాదం ఉందని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. కొండల్లో రాళ్లు, మట్టి వదులుగా మారి ఏ క్షణంలో ఏ ముప్పు ముంచుకొస్తోందన్న భయంతో స్థానికులు క్షణమొక యుగంగా గడుపుతున్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ జూలై 2020 నుంచి మార్చి 2022 మధ్య చేసిన అధ్యయనంలో జోషిమఠ్ చుట్టుపక్కల ప్రాంతాలు ఏడాదికి 6.5 సెంటీమీటర్లు కుంగిపోతున్నట్టుగా గుర్తించారు. ఒకప్పుడు ఇళ్లకు చిన్న పాటి చీలికలు కనిపించేవి. ఇప్పుడు భారీగా పగుళ్ల మాదిరిగా ఏర్పడుతూ ఉండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

తెహ్రీ: ఈ ప్రాంతంలోని కొన్ని ఇళ్లలో పగుళ్లు కనిపిస్తున్నాయి. భారత్‌లో అత్యంత ఎత్తైన తెహ్రీ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టు సమీపంలో పట్టణం ఉండడంతో ఆ ప్రాంతంలో మట్టి వదులుగా మారుతోంది. పర్యాటకుల్ని ఎంతగానో ఆకర్షించే తెహ్రీ కూడా కుంగిపోయే పట్టణాల జాబితాలోకి చేరడం ఆందోళన కలిగిస్తోంది.

కర్ణప్రయాగ్: చమోలి పట్టణానికి ఆగ్నేయంగా 82 కి.మీ. దూరంలో ఉన్న కర్ణప్రయాగ్‌లో 50కి పైగా ఇళ్లలో పగుళ్లు వచ్చాయి. దీంతో ఇళ్లు ఖాళీ చేసి ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లి పోయారు. చార్‌ధామ్ ప్రాజెక్టు మొదలైన తర్వాత కొండల్ని అశాస్త్రీయ పద్ధతుల్లో తొలిచేయడంతో తాము ప్రమాదంలోకి వెళ్లిపోతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తరకాశీ: ఈ ప్రాంతంలోని మస్తాది, భట్వాడీ గ్రామాలు కూడా కుంగిపోతున్నాయి. గ్రామాలు నెమ్మదిగా కుంగిపోవడం తెలుస్తోందని, ఇళ్లలో పగుళ్లు మొదలయ్యాయని స్థానికులు చెబుతున్నారు. జోషిమఠ్ మాదిరిగానే భట్వాడి గ్రామం కూడా గంగోత్రి నేషనల్ హైవే ప్రాజెక్టుకి పైన ఉంది. 2010లోనే ఇళ్లకు పగుళ్లు మొదలై ఏడాదికేడాది పెరుగుతున్నాయి.

నైనిటాల్: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన నైనిటాల్‌కు కూడా కుంగుపోయే ముప్పు పొంచి ఉంది. పర్యాటకుల రాకపోకలు ఎక్కువగా ఉండడం, నిర్మాణ పనులు అత్యధికంగా జరుగుతూ ఉండడం వల్ల త్వరలోనే నైనిటాల్ భవిష్యత్‌లో మునిగిపోయే అవకాశాలున్నాయని వివిధ అధ్యయనాలు చెబుతున్నాయి. నైనిటాల్‌లో ఎక్కడపడితే అక్కడ కొండల్ని తొలిచిన శిథిలాలు గుట్టలు పోసి కనిపిస్తాయి.

పితోరాగఢ్: కుమాన్ ప్రాంతంలో ఉన్న పితోరాగఢ్‌లో కూడా మట్టి, రాళ్లు బాగా వదులుగా మారిపోతున్నాయి. గర్బాంగ్, తల్లా ధుమార్, ఉమ్లి–భండారి గ్రామాల్లో ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న పంచేశ్వర్ డ్యామ్‌తో గ్రామాలన్నీ ధ్వంసమైపోతున్నాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

మనా: చైనా సరిహద్దుల్లో ఉన్న భారతీయ గ్రామాల్లో ఇదే చివరిది. గల్వాన్ లోయలో ఘర్షణల తర్వాత ఈ పట్టణంలో కీలక సైనిక స్థావరాలను ఏర్పాటు చేశారు. సైనికపరంగా ఇది మనకెంతో వ్యూహాత్మక ప్రాంతం. చార్‌ధామ్ ప్రాంతాలను కలిపే ప్రాజెక్టులో భాగంగా మనా మీద నుంచి జాతీయ రహదారి వెళుతోంది. ఈ రహదారి నిర్మాణంతో వాతావరణంలో చిన్నపాటి మార్పు వచ్చినా చెట్లు కూలిపోతున్నాయి. వన్యప్రాణులు అధికంగా ఉండే ఈ ప్రాంతంలో కొండచరియల ముప్పు పొంచి ఉంది.

పౌరి: పౌరిలో చాలా ఇళ్లు బీటలు వారి దీనావస్థకు చేరుకుంటున్నాయి. రిషికేశ్–కర్ణప్రయాగ్ రైల్వే ప్రాజెక్టు కోసం సొరంగం ఏర్పరచడానికి కొండల్ని పేలుస్తూ ఉండడంతో ఆ ఒత్తిడికి ఇళ్లలో పగుళ్లు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జోషి మఠ్ పరిస్థితి కళ్లెదురుగా ఉన్నప్పటికీ ప్రతీరోజూ రైల్వే ప్రాజెక్టు కోసం కొండల్ని పిండి చేసే కార్యక్రమాన్ని కేంద్రం ఆపలేదు.

జోడో యాత్రలో విషాదం

గుండెపోటుతో కాంగ్రెస్ ఎంపీ సంతోఖ్ సింగ్ చౌదరి మృతి



చండీగఢ్/న్యూఢిల్లీ: భారత్ జోడో యాత్రలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. యాత్రలో నడుస్తూ కాంగ్రెస్ ఎంపీ సంతోఖ్ సింగ్ చౌదరి(76) గుండెపోటుకు గురై మృతి చెందారు. దీంతో పార్టీ పెద్దలు యాత్రకు 24 గంటల పాటు విరామం ప్రకటించారు. సంతోఖ్ సింగ్ హఠాన్మరణం పట్ల కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కష్టపడి పనిచేసే సంతోఖ్ సింగ్ తమ పార్టీకి బలమైన మూలస్తంభంగా నిలిచారని కొనియాడారు. సంతోఖ్ సింగ్ పంజాబ్‌లోని జలంధర్ నుంచి రెండు సార్లు ఎంపీగా విజయం సాధించారు. శనివారం ఉదయం ఫిల్లౌర్ నుంచి ప్రారంభమైన పాదయాత్రలో పాల్గొన్నారు. రాహుల్ గాంధీతోపాటు ఉత్సాహంగా నడిచారు. యాత్రలో కాసేపటికి సంతోఖ్ సింగ్ హఠాత్తుగా గుండెపోటుకు గురయ్యారని, వెంటనే అంబులెన్స్‌లో ఫగ్వారాలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లామని, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తేల్చారని కాంగ్రెస్ నాయకుడు ప్రతాప్‌సింగ్ బాజ్వా చెప్పారు. మృతదేహాన్ని జలంధర్‌లోని ఆయన స్వగృహానికి తరలించామని తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. సంతోఖ్‌సింగ్ పట్ల గౌరవ సూచకంగా జోడో యాత్రను నిలిపివేశామని, ఆదివారం మధ్యాహ్నం జలంధర్‌లోని ఖల్సా కాలేజీ గ్రౌండ్ నుంచి పునఃప్రారంభం అవుతుందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ ట్విట్టర్‌లో తెలియజేశారు. సంతోఖ్ సింగ్ మరణ వార్త తనకు బాధ కలిగించిందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ పేర్కొన్నారు. ఆయన లేకపోవడం తమ పార్టీకి తీరని లోటు అని వెల్లడించారు. ఈ మేరకు సంతోఖ్ సింగ్ భార్యకు సోనియా లేఖ రాశారు. ప్రజాసేవ కోసం జీవితాన్ని అంకితం చేసిన మంచి నాయకుడు సంతోఖ్ సింగ్ అంటూ రాహుల్‌గాంధీ ట్వీట్ చేశారు. అలాగే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తదితర ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

ప్రధాని మోదీ సంతాపం

కాంగ్రెస్ ఎంపీ సంతోఖ్ సింగ్ చౌదరి మరణం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ట్విట్టర్‌లో సంతాపం తెలిపారు. పంజాబ్ ప్రజలకు ఎన్నో సేవలు అందించిన గొప్ప నాయకుడిగా సంతోఖ్ సింగ్ ఎప్పటికీ గుర్తుండిపోతారని కొనియాడారు.

నడకతో గుండె పదిలం..!



వాషింగ్టన్ : ప్రతిరోజూ ఉదయం లేవగానే కాస్త అటూ ఇటూ నడిస్తే మీ గుండెకు వచ్చే ముప్పు తగ్గుతుందని మరోసారి తాజా అధ్యయనంలో వెల్లడైంది. రోజుకి 6 వేల నుంచి 9 వేల అడుగులు వేసే వారిలో గుండెకు సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశం సగానికి సగం తగ్గిపోతోందని ఆ అధ్యయనం తెలిపింది. అమెరికన్ హార్ట్ అసోసియేషన్‌కు చెందిన జర్నల్ సర్క్యులేషన్ తాజా అధ్యయనం వివరాలను ప్రచురించింది..ఆ అధ్యయనం ప్రకారం రోజుకి 9 వేల అడుగులు నడిచే వారిలో గుండె వ్యాధులు వచ్చే ముప్పు 40–50 శాతం తగ్గిపోతుంది. మధ్య వయస్కులు రోజుకి 6 వేల నుంచి 9 వేల అడుగులు నడిస్తే గుండె సంబంధిత వ్యాధులు సోకే అవకాశం 50% తగ్గిపోతుంది. ఇక 60 ఏళ్ల వయసు పైబడిన వారు ఎంత ఎక్కువ నడిస్తే వారి గుండెకు అంత మంచిది. యుక్త వయసులో ఉన్న వారి గుండె ఆరోగ్యానికి, వారి నడకకు ఎలాంటి సంబంధమూ లేదు. నడకకి, గుండె ఆరోగ్యానికి మధ్య ఉన్న లింకుపై ఇప్పటివరకు జరిగిన ఎనిమిది అధ్యయనాల ఫలితాల్ని క్రోడీకరించి తాజా అధ్యయనాన్ని రూపొందించారు. 18 ఏళ్లకు పైబడిన వయసున్న వారు 20,152 మంది ఇందులో పాల్గొన్నారు. ఆరేళ్లపాటు వారి స్మార్ట్ వాచ్‌లు, ఫోన్‌ల్లో రికార్డయిన వివరాల ద్వారా తాజా అధ్యయనాన్ని రూపొందించారు.

సిసోడియా కార్యాలయంలో సీబీఐ సోదాలు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) విచారణను వేగవంతం చేసింది. ఈ కేసుకు సంబంధించిన కొన్ని రికార్డుల కోసం నిందితుడు, ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా కార్యాలయంలో శనివారం సోదాలు నిర్వహించినట్లు సీబీఐ అధికారులు వెల్లడించారు. ఢిల్లీ సెక్రటేరియట్‌లోని సిసోడియా కార్యాలయంలో సోదాలు జరిగాయని ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి. తన ఆఫీసులో గతంలో జరిపిన సోదాల్లో, ఇప్పుడు నిర్వహించిన సోదాల్లో సీబీఐ ఏమీ దొరకలేదని మనీశ్ సిసోడియా పేర్కొన్నారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. తాను ఏ తప్పూ చేయలేదని పునరుద్ఘాటించారు. ఢిల్లీలో పిల్లలకు మెరుగైన విద్య అందించేందుకు నిజాయతీగా పని చేస్తున్నానని తెలియజేశారు. లిక్కర్ స్కామ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న మనీశ్ సిసోడియా సీబీఐ విచారణకు లెఫ్టినెంట్ జనరల్ వీకే సక్సేనా గత ఏడాది సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. సిసోడియా సహా పలువురిపై సీబీఐ కేసు నమోదు చేసింది. గత ఏడాది నవంబర్ 25న కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. మొత్తం ఏడుగురి పేర్లు చార్జిషీట్‌లో ఉన్నాయి.

శబరిమలలో మకరజ్యోతి దర్శనం



శబరిమల: మకరవిలక్కు పర్వదినం రోజు శనివారం శబరిమల భక్తజన సంద్రంగా మారిపోయింది. నలుపురంగు దుస్తులు, ఇరుముడి కట్టుతో వేలాదిగా తరలివచ్చిన భక్తులు అయ్యప్పను దర్శించుకున్నారు. పూజారులు స్వామికి హారతి ఇచ్చారు. పందల రాజప్రాసాదం నుంచి పవిత్ర ఆభరణాలను అంతకుముందు ఊరేగింపుగా తీసుకువచ్చారు. హారతి అనంతరం కొండశిఖరాల మీదుగా మకరజ్యోతి దర్శనమిచ్చింది. ఈ సమయంలో స్వామియే శరణం అయ్యప్ప...అనే భక్తజన ఘోషతో ఆలయ పరిసరాలు మారుమోగిపోయాయి. ఆలయాన్ని ఈ నెల 20వ తేదీన మూసివేయనున్నారు.

గడ్కరీకి బెదిరింపులు



నాగ్‌పూర్: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి బెదిరింపు కాల్స్ రావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. నాగ్‌పూర్‌లోని నివాసం, కార్యాలయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. శనివారం ఉదయం 11.25–12.30 గంటల మధ్య నాగ్‌పూర్‌లోని ఖమ్లా ప్రాంతంలో ఉన్న గడ్కరీ ప్రజాసంబంధాల కార్యాలయానికి గుర్తు తెలియని వ్యక్తి మూడుసార్లు బెదిరింపు కాల్స్ చేశాడు. గడ్కరీని చంపుతామని, ఆయన కార్యాలయాన్ని పేల్చి వేస్తామంటూ హెచ్చరికలు చేశాడు. ఈ కాల్స్ చేసిన వారెవరనే విషయం గుర్తించేందుకు స్పీచ్ ఎనాలిసిస్ చేస్తున్నట్లు నాగ్‌పూర్ డీసీపీ రాహుల్ మదానె చెప్పారు. మంత్రి గడ్కరీ నివాసం, ఆఫీసుకు మధ్య కిలోమీటర్ దూరం ఉంటుంది.


శరద్ యాదవ్ అంత్యక్రియలు పూర్తి

భోపాల్: గురుగ్రామ్‌లోని మృతిచెందిన జనతాదళ్ యునైటెడ్ మాజీ అధ్యక్షుడు శరద్ యాదవ్(75) అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. మధ్యప్రదేశ్‌లో నర్మదాపురం జిల్లాలోని అంఖ్‌మౌలో ఆయన చితికి కుమారుడు శంతను బుందేలా, కూతురు సుభాషిణి నిప్పంటించారు.

కీవ్‌పై మరోసారి పేట్రేగిన రష్యా

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్ శనివారం ఉదయం భారీ పేలుళ్లతో దద్దరిల్లింది. డ్నిప్రావ్‌స్కీ ప్రాంతంలోని కీలకమైన మౌలిక వసతులే లక్ష్యంగా రష్యా ఈ దాడులకు ఒడిగట్టినట్లు భావిస్తున్నామని ఉక్రెయిన్ అధ్యక్ష కార్యాలయం తెలిపింది. క్షిపణి దాడులతో పలు ప్రాంతాల్లో 18 వరకు భవనాలు దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల మంటలు లేచాయి. ప్రాణనష్టం సంభవించలేదని పేర్కొంది. కీవ్‌పై జనవరి ఒకటో తేదీ తర్వాత రష్యా దాడులు జరపడం ఇదే ప్రథమం. అంతకుముందు ఉక్రెయిన్‌లోని రెండో అతిపెద్ద నగరం ఖర్కీవ్‌లోని పారిశ్రామిక ప్రాంతంపై రష్యా రెండు ఎస్–300 క్షిపణులను ప్రయోగించిందని ఆ ప్రాంత గవర్నర్ తెలిపారు. కీలక నగరం సొలెడార్ తమ అధీనంలోకి వచ్చిందంటూ రెండు రోజుల క్రితం రష్యా ప్రకటించగా, ఉక్రెయిన్ కొట్టిపారేసిన విషయం తెలిసిందే. రాజధాని కీవ్, ఇతర నగరాలను లక్ష్యంగా చేసుకొని రష్యా క్షిపణి దాడులకు తెగబడుతుండడంతో ఉక్రెయిన్‌కు అండగా నిలవడానికి బ్రిటన్ ముందుకొచ్చింది. ట్యాంకులు, శతఘ్ని వ్యవస్థలను ఉక్రెయిన్‌కి పంపిస్తామని బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ శనివారం నాడు హామీ ఇచ్చారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఫోన్‌లో సునాక్ మాట్లాడారు. అనంతరం బ్రిటన్ ప్రధాని కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఛాలెంజర్ 2 ట్యాంకులు, ఇతర శతఘ్ని వ్యవస్థ సాయంగా అందిస్తామని సునాక్ హామీ ఇచ్చినట్లు వెల్లడించింది. అయితే ఎన్ని ట్యాంకులు పంపిస్తారో, ఎప్పటిలోగా అవి ఉక్రెయిన్ చేరుకుంటాయో వెల్లడించలేదు. బ్రిటీష్ ఆర్మీ చాలెంజర్ 2 ట్యాంకులు నాలుగు వెంటనే పంపిస్తారని, మరో ఎనిమిది త్వరలోనే పంపిస్తారంటూ బ్రిటన్ మీడియా తెలిపింది. ఉక్రెయిన్‌లో మౌలికసదుపాయాలను లక్ష్యంగా చేసుకొని రష్యా దాడులకు తెగబడుతోంది.

నా భార్యకు రాజకుటుంబం క్షమాపణ చెప్పాలి



లండన్: బ్రిటన్ రాజకుటుంబం నుంచి క్షమాపణకు తన భార్య మేఘన్ మెర్కెల్ అర్హురాలని ఆమె భర్త ప్రిన్స్ హ్యారీ తేల్చిచెప్పారు. తన భార్యను మానసికంగా వేధింపులకు గురిచేశారని, ఆమెకు క్షమాపణ చెప్పాలని రాజకుటుంబాన్ని డిమాండ్ చేశారు. ఆయన తాజాగా డెయిలీ టెలిగ్రాఫ్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు. బ్రిటిష్ మీడియా తన భార్య మెర్కెల్‌ను అనవసరంగా ట్రోల్ చేస్తోందని విమర్శించారు. తన వదిన కేట్ మిడిల్టన్ పట్ల జనంలో సానుకూలత పెంచాలన్నదే మీడియా యత్నమని ఆరోపించారు. రాజకుటుంబాన్ని ముక్కలు చేయాలన్న ఉద్దేశం తనకు లేదన్నారు. రెండు పుస్తకాలకు సరిపడా సమాచారం తన వద్ద ఉందని, అదంతా బయటపెట్టి తన తండ్రిని, సోదరుడిని ఇబ్బంది పెట్టాలని తాను కోరుకోవడం లేదని చెప్పారు. తనకు, తండ్రికి, సోదరుడికి మధ్య జరిగిన విషయాలన్నీ బయటపెడితే వారు తనను ఎప్పటికీ క్షమించబోరని అన్నారు. తండ్రి, సోదరుడు తన పట్ల దారుణంగా వ్యవహరించారని, అయినప్పటికీ వారిని క్షమించడానికి సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. వారితో కూర్చొని మాట్లాడాలని అనుకుంటున్నట్లు తెలిపారు. తాను వారి నుంచి కేవలం జవాబుదారీతనం, తన భార్యకు క్షమాపణను మాత్రమే కోరుకుంటున్నానని ప్రిన్స్ హ్యారీ స్పష్టం చేశారు. ఆయన ఇటీవలే తన ఆత్మకథ 'స్పేర్'ను విడుదల చేశారు. ఇందులో పలు సంచలన విషయాలను బయటపెట్టారు. రాజకుటుంబంలో తనకు ఎదురైన చాలా అవమానాలను 'స్పేర్' పుస్తకంలో చేర్చలేదని ప్రిన్స్ హ్యారీ చెప్పారు.



పతంగి ఎగరేసిన అమిత్ షా

అహ్మదాబాద్‌లోని వెజల్పూర్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మకర సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీసమేతంగా గాలి పటం ఎగురవేసి సందడి చేశారు.

ప్రతికూల ఆలోచనల వల్లే ఆందోళన, కుంగుబాటు

- భావోద్వేగాలు నియంత్రించుకోవాలి
- యూనివర్సిటీ ఆఫ్ జెనీవా అధ్యయనం



లండన్: వృద్ధుల్లో ఆందోళన, కుంగుబాటు, ఒత్తిడికి ప్రతికూల భావోద్వేగాలు, ఆలోచనలే కారణమని పరిశోధకులు తాజా అధ్యయనంలో గుర్తించారు. మనసులో ప్రతికూల ఆలోచనలు మొదలైతే ఆందోళన పెరుగుతున్నట్లు తేల్చారు. భావోద్వేగాలను నియంత్రించుకుంటే ఒత్తిడి నుంచి బయటపడవచ్చని సూచించారు. పెద్దల్లో మెదడుపై ప్రతికూల ఆలోచనల ప్రభావం, మానసిక ఆందోళనకు మధ్య గల సంబంధాన్ని స్విట్జర్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ జెనీవాకు చెందిన న్యూరో సైంటిస్టులు కనుగొన్నారు. ఇతరుల మానసిక వ్యథ పట్ల యువకులు, వృద్ధులు ఎలా స్పందిస్తారు? వారి మెదడు ఎలా ఉత్తేజితం చెందుతుంది? వారిలో ఎలాంటి భావోద్వేగాలు తలెత్తుతాయి? అనే దానిపై పరిశోధన చేశారు. మొదటి గ్రూప్‌లో 27 మందిని(65 ఏళ్లు దాటినవారు), రెండో గ్రూప్‌లో 29 మందిని(25 ఏళ్ల యువకులు), మూడో గ్రూప్‌లో 127 మంది వయో వృద్ధులను తీసుకున్నారు. విపత్తుల వంటి ప్రతికూల పరిస్థితుల కారణంగా మానసికంగా బాధపడుతున్న వారి వీడియో క్లిప్పులను, తటస్థ మానసిక వైఖరి ఉన్నవారి వీడియో క్లిప్పులను చూపించారు. యువకులతో పోలిస్తే వయో వృద్ధుల మెదడు త్వరగా ఉత్తేజితం చెంది, ప్రతికూల భావోద్వేగాలకు గురవుతున్నట్లు ఫంక్షనల్ ఎంఆర్ఐ ద్వారా గమనించారు. వారి మనసులో సైతం ఆందోళన, కుంగుబాటు, ఒత్తిడి వంటి విపరీత భావాలు ఏర్పడుతున్నట్లు గుర్తించారు. అలాంటి ప్రతికూల భావోద్వేగాలను నియంత్రించుకుంటే ఆందోళన, ఒత్తిడి సైతం తగ్గుముఖం పడుతున్నట్లు కనిపెట్టారు. అధ్యయనం వివరాలను నేచర్ ఏజింగ్ పత్రికలో ప్రచురించారు.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
ఆదివారం | 15 | జనవరి | 2023

రేషన్ దుకాణాలకు 16న సెలవు

తిరువొత్తియూరు: రేషన్ దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సంక్రాంతి సంబరాలు జరుపుకునేందుకు గాను ఈనెల 16ను ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించింది. ఈ సందర్భంగా కార్మిక శాఖ మంత్రి పెరియ కరుప్పన్నను ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి పద్మనాభం, టీయూసీఎస్ కమ్యూనిస్టు ప్రధాన కార్యదర్శి రాజన్ స్వామినాథన్ తదితరులు పాల్గొన్నారు.


చెన్నై సంగమం వేడుకల్లో సీఎం స్టాలిన్ తదితరులు




భోగి వేడుకల్లో విద్యార్థినులు

నష్టాలను కాల్చివేసి.. కష్టాలను మసి చేసి.. ఆనందాలను పంచే భోగి పండగ సంబరాలు శనివారం అంబరాన్నంటాయి. భాగ్యాలను ప్రసాదించాలని వేడుకుంటూ ప్రజలు భోగి మంటలు వేసి, తలంటు స్నానాలు చేసి, కొత్త బట్టలు ధరించి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మధ్యాహ్నం నుంచి పెద్ద పండుగ ఏర్పాట్లలో బిజీ అయ్యారు. ఆదివారం పితృదేవతలను స్మరించుకుంటూ సంక్రాంతి వేడుకలు చేసుకుంటారు. అలాగే తమిళ సంస్కృతికి చిహ్నమైన జల్లికట్టులో సత్తా చాటేందుకు యువకులు సిద్ధమయ్యారు.

ఇంటింటా.. కోలాహలం

రాష్ట్రవ్యాప్తంగా భోగి సంబరాలు

- ఇళ్ల ముందు మంటలు వేసి సందడి చేసిన ప్రజలు
- దప్పులతో యువత హంగామా
- నేడు సంక్రాంతి పర్వదినం
- పెద్దపండుగకు సిద్ధమైన ప్రజలు
- శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్, ముఖ్యమంత్రి


సంక్రాంతి వేడుకల్లో గవర్నర్ ఆర్.ఎన్.రవి


పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై ఆధ్వర్యంలో..

సాక్షి, చెన్నై: దట్టమైన పొగమంచు కురుస్తుండగా.. ఇంటి ముందు ఎగసిన మంటలు.. వాకిళ్లలో వెలసిన ముగ్గులు.. కొత్తబట్టలు.. వెరసి పొంగల్ వేళ సంబరం అంబరాన్నంటింది. శనివారం వేకువ జామున వీధి వీధిలో భోగే..భోగి అన్న నినాదం మారుమోగింది. రంగవల్లికల్లో గొబ్బెమ్మ అందాలు, డూడూ బసవన్నల విన్యాసాలతో లోగిళ్లు కళకళలాడాయి. గవర్నర్ ఆర్ఎన్ రవి, సీఎం ఎంకే స్టాలిన్‌లు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

సందడే సందడి..

పాత ఆలోచనల్ని, ఇళ్లలోని పాత వస్తువులతో కలిపి భోగి మంటల్లో వేసి.. కొత్తదనానికి స్వాగతం పలుకుతూ ప్రజలు సందడి చేశారు. ఇళ్లు, అపార్ట్‌మెంట్ల ముందు ఆనందోత్సాహాలతో భోగి వేడుకలు జరుపుకున్నారు. పిల్లలు, యువకులు దప్పులు వాయిస్తూ తమ తమ ప్రాంతాలను చుట్టి వచ్చారు. మరికొన్ని చోట్ల కొయ్య చెక్కలను పేర్చి మంటలు వేశారు. ఇంకొన్ని చోట్ల టైర్లు, ప్లాస్టిక్ వస్తువులను తగల బెట్టేశారు. ఉదయం 4 గంటలకే భోగి మంటల వల్ల వీధులను పొగ ముంచెత్తింది. దీనికితోడు మంచు ప్రభావం కారణంగా పలుచోట్ల వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా చెన్నైలో పొగమంచు కారణంగా విమానాల రాకపోకలు ఆలస్యమయ్యాయి. ల్యాండింగ్, టేకాఫ్ సమయంలో పైలెట్లు అవస్థలు పడ్డారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో..

సంక్రాంతి శోభను తెలియజెప్పే విధంగా రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో శనివారం వేడుకలు జరిగాయి. ఆవడిలో జరిగిన సంబరాల్లో పోలీసులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. డీజీపీ శైలేంద్రబాబుతో పాటు పలువురు ఐపీఎస్ అధికారులు సందడి చేశారు. డప్పులు వాయిస్తూ, పొంగళ్లు తయారు చేస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. అలాగే చెన్నై శాలిగ్రామంలోని తన నివాసంలో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ వేడుకలు జరుపుకున్నారు. ఇంటి ముంగిట జీ-20 సమావేశాలను ఆహ్వానించే విధంగా ఇంటి ముంగిట ముగ్గులు వేయించారు. ఈసందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, తమిళనాడుతో పాటు తమిళగం కూడా కావాలని వ్యాఖ్యానించారు. గవర్నర్‌లను కయ్యానికి రమ్మని కాలు దువ్వడం ఇటీవల కాలంలో పెరిగిందని ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ చమత్కరించారు. శుక్రవారం రాత్రి రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆర్ఎస్ రవి నేతృత్వంలో సంక్రాంతి సంబరాలు అత్యంత వేడుకగా జరిగాయి. అలాగే సంక్రాంతిని పురస్కరించుకుని చెన్నై సంగమం వేడుకలకు 16 ప్రాంతాల్లో శ్రీకారం చుట్టారు. తమిళ సంస్కృతి, సంప్రదాయాలు, గ్రామీణ కళలను చాటే విధంగా ఈ సంబరాలు 17వ తేదీ రాత్రి 9 గంటల వరకు నిర్వహించనున్నారు. వీటిని శుక్రవారం రాత్రి సీఎం స్టాలిన్ ప్రారంభించారు.

తమిళ ఖ్యాతిని చాటేలా..

సంక్రాంతి పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని నేతలు ఆకాంక్షించారు. గవర్నర్ ఆర్ఎస్ రవి పేర్కొంటూ, తమిళ ప్రజల ఖ్యాతిని చాటే ఈ పండుగను రాష్ట్ర ప్రజలు ఆనందంతోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. సూర్యదేవుడిని, తమకు ఇష్టమైన దేవళ్లను తలచుకుని తమ కుటుంబాలతో ఆనందంగా గడపాలని, వీరత్వాన్ని చాటే జల్లికట్టును విజయవంతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. సీఎం ఎంకే స్టాలిన్ మాట్లాడుతూ ఈ మాసాన్ని తమిళ భాషా వైభవాన్ని చాటే నెలగా జరుపుకుందామని పిలుపు నిచ్చారు. ప్రజలందరి హృదయాల్లో ఆనందం వికసించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. తమిళనాడు ప్రజలందరూ కుల,మత వివక్ష లేకుండా సమానత్వంతో పండుగను ఆనందంగా జరుపుకోవాలన్నారు. సీఎం స్టాలిన్, అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళణి స్వామి, సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం, ఎండీఎంకే నేత వైగో, టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి, పీఎంకే నేతలు రాందాసు, అన్బుమణి రాందాసు, సీపీఎం నేత బాలకృష్ణన్, సీపీఐ నేతముత్తరసన్, ఎస్ఎంకే నేత శరత్ కుమార్, వీసీకే నేత తోళ్ తిరుమావళవన్, తమిళ మానిల కాంగ్రెస్ నేత జీకే వాసన్, అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం నేత దినకరన్, దివంగత సీఎం జయలలిత నెచ్చెలి చిన్నమ్మ శశికళ తదితరులు రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంటిల్లి పాది ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

కిక్కిరిసిన మార్కెట్లు..

సంక్రాంతి వేడుకల్లో అతిముఖ్య ఘట్టం పెద్ద పండుగ. ఆదివారం పితృదేవతలను స్మరించుకునేందుకు బట్టలు, పూజా సామాగ్రిని కొనుగోలు చేసేందుకు చేసేందుకు శనివారం మార్కెట్లకు జనం పోటెత్తారు. కోయంబేడు, ప్యారిస్, తాంబరం తదితర మార్కెటల్లో విక్రయాలు జోరుగా సాగాయి. పొంగళ్లు పెట్టేందుకు కుండల్ని జనం కొనుగోలు చేశారు. డిమాండ్ దృష్ట్యా పూజా సామాగ్రి, పువ్వుల ధరలు ఆకాశాన్నంటాయి. పితృదేవలతకు పూజలు చేసిన అనంతరం ఆలయాలకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడం ఆనవాయితీ కావడంతో నగరంలోని ప్రధాన దేవాలయాల్లో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాగా చెన్నై నుంచి 4 లక్షల మంది జనం పండుగ నిమిత్తం స్వస్థలాలకు తరలి వెళ్లారు.


కోయంబేడు బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

ప్రభుత్వ ప్రత్యేక బస్సులు, ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినా.. ఆమ్నీ ప్రైవేటు బస్సుల్లో చార్జీల దోపిడీ యథేచ్ఛగా సాగింది. కొన్ని చోట్ల అధికారులు వీటిపై కొరడా ఝుళిపించారు.

నేడు జల్లికట్టుకు శ్రీకారం

తమిళుల వీరత్వాన్ని చాటే జల్లికట్టు పోటీలకు మదురై వేదికగా ఆదివారం శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటికే పుదుకోట్టై జిల్లా తచ్చంకురిచ్చిలో తొలి ఎద్దుల పోటీ నిర్వహించారు. అయితే మదురై జిల్లా జల్లికట్టుకే ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఆదివారం అవనీయాపురంలో ఆ జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో జల్లికట్టు పోటీలు నిర్వహించనున్నారు. సోమవారం పాలమేడులో, మంగళవారం అలంగానల్లూరులో యువకులు సత్తా చాటనున్నారు. కాగా ఈసారి క్రీడాకారులకు రూ. 2 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించారు.


చెన్నైలో దప్పులు మోగిస్తూ భోగి సందడి




మార్కెట్‌లో పసుపు, చెరుకు విక్రయాలు


కుండలు కొనుగోలు చేస్తూ..


పొగమంచు కారణంగా వాహనదారుల అవస్థలు

న్యూస్‌రీల్

బ్యాటరీ వాహనాలకు 100 శాతం పన్ను రాయితీ

– తమిళనాడు ప్రభుత్వం కీలక ఉత్తర్వులు

సాక్షి, చెన్నై: అన్ని రకాల బ్యాటరీ వాహనాలకు పన్ను నుంచి 100 శాతం రాయితీ కల్పిస్తున్నామని తమిళనాడు ప్రభుత్వం శనివారం ఉత్వర్వులు జారీ చేసింది. వివరాలు.. పెట్రోల్, డీజిల్ వాహనాలకు ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రిక్ బ్యాటరీ వాహనాల తయారీ రాష్ట్రంలో ఊపందుకుంటున్న విషయం తెలిసిందే. ఈ ఉత్పత్తి సంస్థలను ప్రోత్సహించే విధంగా, పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే బ్యాటరీతో నడిచే ద్విచక్ర వాహనాలకు పన్నుపై 50 శాతం రాయితీ అని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ రాయితీని 100 శాతంగా చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. తమిళనాడు మోటార్ వెహికల్ చట్టం 1974 సెక్షన్ 20లోని అంశాల మేరకు తాము పన్నుపై పూర్తి రాయితీ ఇవ్వనున్నామని ప్రకటిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయడం విశేషం. ఇందుకు కేంద్ర ఆర్థికశాఖ అనుమతి అవసరం లేదని పేర్కొనడం గమనార్హం.

డీఎంకే నేతపై రాజ్‌భవన్ ఫిర్యాదు

– అజ్ఞాతంలోకి వెళ్లిన శివాజీ కృష్ణమూర్తి

సాక్షి, చెన్నై: రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవిని అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారంటూ డీఎంకే నేత, అధికార ప్రతినిధి శివాజీ కృష్ణమూర్తిపై రాజ్‌భవన్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి, గవర్నర్ ఆర్ఎన్ రవికి మధ్య గత కొంతకాలంగా జరుగుతున్న వివాదం గురించి తెలిసిందే. ఈ పరిస్థితుల్లో శనివారం రాజ్‌భవన్ సంయుక్త కార్యదర్శి ప్రసన్న రామస్వామి చెన్నై పోలీసు కమిషనర్ శంకర్‌జివ్వాల్‌కు ఆన్‌లైన్ ద్వారా, పోస్టల్ ద్వారా ఓ ఫిర్యాదు చేశారు. చెన్నై విరుగంబాక్కంలో జరిగిన కార్యక్రమంలో డీఎంకే అధికార ప్రతినిధి శివాజీ కృష్ణమూర్తి గవర్నర్ ఆర్ఎన్ రవికి వ్యతిరేకంగా తీవ్ర వ్యాఖ్యలు చేశారని వివరించారు. శివాజీ కృష్ణమూర్తిపై రాష్ట్రపతి, గవర్నర్‌లకు వ్యతిరేకంగా ఎవరైనా స్పందించిన పక్షంలో నమోదు చేసే కఠిన సెక్షన్లను మోపాలని ఆదేశించారు. దీంతో ఆ డీఎంకే నేత అజ్ఞాతంలోకి వెళ్లారు. అధికార పార్టీకి చెందిన నేతపై రాజ్‌భవన్ పోలీసులకు ఫిర్యాదు చేయడం ఇదే ప్రపథమం కావడంతో ఈ అంశం చర్చకు దారి తీసింది.

డీఎంకేలో యువతే కీలకం

- సీఎం స్టాలిన్ వ్యాఖ్య
- యువజన విభాగం కోసం ప్రత్యేక యాప్


వేదికపై స్టాలిన్, ఉదయ నిధి తదితరులు

సాక్షి, చెన్నై : డీఎంకేలో ఎన్ని అనుబంధ విభాగాలు ఉన్నా, పార్టీకి వెన్నెముకగా యువజన విభాగం మాత్రమే ఉంటోందని ఆ పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ వ్యాఖ్యనించారు. శనివారం అన్నా అరివాలయంలో డీఎంకే యుజన విభాగం నేతృత్వంలో సమావేశం జరిగింది. ఆ విభాగం కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేంలో స్టాలిన్ యువజన విభాగం శిక్షణ తరగతులను శనివారం ప్రారంభించారు. అలాగే యువజన విభాగం కోసం ప్రత్యేకంగా యాప్‌ను ఆవిష్కరించారు. లోక్‌సభ ఎన్నికలకు యువతను సిద్ధం చేసే విధంగా ఈ శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామని ఉదయనిధి స్టాలిన్ ఈ సందర్భంగా ప్రకటించారు. డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ, డీఎంకేపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు యువత సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశానికి హాజరు కావడంతో తనకు పాత రోజులు గుర్తుకు వస్తున్నాయని వివరించారు. తాను ఇదే విభాగం నుంచి రాజకీయాల్లోకి వచ్చానని, తన చేతుల మీదుగా పురుడు పోసుకున్న ఈ విభాగం ప్రస్తుతం పార్టీకి వెన్నెముకగా ఉండడం ఆనందంగా ఉందన్నారు. గతంలో ప్రతిపక్షంలో డీఎంకే ఉన్నప్పుడు యువజన విభాగం చేసిన సేవలను గుర్తు చేస్తూ, అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వ ప్రగతిని ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా దూసుకెళ్లాలని పిలుపు నిచ్చారు. ఈసందర్భంగా తనయుడు, యువజన నేత ఉదయ నిధి స్టాలిన్ సేవలను గుర్తు చేస్తూ, తాను ప్రతి పనిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నానని పేర్కొన్నారు. కేంద్రం చర్యలను, ప్రతిపక్షాల చర్యలను ఎండ గట్టే విధంగా యువత దూసుకెళ్లాలని పిలుపు నిచ్చారు. పార్టీకి అనుబంధంగా ఎన్ని విభాగాలు ఉన్నా, యువజన విభాగమే కీలకం అన్నారు. ఈ సమావేశంలో డీఎంకే నేతలు రాజ, పొన్ముడి, టీఆర్‌బాలు, టీకేఎస్ ఇలంగోవన్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ వెనక్కి తగ్గారా..?

- ఢిల్లీలో ఏం జరిగింది?
- సంక్రాంతి శుభాకాంక్షల్లో తమిళనాడు గవర్నర్ అని పేర్కొన్న ఆర్ఎన్ రవి
- రాష్ట్రంలో విస్తృత చర్చ


ఆర్ఎన్ రవి

సాక్షి, చెన్నై : రాష్ట్రం పేరు తమిళనాడు, తమిళగం అనే వ్యవహారంలో గవర్నర్ ఆర్ఎన్ రవి వెనక్కి తగ్గారనే వాదన వినిపిస్తోంది. ఢిల్లీలో ఏం జరిగిందో ఏమో గానీ ఆయన తొలుత సంక్రాంతి సంబరాల ఆహ్వాన పత్రికలో తమిళగం గవర్నర్ అని పేర్కొన్నారు. అయితే శనివారం విడుదల చేసిన సంక్రాంతి శుభాకాంక్షల్లో మాత్రం తమిళనాడు గవర్నర్ అని పేర్కొనడం చర్చనీయాంశమైంది. వివరాలు.. రాష్ట్ర ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య గత కొంతకాలంగా జరుగుతున్న వివాదం గురించి తెలిసిందే. ఈ వ్యవహారం ఏకంగా ఢిల్లీకి చేరింది. డీఎంకే ఇచ్చిన ఫిర్యాదుపై రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము స్పందించారు. విచారణ చేపట్టాలని కేంద్ర హోంశాఖను ఆమె ఆదేశించినట్లు సమాచారం. దీంతో ఢిల్లీ వెళ్లిన గవర్నర్ ఆర్ఎన్ రవి శనివారం కేంద్ర హోంమంత్రిత్వ శాఖలోని కీలక అధికారులను, ప్రధాని నరేంద్ర మోదీ సన్నిహిత అధికారులను కలిసినట్లు సమాచారం. అక్కడ నుంచి వచ్చిన తరువాత సంక్రాంతి శుభాకాంక్షల ప్రకటనలో తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్‌రవి అని పేర్కొన్నారు. ఇక పొరుగు రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో లెఫ్టినెంట్ గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ సంక్రాంతి వేడుకల్లో తమిళనాడు కావాలి.. తమిళగం కూడా కావాలని వ్యాఖ్యానించడం గమనార్హం.

కరుప్పన్నన్ కోసం రంగంలోకి గుమ్కీలు



సేలం: ఈరోడ్‌లో వీరంగం సృష్టిస్తున్న కరుప్పన్నన్ అనే ఏనుగును పట్టుకునేందుకు శనివారం మూడు గుమ్కీ ఏనుగులు రంగంలోకి దిగాయి. గత కొన్ని రోజులుగా ఈరోడ్ జిల్లాల్లో కరుప్పన్నన్ అనే ఏనుగు అటవీ సరిహద్దు గ్రామాల్లో వీరంగం సృష్టిస్తోంది. ఇళ్లను ధ్వంసం చేయడమే కాకుండా స్థానికులపై తన ఆగ్రహాన్ని చూపుతోంది. దీనిని పట్టుకునేందుకు అటవీ అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేపట్టారు. అయితే ఆ ఏనుగు చిక్కడం లేదు. దీంతో మూడు గుమ్కీ ఏనుగుల సాయంతో దానిని బంధించడానికి చర్యలు ప్రారంభించారు.

ఒకే దేశం.. ఒకే ఎన్నికకు మద్దతు

- అన్నాడీఎంకేలో పళణి శిబిరం స్పష్టీకరణ


పళణి స్వామి

సాక్షి, చెన్నై: ఒకే దేశం ఒకే ఎన్నికకు అన్నాడీఎంకే సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈమేరకు కేంద్ర న్యాయ కమిషన్‌కు ఆ పార్టీ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళణి స్వామి నేతృత్వంలోని శిబిరం శనివారం మద్దతు తెలుపుతూ ఓ లేఖ పంపించింది. వివరాలు.. లోక్‌సభ ఎన్నికలతో పాటు అన్నిరాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించే విధంగా ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటన గురించి తెలిసిందే. ఈ విషయంపై అన్ని రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీల అభిప్రాయాలను కేంద్ర న్యాయ కమిషన్ సేకరిస్తోంది. ఇందుకు సమాధానం ఇవ్వాలని అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళణి స్వామి నేతృత్వంలోని శిబిరానికి 2 రోజుల క్రితం కేంద్ర న్యాయ కమిషన్ లేఖ పంపించింది. ఈ విషయంపై శనివారం పార్టీ వర్గాలతో పళణి స్వామి చర్చించినట్లు తెలిసింది. మెజారిటీ శాతం నేతలు ఒకే దేశం..ఒకే ఎన్నిక నినాదానికి మద్దతు తెలియజేశారు. దీంతో తమ అభిప్రాయాలను లేఖ రూపంలో పళణి స్వామి శిబిరం తెలియజేసింది. ఇందులో ఒకే దేశం..ఒకే ఎన్నిక నినాదానికి తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్నాడీఎంకే పోరాటం ఉధృతం చేసిన విషయం తెలిసిందే. ఆ పార్టీ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టి మళ్లీ తాము అధికారంలోకి రావడమే లక్ష్యంగా పళణి వ్యూహాలకు పదును పెట్టారు. ఈ సమయంలో కేంద్రం నినాదానికి సంపూర్ణ మద్దతును పళణి శిబిరం తెలియజేయడం రాజకీయంగా చర్చకు దారి తీసింది. ప్రజలు ఎన్నుకున్న డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లుకాక ముందే, మళ్లీ అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించే విధంగా కేంద్రానికి అన్నాడీఎంకే మద్దతు తెలియజేయడం గమనార్హం. అయితే ఈ వ్యవహారంలో అన్నాడీఎంకే సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం ఎలా స్పందిస్తారనే ఉత్కంఠ నెలకొంది.

కొట్టిచంపేశారు..!

- బాలుడి మృతి కేసులో ఆరుగురి పోలీసుల అరెస్టు

సాక్షి, చెన్నై: జువెనల్ హోంలో ఓ బాలుడి కొట్టి చంపేశారనే ఆరోపణలతో ఆరుగురు పోలీసులను శనివారం చెంగల్పట్టు పోలీసు అధికారులు అరెస్టు చేశారు. వివరాలు.. చెన్నై శివారులోని తాంబరానికి చెందిన ప్రియ కుమారుడు గోకుల్(16)ను గత నెల 30వ తేదీన పోలీసులు అరెస్టు చేశారు. రైల్వే ట్రాక్‌లపై ఉన్న సిగ్నల్స్‌లోని బ్యాటరీలను ఈ బాలుడు దొంగతనం చేసి పాత సామాన్ల దుకాణాలకు విక్రయిస్తున్నాడనే ఆరోపణలతో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బాలుర జువెనల్ హోంకు తరలించారు. ఆ మరుసటి రోజే ఆ బాలుడు చెంగల్పట్టులోని బాలుర జువెనల్ హోం అనుమానాస్పద స్థితిలో మరణించాడు. ఆందోళన చెందిన తల్లి ప్రియ తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని కోర్టును ఆశ్రయించారు. దీంతో న్యాయమూర్తి రీనా విచారణ చేపట్టారు. ఒకే ఆయుధంతో ఆ బాలుడిపై పలుమార్లు దాడి చేయడం వల్లే మరణించినట్లు పోస్టుమార్టం నివేదిక తేల్చింది. దర్యాప్తులో జువెనల్ హోం పర్యవేక్షణాధికారి మోహన్, పీసీలు చంద్రబాబు, విద్యాసాగర్, చరణ్ రాజ్, హానెస్ట్ రాజ్, ఉదయకుమార్ ఆ బాలుడిని ఓ ఆయుధంతో చిత్రహింసలకు గురి చేసి చంపినట్లు వెలుగు చూసింది. దీంతో ఈ ఆరుగురిని శనివారం అరెస్టు చేసి కటకటాలలోకి నెట్టారు. ఈ కేసులో కూడా బాధిత బాలుడిని అనవసరంగా ఇరికించినట్లు తెలుస్తోంది. నిందితులపై శాఖా పరమైన చర్యలకు ఆ జిల్లా ఎస్పీ ఆదేశించారు.

క్లుప్తంగా

సంక్రాంతి కానుకల పంపిణీ



కానుకలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

పళ్లిపట్టు: పళ్లిపట్టు పట్టణ పంచాయతీ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులకు ఎమ్మెల్యే చంద్రన్ శనివారం సంక్రాంతి కానుకలను అందజేశారు. డీఎంకే పట్టణ కార్యదర్శి జ్యోతికుమార్, పట్టణ పంచాయతీ చైర్‌పర్సన్ మనిమేగలై, మురళి, పట్టణ పంచాయతీ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

55 మెట్రిక్ టన్నుల వ్యర్థాల తొలగింపు

తిరువొత్తియూరు: భోగి పండుగ సందర్భంగా తాంబరంలో పారిశుద్ధ్య కార్మికులు 55 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తొలగించారు. కార్పొరేషన్ పరిధిలోని మాంబలంలో 8 మెట్రిక్ టన్నులు, పల్లావరంలో 13 మెట్రిక్ టన్నులు, చెంబాక్కంలో 14, పెరుంగలత్తూర్‌లో 12, ఈస్ట్ తాంబరంలో 6 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తొలగించినట్లు కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

భారత్ అభియాన్‌పై అవగాహన



గ్రామస్తులతో విద్యార్థులు

సాక్షి, చెన్నై: భారత్ అభియాన్ కార్యక్రమాలపై గ్రామాల్లో అవగాహన కల్పించే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎస్ఐఎంఏటీఎస్ డైరెక్టర్ రమ్య దీపక్ నేతృత్వంలో విద్యార్థులు చెన్నై శివారులోని కిలాచేరి తదితర గ్రామాల్లో పర్యటించారు. గ్రామ పంచాయతీల్లోని సమస్యలను తెలుసుకున్నారు. వివిధ నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించడమే కాకుండా, భారత్ అభియాన్ కార్యక్రమాలను గ్రామీణ ప్రజలకు వలంటీర్లు వివరించారు. నైపుణ్యాల ఆధారిత శిక్షణ కార్యక్రమాలు, వృత్తి శిక్షణ తదితర అంశాలను తెలియజేశారు.

మహిళా ద్వేషికి జెడ్ కేటగిరీ భద్రతా?

• గాయత్రీ రఘురాం ప్రశ్న



గాయత్రి రఘురాం

సాక్షి, చెన్నై: రాష్ట్ర బీజేపీలో మహిళలకు ఎక్కడ భద్రత ఉందో..? తాను తండ్రిగా భావించే ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ నుంచి బయటకు వచ్చిన మహిళా నేత, సినీ నటి గాయత్రి రఘురాం వ్యాఖ్యానించారు. మహిళలను అవమాన పరిచే జోకర్‌కు జెడ్ కేటగిరీ భద్రత కల్పించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలైకు వ్యతిరేకంగా సొంత పార్టీ నాయకుల నుంచి వస్తున్న విమర్శల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ పార్టీ మహిళ నేత, సినీ నటి గాయత్రి రఘురాం అధ్యక్షుడికి వ్యతిరేకంగా తరచూ తీవ్ర వ్యాఖ్యల తూటాలను పేల్చుతూ వస్తున్నారు. తాజాగా అధ్యక్షుడు అన్నామలైకు జెడ్ కేటగిరీ భద్రత కల్పించడంపై ఆమె స్పందించారు. ఈ మేరకు శనివారం ట్వీట్ చేశారు. ఇందులో తనను తీవ్రంగా అవమానపరిచి, అత్యంత నీచాతి నీచంగా తనతో వ్యవహరించిన అధ్యక్షుడికి జెడ్ కేటగిరీ భద్రత ఎందుకో..? అని ప్రశ్నించారు. రాష్ట్ర బీజేపీలో మహిళ భద్రత సూపర్ అని ఎద్దేవా చేస్తూ, ప్రధాని నరేంద్రమోదీని తాను తండ్రిస్థానంలో చూస్తానని పేర్కొన్నారు. రాజకీయ జోకర్‌కు ఈ భద్రత అవసరమా..? అని విమర్శించారు. ఇలాంటి వారి కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం శోచనీయమన్నారు.

దూరంగా శాసన సభాపక్ష నేత..

అసెంబ్లీలో సేతు సముద్రం ప్రాజెక్టు సాధనే లక్ష్యంగా డీఎంకే ప్రభుత్వం తీర్మానం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇందుకు బీజేపీ శాసన సభాపక్ష నేత నయనార్ నాగేంద్రన్ మద్దతు ఇచ్చారు. రామసేత వంతెనకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై అందుకు భిన్నంగా మీడియాతో స్పందించారు. ఇది ఈ ఇద్దరి నేతల మధ్య ఉన్న విభేదాలను ఈ విషయం స్పష్టం చేస్తోందనే వాదన వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం తిరునల్వేలిలో జరిగిన సంక్రాంతి వేడుకలకు అన్నామలై హాజరైనా నయనార్ నాగేంద్రన్ దూరంగా ఉండటం చర్చకు దారి తీసింది. తిరునల్వేలి జిల్లాలో సీనియర్‌నేతగా నాగేంద్రన్ ఉన్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారం పార్టీలో చర్చకు దారి తీసింది.

అన్నమయ్య.. ఓ కర్మయోగి



రాధికా మంగిపూడి

కొరుక్కుపేట: తొలి తెలుగు వాగ్గేయకారుడిగా, పద కవితా పితామహుడిగా ఖ్యాతి గాంచిన అన్నమాచార్య... కవి, భక్తుడు మాత్రమే కాక కర్మయోగి, జ్ఞానయోగి, దార్శనికుడు, మానవతా వాది కూడా అని సింగపూర్‌కి చెందిన ప్రముఖ రచయిత్రి రాధికా మంగిపూడి వ్యాఖ్యానించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి ఆధ్వర్యంలో నెలనెలా వెన్నెల కార్యక్రమంలో ధనుర్మాసం సందర్భంగా అన్నమయ్య పేరిట ఉపన్యాస కార్యక్రమం జరిగింది. సంస్థ తరపున సీనియర్ పాత్రికేయురాలు కనక దుర్గ వడ్లమాని కార్యక్రమాన్ని నిర్వహించి వక్త రచయిత్రి రాధికా మంగిపూడి పరిచయం చేశారు. మధురమైన స్వరంతో ఆద్యంతం శాంతంగా నవ్వుతూ ప్రసంగించిన రాధిక అన్నమాచార్య రచనా శైలిని, కీర్తనలలో ఆయన వెల్లడించిన వేంకటేశ్వర భక్తి తత్వాన్ని, సామాజిక స్పృహను విశ్లేషించారు. అచంచలమైన భక్తికి మారుపేరు అయిన ఆయన అనితర సాధ్యమైనటువంటి 32 వేల సంకీర్తనలను రచించారని గుర్తు చేశారు. ఇటు అచ్చ తెలుగులోను, అటు సంస్కృతంలోనూ రచనలు చేసిన ఆయన కవి, భక్తుడు మాత్రమే కాక కర్మయోగి, జ్ఞానయోగి, దార్శనికుడు, మానవతా వాది కూడా అంటూ... ఆయనలోని ఆయా లక్షణాలను తెలిపే పలు సంకీర్తనలను ఉదహరించారు. అన్నమాచార్య దృష్టిలో తన, మన అంటూ ఎవ్వరూ వేరువేరుగా లేరని, అందరినీ ఆయన భగవత్ స్వరూపులుగానే భావించారని ఓ కీర్తన విశ్లేషణ సందర్భంగా వక్త వ్యాఖ్యానించారు. జ్ఞానిగా వెలిగిన అన్నమయ్య మానవాళికి ఎల్లప్పుడూ పూజ్యుడు, అజరామరుడు అంటూ రాధిక ప్రసంగాన్ని ముగించారు.

స్వచ్ఛ తిరువళ్లూరుగా తీర్చిదిద్దుతాం



డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్

తిరువళ్లూరు: స్వచ్ఛ తిరువళ్లూరుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ అన్నారు. తిరువళ్లూరు జిల్లా విల్లివాక్కం యూనియన్ అడయాళంపట్టు గ్రామంలో పేరుకుపోయిన చెత్తకుప్పల డంపింగ్ ప్రక్రియను కలెక్టర్ అధికారులతో కలిసి శనివారం మధ్యాహ్నం పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇటీవల డంపింగ్ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ మొక్కలు నాటాలని సూచించారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా సుమారు 13 ప్రాంతాల్లో చెత్తకుప్పలు పేరుకపోయినట్లు గుర్తించామని తెలిపారు. వీటి వల్ల పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందన్నారు. పారిశుద్ధ్యం లోపించి ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. దీంతో చెత్తను డంప్ చేసి ఆయా ప్రాంతాల్లో మొక్కలు నాటాలని నిర్ణయించామన్నారు. మొదటి దశలో అడయాళంపట్టులో తొలగింపు ప్రక్రియను పూర్తి చేశామన్నారు. మిగిలిన ప్రాంతాల్లోనూ త్వరలోనే పనులను ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. ప్రజలు సైతం ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించాలని కోరారు.

ఏపీ మంత్రి రోజాతో భేటీ



తమిళ సినిమా: నటి, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి రోజాను చెన్నైకి చెందిన సినీ సంగీత దర్శకుడు, తమిళనాడు బీజేపీ విదేశీ తమిళ భాషాభివృద్ధి విభాగం అధ్యక్షుడు దినా, పేరరసు, పూపాండియన్ శుక్రవారం సాయంత్రం చెన్నైలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఏప్రిల్‌లో నిర్వహించనున్న ఓ కార్యక్రమానికి ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్‌లో తమిళాన్ని పాఠశాలల్లో అదనపు (ఆసక్తి కలిగిన విద్యార్థులు చదువుకునే విధంగా) భాషగా ప్రవేశ పెట్టాలని కోరారు.

నియామక పత్రాల అందజేత

తిరువొత్తియూరు: చెన్నై వ్యాసార్పాడిలో ఉన్న రవీశ్వర ఆలయంలో ఐదేళ్లకు పైగా సర్వీస్ ఉన్న ఆరుగురు ఉద్యోగులకు శాశ్వత నియామకం చేస్తూ హిందూ దేవాలయశాఖ సహాయ కమిషనర్ భాస్కరన్ నియామక పత్రాలు అందజేశారు. ఆలయాల్లో ఐదైళ్లకుపైగా పనిచేస్తున్న ఉద్యోగులను 110 సెక్షన్ కింద పర్మినెంట్ చేయాలని గత ఏడాది తమిళనాడు ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో చెన్నై వ్యాసార్పాడిలో ఉన్న సూర్య క్షేత్రమైన శ్రీరవీశ్వర ఆలయంలో అకౌంటెంట్ నందకుమారు, ఆలయ అర్చకులు మనోజ్ కుమార్, రోజా రమణి, సెక్యూరిటీలు విజయ్‌కుమార్, కృష్ణ కుమార్, సురేష్ కుమార్‌ను రెగ్యూలర్ చేశారు. ఎగ్జిక్యూటివ్ అధికారి శివప్రకాష్, ఆలయం మేనేజర్ ఎస్ ధనశేఖర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నందకుమార్

వేలూరు: ప్రభుత్వ ఎగ్జిబిషన్‌ను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నందకుమార్ అన్నారు. రాష్ట్ర సమాచార శాఖ ఆధ్వర్యంలో వేలూరు కోట మైదానంలో ఉన్న పెరియార్ పార్కులో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను శనివారం ప్రారంభించారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందజేశారు. వివిధ శాఖల ద్వారా ఏర్పాటు చేసిన అవగాహన స్టాల్స్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందని తెలిపారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసమే ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆయనతో పాటు వేలూరు ఎమ్మెల్యే కార్తికేయన్, మేయర్ సుజాత ఆనంద్‌కుమార్, డీఆర్‌ఓ రామమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ఎన్నో మార్పులు



అతిథిని జ్ఞాపికతో సత్కరిస్తున్న ప్రిన్సిపల్ శేషగిరిరావు

కొరుక్కుపేట: ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా మానవుడి జీవితంలో అనేక మార్పులు తీసుకొచ్చేందుకు అవకాశం ఉందని అన్నా విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ సర్వే ట్రైనింగ్ అండ్ రీసెర్చ్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.విద్య అభిప్రాయపడ్డారు. ''డైవర్స్ అప్లికేషన్స్ ఆఫ్ రీసెర్చ్ పారాడిగ్మ్స్ ఇన్ ఏ ఐ'' పేరుతో రెండు వారాల ఏఐటీసీఈ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ అకాడమీ హైబ్రిడ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను చెన్నైలోని సెయింట్ జోసెఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విద్య మాట్లాడుతూ.. మానవ మేధస్సుతో పోలిస్తే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాలా వేగవంతంగా పనిచేస్తుందన్నారు. కంప్యూటర్లు ఎక్కువ డేటాను వేగవంతమైన రేటుతో నిర్వహించగలవన్నారు. ఉదాహరణకు, మానవ మేధస్సు గణిత సమస్యను 5 నిమిషాల్లో పరిష్కరించగలిగితే, ఏఐ ఒక నిమిషంలో 10 సమస్యలను పరిష్కరించగలదన్నారు. అధ్యాపకుల కోసం నాణ్యమైన నిరంతర వృత్తిపరమైన అభివృద్ధి కార్యక్రమాన్ని అందించడం అటల్ లక్ష్యం అని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న కిడ్స్ ఫ్యాషన్ షో



కొరుక్కుపేట: చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం, ప్రతిభాపాటవాలు వెలికితీసేలా చెన్నై వేళచ్చేరిలో ఉన్న ఫీనిక్స్ మార్కెట్ సిటీలో నిర్వహించిన కిడ్స్ ఫ్యాషన్ ఫియస్టా–2023 అందరినీ ఆకట్టుకుంది. పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన కిడ్స్ ఫ్యాషన్ షో సందర్శకులను, ఫ్యాషన్ ప్రియులను ఎంతగానో ఉత్సాహపరిచింది. యువకులు, బాలికలు భారతీయ, పాశ్చాత్య సంస్కృతి సంప్రదాయాలను తెలిపే వస్త్రాలను ధరించి చేసిన ర్యాంప్ వాక్ అమితంగా ఆకట్టుకుంది. సృజనాత్మక ఫ్యాషన్ డిజైనర్లు సైతం చిన్నారులతో కలిసి క్యాట్ వాక్ చేశారు. పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు.

కోలీవుడ్ టాక్స్

ఆ కోరిక నెరవేరింది



టీఎంజేఏ పొంగల్ వేడుక



ప్రసంగిస్తున్న దర్శకుడు శీను రామసామి

తమిళ సినిమా: తమిళ సినిమా పత్రికల సంఘం ఆధ్వర్యంలో స్థానిక వడపళనిలో శుక్రవారం పొంగల్ వేడుకలు నిర్వహించారు. సంఘం అధ్యక్షురాలు కవిత నేతృత్వం వహించారు. ప్రముఖ దర్శకుడు శీను రామసామి, సంగీత దర్శకుడు దినా, నృత్య దర్శకుడు శ్రీధర్, నటుడు తంగదురై తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సంప్రదాయ బద్ధంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సంఘం నిర్వాహకులు అతిథులను వేదికపైకి ఆహ్వానించి సత్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు శీను రామసామి మాట్లాడుతూ.. పాత్రికేయులను కలుసుకోవాలని, వారికి పొంగల్ శుభాకాంక్షలు అందించాలని, కృతజ్ఞతలు తెలియజేయాలని చాలా కాలంగా ఉండేదన్నారు. ఆ కోరిక ఈ వేడుకతో తీరిందని చెప్పారు. తాను కవితా పుస్తకం ఒక్కటి రాశానని చెప్పారు. పత్రికలు వారు అంటే సినిమా రూపకర్తలేనని, నేటి పత్రికల వారే రేపటి సినిమా రూపకర్తలు అని పేర్కొన్నారు. అందుకే తన కవితా పుస్తకాన్ని సీనియర్ పాత్రికేయులకు ఇవ్వాలని భావించానన్నారు. ఈయన పుకార్ పెట్టియిల్ పడుత్తురంగుం పూనై అనే కవితా పుస్తకాన్ని రాసి, దాన్ని దివంగత సినీ గీత రచయిత నా.ముత్తుకుమార్ అంకితం చేశారు. కాగా మరో అతిథి సంగీత దర్శకుడు దినా మాట్లాడుతూ.. పాత్రికేయులు సినిమా వాళ్ల గురించి రాయడం వల్లే వారు కోట్లు సంపాదిస్తున్నారని పేర్కొన్నారు. తానూ పాత్రికేయుల కారణంగానే ఎదిగానని అన్నారు.

త్వరలో విజయ్ సేతుపతి ఫార్సీ



ఫార్సీ వెబ్ సిరీస్ యూనిట్

తమిళ సినిమా: మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి ఆల్ రౌండర్‌గా దుమ్ము రేపుతున్నారు. హీరోగా.. విలన్‌గా.. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఇలా ఒక్క తమిళ భాషలోనే కాకుండా తెలుగు, హిందీ తదితర భాషల్లోనూ బిజీగా ఉన్నారు. తాజాగా వెబ్ ప్రపంచంలోకి అడుగు పెట్టారు. ఈయన ప్రధాన పాత్ర పోషించిన ఫార్సీ అనే వెబ్ సిరీస్ నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఫిబ్రవరి 10వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్ టైంలో స్ట్రీమింగ్‌కు సిద్ధమవుతోంది. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడం, హిందీ భాషల్లో 240 దేశాల్లో స్ట్రీమింగ్‌కు సిద్ధమవుతోంది. ఈ వెబ్ సిరీస్‌లో బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్, నటి రాశీ ఖన్నా, రెజీనా, కేకే.మీనన్, అమోల్ పాలేకర్, భువన్ అరోరా ప్రధాన పాత్రలు పోషించారు. రాజ్, డీకే ద్వయం దర్శకత్వం వహించింది. అమెజాన్ సంస్థ నిర్మించింది. డీ2ఆర్ ఫిలిమ్స్ పతాకంపై రూపొందించిన ఈ క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ ట్రైలర్‌ను శుక్రవారం ఆన్‌లైన్ ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా రాశిఖన్నా మాట్లాడుతూ.. వెబ్ సిరీస్ రూపకల్పనలో ఇప్పటికే విజయం సాధించిన దర్శకులు రాజ్, డీకే అని అన్నారు. ఈ వెబ్‌సిరీస్‌లో తాను భాగం కావడం సంతోషంగా ఉందన్నారు. విజయ్ సేతుపతి వంటి గొప్ప నటుడితో కలిసి నటించడం మంచి అనుభవంగా పేర్కొన్నారు. బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్ ఇందులో వైవిధ్యభరిత పాత్రలో కనిపిస్తారన్నారు. విజయ్ సేతుపతి మాట్లాడుతూ.. షార్ట్ ఫిలిం అయినా వెబ్ సిరీస్ అయినా మనసు పెట్టి నటించడమే తన కర్తవ్యం అని పేర్కొన్నారు. దర్శక ద్వయం రాజ్, డీకేలు తనపై నమ్మకంతో ఈ అవకాశాన్ని కల్పించారని, పూర్తి స్వేచ్ఛతో ఇందులో నటించానని చెప్పారు. బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్‌తో కలిసి నటించడం మంచి అనుభవాన్ని ఇచ్చిందన్నారు. రాశి ఖన్నాతో నటిస్తే ఆ సన్నివేశానికి ప్రత్యేకమైన రిథమ్ ఉంటుందన్నారు. ఆమెతో తెరపై కలిసి నటించడం ఎప్పుడూ సంతోషమేనని చెప్పారు.



నటి అంజలి

ఐదేళ్ల తర్వాత మాలీవుడ్‌లో..

తమిళ సినిమా: నటి అంజలి 5 ఏళ్ల తర్వాత మాలీవుడ్‌లో రీఎంట్రీ ఇచ్చారు. పదహారణాల తెలుగు అమ్మాయి అయిన ఈమె ముందు తమిళంలో కథానాయకిగా రాణించి ఆ తర్వాత మాతృభాష తెలుగులో గుర్తింపు పొందారు. తమిళంలో ఎక్కువగా యువ హీరోలతో జతకట్టిన ఈ బ్యూటీ తెలుగులో మాత్రం బాలకృష్ణ, వెంకటేష్ వంటి సీనియర్ హీరోల సరసన నటించారు. అదేవిధంగా ఐటం సాంగ్స్‌లోనూ మెరిశారు. వెబ్ సిరీస్‌లూ చేస్తున్నారు. తాజాగా శంకర్ దార్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న చిత్రంలో ఒక హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాగా అంజలి తమిళం, తెలుగు భాషలోనే కాకుండా మలయాళం వంటి ఇతర భాషల్లోనూ నటిగా గుర్తింపు పొందారు. ఈమె 2010లో పైన్స్ అనే చిత్రం ద్వారా మాలీవుడ్‌లో పరిచయం అయ్యారు. ఆ తరువాత 2018లో రోసాపూ చిత్రంలో నటించారు. ఐదేళ్ల గ్యాప్ తర్వాత మళ్లీ ఎప్పుడు మూడోసారి రట్ట అనే చిత్రంతో రీఎంట్రీ ఇచ్చారు. జోసెఫ్ చిత్రం ఫేమ్ జోజు జార్జ్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఇందులో నటి అంజలి కథానాయకిగా నటిస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్ దశలో ఉంది. అంజలి పాత్రతో కూడిన ఫస్ట్ లుక్ పోస్టర్ ఇటీవల విడుదల చేశారు.



అఖిలన్ చిత్రంలో ఓ సన్నివేశం

అఖిలన్‌గా జయం రవి

తమిళ సినిమా: పొన్నియిన్ సెల్వన్ టైటిల్ రోల్ పోషించి ఘన విజయాన్ని అందుకున్నారు జయం రవి. ప్రస్తుతం పలు చిత్రాలతో బిజీగా ఉన్నారు. అందులో ఒకటి అఖిలన్. భూలోకం చిత్రం ఫేమ్ కళ్యాణ్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రవికి జంటగా ప్రియా భవాని శంకర్ నటించారు. తాన్యా రవిచంద్రన్, హరీష్ ఉత్తమన్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. శ్యామ్ సీఎస్ సంగీతాన్ని అందించారు. ఇది జయం రవి నటిస్తున్న 28వ చిత్రం. ఇది కమర్షియల్ అంశాలతో యాక్షన్ కథాచిత్రంగా ఉంటుందని నటుడు జయం రవి ఇంతకుముందు ఒక భేటీలో తెలిపారు. ఇందులో ఆయన గ్యాంగ్‌స్టర్‌గా నటిస్తున్నట్లు సమాచారం. నటి ప్రియా భవాని శంకర్ పోలీస్ అధికారిగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని 7 స్క్రీన్ స్టూడియో పతాకంపై లలిత్ కుమార్ నిర్మిస్తున్నారు. చిత్ర షూటింగ్ పూర్తయి చాలా రోజులు అయ్యింది. క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ నెలలో విడుదల చేస్తున్నట్లు ముందు ప్రకటించారు. అయితే విడుదలను వాయిదా వేశారు. తాజాగా ఈ చిత్రాన్ని ఫిబ్రవరి రెండో వారం లేదా మూడో వారంలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

భయపెట్టనున్న యాషికా ఆనంద్!



యాషికా ఆనంద్

తమిళ సినిమా: అందాల నటి యాషికా ఆనంద్ భయపెట్టడానికి సిద్ధమవుతున్నారు. ఆ మధ్య కారు యాక్సిడెంట్ వల్ల నటనకు కొంత గ్యాప్ ఇచ్చారు. గాయం నుంచి కోలుకోవడంతో మళ్లీ సినిమాలు చేయడానికి రెడీ అయ్యారు. తాజాగా ఈమె ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం చైత్ర. యాషికా ఆనంద్ దెయ్యంగా నటిస్తున్న ఈ హారర్ థ్రిల్లర్ కథా చిత్రంలో నటుడు అవి తేజ్, శక్తి మహేంద్ర, పూజ, రమణన్, కన్నన్, లూయిస్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. మార్స్ ప్రొడక్షన్స్ పతాకంపై కె.మనోహరన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి కథ, కథనం, మాటలు, దర్శకత్వ బాధ్యతలను ఎం.జెనిత్ కుమార్ నిర్వహిస్తున్నారు. చిత్ర వివరాలను దర్శకుడు తెలుపుతూ పిజ్జా, డీమాంటీ కాలనీ చిత్రాల తరహాలో విభిన్న కథ, కథనాలతో కూడిన చిత్రంగా చైత్ర ఉంటుందన్నారు. ఇంతకుముందు ఎప్పుడు తెరపై చూడనటువంటి థ్రిల్లర్‌తో కూడిన హారర్ కథా చిత్రంగా దీన్ని తెరకెక్కిస్తున్నట్లు చెప్పారు. చిత్రం షూటింగ్ పూర్తిగా తిరునల్వేలి జిల్లాలోని కావల్ తినరు ప్రాంతంలో నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయని.. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. టీకన్నన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి సతీష్ కుమార్ ఛాయాగ్రహణను, ప్రభాకరన్ మెయ్యప్పన్ సంగీతాన్ని అందిస్తున్నారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో నెమలి మృతి

అన్నానగర్: విద్యుత్ షాక్‌తో నెమలి మృతిచెందిన ఘటన దిట్టచ్చేరిలో శుక్రవారం చోటుచేసుకుంది. నాగపట్నం జిల్లా దిట్టచ్చేరి గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో ఆహారం కోసం నెమళ్లు వస్తుంటాయి. పొన్నమ్మాళ్ సమాధి ప్రాంతంలోని వ్యవసాయ భూమిలో శుక్రవారం ఒక ఆడ నెమలి ఎగిరినప్పుడు విద్యుత్ తీగ తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై సమాచారం అందుకున్న దిట్టచ్చేరి పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ రామకృష్ణన్ సురేష్, స్పెషల్ సబ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చనిపోయిన నెమలిని నాగపట్నం అటవీ సంరక్షణ విభాగం అధికారి సిల్వాయిదాసికి అప్పగించారు. పోస్టుమార్టం అనంతరం నెమలిని తీసుకెళ్లి పాతిపెట్టాడు.

ప్రభుత్వాస్పత్రిలో డ్రైవర్ ఆత్మహత్య

అన్నానగర్: పళని ప్రభుత్వాస్పత్రిలో డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఆస్పత్రిలో రోజుకు 200 మంది వరకు ఔట్ పేషెంట్లు చికిత్స పొందుతుంటారు. కాగా శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఔట్ పేషెంట్ విభాగం సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అర్ధరాత్రి కావడంతో అతడిని ఎవరూ గమనించలేదు. అనంతరం శనివారం తెల్లవారుజామున 5.30 గంటలకు ఆస్పత్రి ఆవరణలోని లైట్లు ఆర్పేందుకు వచ్చిన వాచ్‌మెన్ చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని చూసి వెంటనే ఆస్పత్రి యాజమాన్యానికి సమాచారం అందించాడు. దీంతో వారు పళని టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. మృతుడి జేబులో సెల్‌ఫోన్‌ను గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి సెల్‌ఫోన్ ద్వారా జరిపిన విచారణలో కోయంబత్తూరు శరవణంపట్టికి చెందిన చంద్రశేఖర్ కుమారుడు శరవణభారతి (36) అని తేలింది. కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు.. అప్పుల బాధతో ప్రభుత్వాస్పత్రిలోకి వచ్చి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తేలింది. అయితే ఆత్మహత్యకు గల కారణాలు ఏమిటానే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎలక్ట్రీషియన్ అనుమానాస్పద మృతి

తిరువొత్తియూరు: వడపళనిలో ఎలక్ట్రీషియన్ అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. చెన్నైకి చెందిన జేమ్స్ (63) వడపళనిలో ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తున్నాడు. ఇతను శనివారం ఉదయం 8 గంటల సమయంలో అదే ప్రాంతంలోని ఓ దుకాణం వద్ద అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. దీనిపై స్థానికులు వడపళని పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ ఆనంద్ బాబు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని కీల్‌పాక్కం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తలకు గాయమై ఉండడంతో మద్యం మత్తులో కిందపడి మృతి చెందాడా? ఎవరైనా హత్య చేశారా? అని కోణంతో పోలీసులు విచారణ చేస్తున్నారు.

టూరిస్టు బస్సును ఢీకొన్న కారు
– ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

అన్నానగర్: టూరిస్టు బస్సును కారును ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. ఈ ఘటన తిరుచ్చిలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. కస్తూరిపురానికి చెందిన సురేష్ కుమారుడు అర్జున్ (20) చెన్నైలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ఇతని స్నేహితులు తిరుచ్చికి చెందిన అహ్మద్ (20)తో కలిసి శనివారం మదురై నుంచి తిరుచ్చికి కారులో వస్తున్నారు. తిరుచ్చి మణికండం ఎరకుడి డివిజన్ రోడ్డు వద్దకు రాగానే కారు అదుపు తప్పి చెన్నై నుంచి తిరునల్వేలి వెళ్తున్న టూరిస్టు బస్సును ఢీకొట్టింది. కారులోని అర్జున్, అహ్మద్ అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు టూరిస్టు బస్సు డ్రైవర్ సూళై కుమారన్ (60)ని అరెస్టు చేసి విచారిస్తున్నారు.

భవనం నుంచి పడి మహిళ మృతి

అన్నానగర్: చెన్నై కేకే నగర్‌లో నాలుగో అంతస్తు నుంచి పడి వివాహిత మృతిచెందింది. వివరాలు.. కనిగాపురంలోని ఓ అపార్ట్‌మెంట్ 4వ అంతస్తులో బ్యాంకు మేనేజర్ రాకేష్, భార్య యోగలక్ష్మి (30), కమారుడు సాయినాథ్ (2) ఉంటున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు రాకేష్ యథావిధిగా బ్యాంకుకు వెళ్లాడు. రాకేష్ వెళ్లిన కొద్దిసేపటికి యోగలక్ష్మి ఇంటి 4వ అంతస్తు బాల్కనీ నుంచి కిందపడింది. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు కేకే నగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ అలెక్స్, పోలీసులు యోగలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఓమందూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్య చేసుకుందా? ఎవరైనా తోసేశారా అనే కోణంలో విచారణ చేస్తున్నారు.

తిరుచెందూరు ఆలయంలో భక్తుల రద్దీ

తిరువొత్తియూరు: తిరుచెందూరు సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వరుస సెలవుల నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. కొందరు భక్తులు పాదయాత్రగా వచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. మరికొందరు భక్తులు శరీరాలకు శూలాలు గుచ్చుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ అధికారులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. రెండు రోజుల పాటు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించనున్నారు.

భోగి భాగ్యాలు


భోగి మంటలు


కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న వేలూరులోని నేతాజీ మార్కెట్

- వాడవాడలా భోగి మంటలు
- కిటకిటలాడిన మార్కెట్లు, వస్త్ర దుకాణాలు
- ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండ్లు

వేలూరు: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ సంక్రాంతి. రంగురంగుల ముగ్గులు, అందంగా అలంకరించిన గొబ్బెమ్మలతో ప్రతి ఇల్లూ కళకళలాడుతుంది. పొంగల్ రానే వచ్చింది. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించే రోజున మకర సంక్రాంతిగాను, దాని ముందురోజు భోగి పండుగను జరుపుకుంటారు. మకర సంక్రాంతి మరుసటి రోజున కనుమ, తర్వాతి రోజు ముక్కనుమ పండుగలను నిర్వహిస్తారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా సంక్రాంతి సందడి కనిపిస్తోంది. వేలూరు, తిరువణ్ణామలై జిల్లాల్లో శనివారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే ఇళ్ల ముందు భోగి మంటలు వేశారు. ఇతర ప్రాంతాల్లోని వారు స్వగ్రామాలకు వెళ్లేందుకు ప్రయాణమవ్వడంతో బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు కిక్కిరిశాయి. బస్సుల్లో అధిక రద్దీ కనిపించింది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో వేలూరు నేతాజీ మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది. ఉదయం 4 గంటల నుంచే ఇంట్లోని పాత వస్తువులతో భోగి మంటలు వేశారు. చోరీలు, చైన్ స్నాచింగ్‌లు జరగకుండా సుమారు 1500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అదే విధంగా వేలూరు నేతాజీ మార్కెట్‌లో కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఉంచారు. ఇదిలా ఉండగా వేలూరు సమీపంలోని పొయిగై సంతలో అధిక సంఖ్యలో పశువుల వ్యాపారం జరిగింది.


వేలూరు: వేడుకలను ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండియన్

సందడే సందడి

తిరుత్తణి: సంక్రాంతి సందర్భంగా శనివారం మార్కెట్లు కిక్కిరిశాయి. పూజాసామాగ్రి, దుస్తులు, చెరుకు, మట్టి కుండలు, రంగులు తదితర దుకాణాలకు జనం పోటెత్తారు. ఆదివారం సంక్రాంతి సందర్భంగా తిరుత్తణిలోని గాంధీ మార్కెట్‌లో కొనుగోలుదారుల రద్దీ నెలకొంది. పళ్లిపట్టు బజారుతో పాటు సంత మైదానంలో కొనుగోళ్ల సందడి నెలకొంది.

భోగితో శనివారం సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. పళ్లిపట్టు, తిరుత్తణి పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో యువకులు, చిన్నారులు భోగి మంటలు వేసి డప్పు వాయిస్తూ వేడుకలు నిర్వహించారు. ఆదివారం సంక్రాంతి సంబరాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో

వేలూరు: జూనియర్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో కాట్పాడిలోని అనాథాశ్రమంలో సంక్రాంతి వేడకలను శనివారం వేలూరు కార్పొరేషన్ మొదటి డివిజన్ చైర్మన్ పుష్పలత విన్నయరాజ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆశ్రమంలోని విద్యార్థినులు తమిళ సంప్రదాయ పద్ధతిలో పొంగుళ్లు పెట్టి, ఉట్టి కొట్టి సందడి చేశారు. అనంతరం డివిజన్ చైర్మన్ వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు మహిళలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్, రెడ్‌క్రాస్ కార్యదర్శి సేనా జనార్దనన్, ఉపాధ్యక్షులు పారివల్లల్, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి


పొంగలి చేస్తున్న మంత్రి నాజర్, కలెక్టర్

తిరువళ్లూరు: తమిళుల కళలు, సంప్రదాయాలను కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత యువతపై ఉందని పాడిపరిశ్రమల అభివృద్ధిశాఖ మంత్రి నాజర్ అన్నారు. తమిళనాడు టూరిజం ఆధ్వర్యంలో పూండిలో శనివారం సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి నాజర్ మాట్లాడుతూ.. తమిళుల సంప్రదాయం, కళలకు ఘనమైన చరిత్ర ఉందన్నారు. వాటిని భావి తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్టాలిన్ ముఖ్యమంత్రి అయ్యాక తొలి ఏడాది 26 రకాల సంక్రాంతి సరుకులను అందజేమన్నారు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా నగదు ఇవ్వలేకపోయామని తెలిపారు. ప్రస్తుతం కిలో బియ్యం, చక్కెర, చెరుకుతో పాటు రూ. వెయ్యి నగదు ఇచ్చినట్లు తెలిపారు. తమిళుల సంప్రదాయ పండుగైన సంక్రాంతిని పంచాయతీ, మున్సిపాలిటీ, జిల్లా కేంద్రాల్లో నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అన్నదాతను గౌరవించి సమాజంలో సముచిత స్థానాన్ని అందించాలని కోరారు. అనంతరం పొంగలి పెట్టి గ్రామీణ కళాకారుల ప్రదర్శనను తిలకించారు. ముగ్గుల పోటీలను పరిశీలించారు. కార్యక్రమంలో తిరువళ్లూరు కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్, సబ్‌కలెక్టర్ మహాభారతి, తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్, ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్, జెడ్పీ చైర్‌పర్సన్ ఉమామహేశ్వరి, టూరిజం జిల్లా అధికారి రాజారాం పాల్గొన్నారు.

వేలూరులో..

వేలూరు: వేలూరు కలెక్టరేట్‌లో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ కుమరవేల్ పాండియన్ ఆధ్వర్యంలో మహిళా అధికారులు పొంగళ్లు పెట్టారు. కార్యక్రమంలో ఎస్పీ రాజేష్ కన్నన్, డీఆర్‌ఓ రామమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐసీఎఫ్‌లో..

కొరుక్కుపేట: అంతర్జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందిన ఐసీఎఫ్ (ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ)లో సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. పీసీపీఓ మోహనరాజా, డిప్యూటీ సీపీఓ విశ్వనాథన్, ఎస్పీఓలు సుధాకరన్, జాన్ జోసఫ్, ఏపీఓ అర సెల్వంతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఉద్యోగినులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. పలువురు సాంప్రదాయ దుస్తులతో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే ఐసీఎఫ్ సౌత్ కాలనీలో 3 రోజుల సంక్రాంతి సంబరాలు శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సాంస్కృతిక కార్యక్రమాలతో సంక్రాంతి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. శనివారం చిన్నారులకు చిత్రలేఖన, వ్యాస రచన పోటీలు, క్రీడా పోటీలు నిర్వహించారు. ఆఖరి రోజు ఆదివారం సంక్రాంతి సంబరాలు ముగింపు రోజు ఐసీఎఫ్ జనరల్ మేనేజరు ఎస్ శ్రీనివాస్‌తో పాటు పలువురు అధికారులు, కార్మిక సంఘాల నేతలు పాల్గొని విజేతలకు బహుమతులు పంపిణీ చేయనున్నారు.

కాపు సేవా సమితి ఆధ్వర్యంలో..

కొరుక్కుపేట: తెలుగు సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు మన పండుగ విశిష్టతను తెలియజేయాలని ప్రముఖ సినీ నిర్మాత ఏఎం రత్నం అన్నారు. ఈ మేరకు కాపు సేవా సమితి – చెన్నై ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. సమితి అధ్యక్షుడు గూడపాటి జగన్ మోహన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు చెన్నై అంబత్తూర్ ఓటీలోని శ్రీ కైలాష్ మహల్ వేదికైంది. ముఖ్య అతిథులుగా సినీ నిర్మాత ఏఎం రత్నం, ప్రత్యేక ఆహ్వానితులుగా నటుడు తలైవాసల్ విజయ్, వైద్యురాలు డాక్టర్ విద్య, సంగీత దర్శకులు సాలూరు వాసూరావు కుమార్తె మాధవి, బిల్డర్ రమేష్, డాక్టర్ వరదరాజన్ హాజరయ్యారు. ముగ్గులు, జానపద, ఆధ్యాత్మిక పాటల పోటీల్లో మహిళలు సత్తా చాటారు. విజేతలకు బహుమతులు అందజేశారు.


వేలూరు: అనాథాశ్రమంలో సంక్రాంతి వేడుకలు జరుపుకుంటున్న రెడ్‌క్రాస్ సభ్యులు


కొరుక్కుపేట: అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు


వేడుకల్లో ఐసీఎఫ్ అధికారులు, సిబ్బంది

రూ.40 లక్షల విలువైన గుట్కా స్వాధీనం

- లారీ డ్రైవర్ అరెస్టు

అన్నానగర్: కూడలూరులో శుక్రవారం రూ. 40 లక్షల విలువైన గుట్కా సంచులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి లారీ డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కర్ణాటక రాష్ట్రం నుంచి నీలగిరి జిల్లా కూడలూరు మీదుగా కేరళకు నిత్యావసర సరుకులు పెద్ద సంఖ్యలో కార్గో ట్రక్కుల్లో రవాణా అవుతుంటాయి. 3 రాష్ట్రాల జంక్షన్ కావడంతో కూడలూరు చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుంటారు. కాగా, శుక్రవారం రాత్రి మైసూరు నుంచి కూడలూరు వైపు తమిళనాడు రిజిస్ట్రేషన్ నంబర్ గల లారీ తొరపల్లి చెక్ పోస్టు మీదుగా వెళుతుందని.. అందులో గుట్కా బస్తాలు ఉన్నాయని పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీంతో కూడలూరు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మహేష్ కుమార్, ఇన్‌స్పెక్టర్ అరుల్ లారీని ఆపి విచారించారు. కేరళ రాష్ట్రం మలప్పురం జిల్లా మన్నార్‌కాడు ప్రాంతానికి బిస్కెట్ ప్యాకెట్లను తరలిస్తున్నట్లు లారీ డ్రైవర్ చెప్పాడు. అయితే పోలీసులకు అనుమానం వచ్చి లారీని తనిఖీ చేశారు. బిస్కెట్ ప్యాకెట్ల మధ్య 58 మూటల్లో గుట్కా ఉత్పత్తులు ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ. 40 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు. కేరళ రాష్ట్రం మలప్పురం జిల్లా మన్నార్‌కాడు ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ సుధీర్ (43)ను అరెస్టు చేశారు. గుట్క ఉత్పత్తులను, వాటిని అక్రమంగా తరలించేందుకు ఉపయోగించిన లారీని స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

అన్నానగర్: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురు యువకులు మృతిచెందారు. ఈ ఘటన పేరవూరనిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. తంజావూరు జిల్లా పేరవూరని సమీపంలోని కలనికోట్టై గ్రామానికి చెందిన అరుణ్ కుమార్ (29), విఘ్నేష్ (23), ప్రకాష్ (20) కొబ్బరి కాయలు ఒలిచే కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈ ముగ్గురూ పాలిమేరలలోని విఘ్నేష్ బంధువు ఇంటికి వెళ్లి పొంగల్ సారెను ఇచ్చి బైక్‌పై శుక్రవారం రాత్రి ఊరికి తిరిగి వస్తున్నారు. మరో వైపు పేరవూరని సమీపంలోని మనక్కాడ్ నుంచి సౌండ్ సర్వీస్ నడుపుతున్న కార్తీ (26), పుదుకోట్టై జిల్లా అరంతాంగి తాలూకా సుబ్రమణ్యపురం విజయపురం ప్రాంతానికి చెందిన సతీష్ (25), సేస్తు గనాదియన్ (26) పొంగల్ ఉత్సవాల కోసం మైక్ సెట్‌ను ఏర్పాటు చేసి ఒకే బైకుపై ఊరుకి తిరిగి వస్తున్నారు. పూకొల్లై నుంచి ఉమ్మత్తనాడ్ వెళ్లే రోడ్డు మలుపు వద్ద రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అరుణ్ కుమార్, విఘ్నేష్ అక్కడికక్కడే మృతి చెందారు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కార్తీ మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురిని పుదుకోట్టై ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పేరవూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పేరవూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా మృతుడు అరుణ్ కుమార్‌ భార్య, 20 రోజుల కుమారుడు ఉన్నారు. పేరవూరని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం


పెంచలస్వామి, గోదాదేవికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోనలో శనివారం శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, గోదాదేవి కల్యాణ్యాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గోదాదేవి 30 రోజులపాటు ధనుర్మాస వ్రతాన్ని ఆచరించి స్వామివారిలో భోగిపండుగనాడు ఐక్యమైనందుకు గాను కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు ఉదయం తిరుచ్చిపై గోదాదేవిని, పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి కోన మాడ వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. అనంతరం కల్యాణం జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

క్వారీ మేనేజర్‌కు బెదిరింపు
–పంచాయతీ ఉపాధ్యక్షురాలి భర్త అరెస్ట్


అరెస్టయిన లోకనాథన్

తిరుత్తణి: రాళ్లక్వారీని ముట్టడించిన కేసులో పంచాయతీ ఉపాధ్యక్షురాలి భర్తను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. తిరుత్తణి మండలంలోని సూన్యనగరం గ్రామ పంచాయతీ కొండలో ప్రభుత్వ అనుమతి పొందిన రాళ్ల క్వారీ ఉంది. ఈ క్వారీలో ప్రభుత్వం అనుమతించిన మొత్తం కన్నా అధికంగా నాటు బాంబులు పెట్టి రాళ్లు పేల్చి తరలిస్తున్నట్లు కొద్ది రోజులుగా గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో పంచాయతీ ఉపాధ్యక్షురాలు లక్ష్మీ భర్త లోకనాథం క్వారీకి వెళ్లి మేనేజర్ మురుగన్‌ను బెదిరించి క్వారీ నుంచి మామూలు ఇవ్వాలని లేకపోతే క్వారీని మూసివేయిస్తానని బెదిరించినట్లు క్వారీ యజమాని ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తిరుత్తణి పోలీసులు కేసు నమోదు చేసి లోకనాథంను అరెస్టు చేశారు. అలాగే తొమ్మిది మందిపై కేసులు నమోదు చేశారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు


అరెస్టయిన శంకరపాండ్యన్

తిరువళ్లూరు: వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 12 సవర్ల బంగారు నగలను రికవరీ చేశారు. తిరువళ్లూరు జిల్లా తిరునింద్రవూర్ ప్రాంతానికి చెందిన పార్థసారథి(49), రాజ్‌కుమార్(48), కస్తూరి(73) ఇళ్లలో ఇటీవల చోరీలు జరిగాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఆవడి కమిషనర్ సందీప్ రాయ్‌రాథోడ్ ఆదేశాల మేరకు రెండు రోజుల నుంచి పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో తిరునింద్రవూర్ పరిధిలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణన్ అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. పట్టుబడిన వ్యక్తి కొత్తకీల్పాక్కం కోవలం ప్రాంతానికి చెందిన శంకరపాండ్యన్‌గా గుర్తించారు. ఇతడి వేలిముద్రల ఆధారంగా తిరునింద్రవూర్‌లో జరిగిన మూడు చోరీల్లో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. అతన్ని అరెస్టు చేసి 12 సవర్ల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తిరువళ్లూరు జ్యుడీషియల్ కోర్టులో హాజరుపరిచారు. నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించడంతో పుళల్ జైలుకు తరలించారు.

బోల్తాపడిన కోకాకోలా వాహనం


రోడ్డున పడి ఉన్న సాఫ్ట్ డ్రింక్ బాటిళ్లు

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- కోకాకోలా బాటిళ్లను ఎత్తుకుపోయిన స్థానికులు

శాంతిపురం: మండలంలోని కూతేగానిపల్లి వద్ద పలమనేరు జాతీయ రహదారిలో కారు ఢీకొనడంతో కోకాకోలా ఉత్పత్తులతో వెళ్తున్న వాహనం బోల్తాపడింది. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించకుండా రోడ్డుపై పడిన కోకాకోలా సాఫ్ట్ డ్రింక్ బాటిళ్లను దర్జాగా ఎత్తుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు.. దుకాణాలకు కోకాకోలా సాఫ్ట్ డ్రింక్ బాటిళ్లను సరఫరా చేసేందుకు కుప్పం నుంచి మినీ టెంపో శనివారం శాంతిపురం మండలానికి వచ్చింది. తిరిగి వెళుతుండగా కూతేగానిపల్లి వద్ద కారు ఢీకొనడంతో బోల్తా పడింది. అందులో ఉన్న కుప్పానికి చెందిన యశ్వంత్, హరీష్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. యశ్వంత్‌పై బాటిళ్ల కేస్‌లు పడడంతో అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. అతన్ని రోడ్డు పక్కన వెళుతున్న కొందరు బయటకు తీశారు. పదుల సంఖ్యలో అక్కడికి చేరుకున్న జనం అందిన కాడికి బాటిళ్లు తీసుకుని వెళ్లిపోయారు. అనంతరం సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని గాయపడిన వారిని కుప్పం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై రాళ్లబూదుగూరు పోలీసులు విచారణ చేస్తున్నారు.

వేడుకగా భోగితేరు ఉత్సవం


భోగితేరుపై ఊరేగుతున్న శ్రీఆండాళ్ అమ్మవారు, శ్రీకృష్ణస్వామి

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో భోగి పండుగను పురస్కరించుకుని శనివారం భోగితేరు వేడుక వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి పర్వదినాలలో భాగంగా తొలి రోజు వచ్చే భోగి పండుగనాడు గోవిందరాజస్వామి ఆలయంలో భోగితేరు ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఉదయం ఆలయంలోని శ్రీఆండాళ్ అమ్మవారు, శ్రీకృష్ణస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆండాళ్ అమ్మవారిని, శ్రీకృష్ణస్వామి వారిని భోగితేరుపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల నడుమ భోగితేరు ఊరేగింపు చేపట్టారు. పెద్ద మాడవీధి, కర్ణాల వీధి, భేరివీధి, గాంధీ రోడ్డు మీదుగా ఆలయం వరకు భోగితేరు ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. ఆలయ డెప్యూటీ ఈఓ వీఆర్. శాంతి, ఏఈఓ రవికుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదమూర్తిరాజు పాల్గొన్నారు.

రేపు గోదా పరిణయోత్సవం

శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో సోమవారం గోదా పరిణయోత్సవం ఘనంగా చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఉదయం పుండరీకవల్లి అమ్మవారి ఆలయం నుంచి మేల్‌చాట్ వస్త్రం, పూలమాల ఊరేగింపుగా తీసుకెళ్లి శ్రీఆండాళ్ అమ్మవారికి సమర్పిస్తారు. సాయంత్రం శ్రీగోదా పరిణయోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం కనుమ రోజున నిర్వహించే పార్వేట ఉత్సవాన్ని టీటీడీ రద్దుచేసింది.



ప్రతి ఇంటా సంక్రాంతులు నిండాలి

భోగి మంటలు, రంగురంగుల ముగ్గులు.. వాటి మధ్య గొబ్బెమ్మలు, హరిదాసు సంకీర్తనలు ఇవన్నీ సంక్రాంతి ప్రత్యేకతలే. చిన్నప్పటి నుంచి సంక్రాంతి అంటే కొత్త దుస్తులు.. అమ్మ చేసే పిండి వంటలు.. ఇళ్లంతా సందడి వాతావరణం.. ఇవే గుర్తుకొస్తుంటాయి. అందరూ పాజిటివ్ థింకింగ్‌లో ముందుకెళ్లి అనుకున్న లక్ష్యాలు చేరుకోవాలి.

–ఛరిష్మా, మిస్ సౌత్ ఇండియా–2022

సంతోషం నింపాలి



సంక్రాంతి అనేది ఉమ్మడి సంస్కృతికి నిదర్శనం. ప్రకృతి శక్తులకు ప్రణమిల్లే పండగ. తియ్యని చెరుకు గెడలతో, పాలపొంగులతో వర్ధిల్లే పచ్చని వేడుక. భోగి మంట వేసేందుకు మేమంతా తెల్లవారుజామునే నిద్రలేచాం. కుటుంబమంతా సందడిగా గడిపాం. ఇంటికి గంగిరెద్దు కూడా వచ్చాయి. వాటికి పూజ చేశాం. సంక్రాంతి అందరిలో సంతోషాలు నింపాలి.

–పైడి రజని, మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్

కుటుంబమంతా ఒకే చోట..



ఉద్యోగం కోసం దూరప్రాంతాలకు వెళ్లినా.. సంక్రాంతికి అందరం ఒకే చోటకు చేరుకుంటాం. ఆట పాటలతో మూడు రోజులు ఏడాదికి సరిపడే సందడి చేస్తాం. ఇంటి ముందు ముగ్గులతో ప్రారంభమైన మా సంబరాలు కనుమ రోజు వివిధ పిండి వంటల ఆరగింపుతో ముగుస్తుంది.

–ఎం. భవాని, ఉద్యోగి

పల్లె అందం.. పట్నం వచ్చే...

సింహగిరికి సంక్రాంతి

- సంబరాలు ప్రారంభించిన శారదాపీఠం ఉత్తరాధికారి
- రాజగోపురం ఎదురుగా పెద్ద ఎత్తున భోగిమంట

సింహాచలం: సింహగిరిపై శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. సంక్రాంతి పండగ విశిష్టతను చాటుతూ, గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించే విధంగా శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం అధికారులు ఈ సంబరాలను ఘనంగా నిర్వహించారు. భోగి పర్వదినాన స్వామిని దర్శించుకునేందుకు సింహగిరికి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు.. సంక్రాంతి సంబరాలను కూడా తనివితీరా తిలకించారు. ముందుగా విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి ఈ సంబరాలను ప్రారంభించారు. ఆలయ రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో పెద్ద ఎత్తున వేసిన భోగిమంటకు స్వాత్మానందేంద్ర సరస్వతి హారతి ఇచ్చి పిడకలు వేశారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దినేష్‌రాజ్, దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశేషంగా ప్రదర్శనలు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా సింహగిరి మాడ వీధుల్లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ముత్యాల ముగ్గులు, చెరుకు గెడల



కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు



ధాన్యం గుట్టల వద్ద భక్తుల సందడి

జాలువలు, ఎడ్లబండి, నాగళ్లు, పూరి గుడిసెలు, గడ్డి మోపులు, రంగులు వేసిన కుండలు, గోవులు, ఎద్దులబండి, ట్రాక్టర్‌ను భక్తులు తిలకించారు. జంగం దేవర, కొమ్మదాసరి, హరిదాసులు సంక్రాంతి సంబరాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గంగిరెద్ల విన్యాసాలు, కోలాటం ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ధాన్యం గుట్టలవద్ద మహిళలు సందడి చేశారు. కుండల్లో పాలు పోసి పొంగించారు. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని ఆలయం, రాజగోపురం, మాడ వీధులను విశేషంగా అలంకరించారు.

సంక్రాంతి సామాన్యుల పండగ

సంక్రాంత్రి సామాన్యుల పండగ అని విశాఖ శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి అన్నారు. సింహగిరిపై ఆయన మీడియాతో మాట్లాడారు. భోగి పండగకు వైదిక పరంగా, పౌరాణికంగా ఎంతో విశిష్టత ఉందన్నారు. పల్లె సంప్రదాయాలను పాటిస్తూ పట్టణ ప్రాంతాల్లోనూ పండగను విశేషంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. రైతులంతా బాగుండాలని, పాడిపంటలతో రెండు తెలుగు రాష్ట్రాలు సస్యశ్యామలంగా కళకళలాడాలని అప్పన్నను ప్రార్థించినట్టు తెలిపారు. భగవంతుని అనుగ్రహం, విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపైనా ఉండాలని ఆకాంక్షించారు.



సిరిపురం పెట్రోల్ బంకు వద్ద పల్లె వాతావరణం ప్రతిబించేలా సంక్రాంతి సెట్టింగ్



గంగిరెద్దు విన్యాసం

మురళీనగర్(విశాఖ ఉత్తర): మన ఇంట్లో చేసుకుంటే అది మనకే పండగ. సకుటుంబ సపరివారంగా ఒకే వేదికపై పండగ చేసుకుంటే.. అదే సంక్రాంతి. అలాంటి సంక్రాంతి సందళ్లకు వేదికైంది మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు. ఇక్కడ ప్రజలు భోగి, సంక్రాంతి పండగలను ఆహ్లాదకరంగా నిర్వహించి తెలుగు సంప్రదాయ స్ఫూర్తిని చాటారు.



బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో భోగి మంటల వద్ద సందడి చేస్తున్న ప్రజలు

సందడే సందడి

- సకుటుంబ సమేతంగా భోగి ఉత్సవం
- మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో సంక్రాంతి సంబరాలు



చిన్నారులకు భోగిపళ్లు వేసి దీవిస్తున్న పెద్దలు

పల్లె దిగి వచ్చింది..

మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో నిర్వహించిన భోగి ఉత్సవాలు అంబరాన్ని తాకాయి. పల్లె వాతావరణాన్ని, మన తెలుగు సంస్కృతి సంప్రదాయాలను చాటి చెప్పే విధంగా నిర్వాహకులు వేడుకలు నిర్వహించారు. మురళీనగర్, మాధవధార నివాసితులందరూ ఓ చోట చేరి భోగి, సంక్రాంతి ఉత్సవాలు జరుపుకున్నారు. సంప్రదాయ వస్త్రధారణలతో మెరిపించి.. చూపరులను మైమరపించారు. తెల్లవారు జామున చలిని తరిమేందుకు భారీగా భోగి మంటలు వేసి దాని చుట్టూ



సంప్రదాయ వస్త్రధారణలో పెద్దల ఆటపాటలు



చైతన్య నగర్‌లో హరిదాసు సంకీర్తన

తిరుగుతూ సంక్రాంతి పాటలు పాడారు. వయోబేధం లేకుండా అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. గొబ్బెమ్మలను పూజించి పొష్యలక్ష్మికి ఆహ్వానం పలికారు. చిన్నారులకు భోగిపళ్ల వేసి దీవెనలు అందించారు. గంగిరెద్దుల ఆటలు, పులివేషాలు, తప్పెడగుళ్ల అలరించాయి.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

వయోబేధం లేకుండా డప్పు వాయిద్యాలు, సంగీత సాహిత్యాలకు అనుగుణంగా అందరూ చిందేశారు. కోలాటాలు, సంక్రాంతి పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి భోగి ప్రసాదం, ఫలహారం అందించారు. కార్యదర్శి నాగరాజు, జోనల్ కమిషనర్లు బి.రాము, పి.సింహాచలం, వైఎస్సార్ సీపీ యలమంచిలి నియోజక వర్గ కన్వీనర్ రొంగలి జగన్నాథం, పేట్రన్ మెంబరు పేడాడ రమణికుమారి, సంకు వెంకటేశ్వరరావు, సీనియర్ అడ్వకేట్ పృథ్వీరాజు, బోయపాటి శ్రీను, వాకర్స్ పార్కు ప్రతినిధులు మల్ల రామకృష్ణ, ఎ.చంద్రమౌళి, ఎంవీ రెడ్డి, కనకరాజు, కాంతారావు పాల్గొన్నారు.

నగరంలోనూ పల్లెసోయగం



తూరుపు తెలతెలవారుతుండగా.. పొగమంచు ఇంకా విచ్చిపోకముందే ముంగిట రకరకాల ముగ్గులు వేసి వాటి మధ్య బంతిపూలు తురిమిన గొబ్బిల్లు పెట్టే ఆడపిల్లలు.. పల్లెటూర్లలో ధనుర్మాస శోభకు వన్నెలు చేకూరుస్తారు. ఇవన్ని మా అమ్మ చెబుతుంటే భలే అనిపించేది. పల్లెప్రాంతాల్లో ఉన్న సందడి గురించి వేరే చెప్పాల్సిన పనిలేదు. ఇప్పుడు పల్లెసోయగం నగరంలోనూ కనిపిస్తోంది.

– నమావతి, వర్ధమాన నటి

అప్పన్నా.. అందుకోవయ్యా తొలిపంట

- రైతులు, భక్తులతో కిక్కిరిసిన సింహగిరి
- స్తంభించిన ట్రాఫిక్

సింహాచలం: భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం సింహగిరికి భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి తొలి పంటలను కానుకగా సమర్పించారు. వరి దుబ్బులు, బియ్యం, కూరగాయలు, నూనె, పాలు, పెరుగు, వెన్న, పంచదార, పప్పు దినుసులను భక్తిశ్రద్ధలతో స్వామికి అందించారు. కరువు రాకుండా ఏటా తమ పొలాలు పచ్చగా పండాలని స్వామిని వేడుకున్నారు. అలాగే పలువురు గ్రామీణ ప్రాంతాల భక్తులు గరిడి బృందాలతో తరలివచ్చి స్వామికి మొక్కు చెల్లించారు. ఉదయం ఐదు గంటల నుంచి మొదలైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. ఎటుచూసినా సింహగిరి భక్తజనంగా మారింది. దర్శన క్యూలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. గంగధార మార్గం వరకు ఉచిత క్యూ బారులుదీరింది. ప్రసాద విక్రయశాల భక్తులతో కిక్కిరిసింది. కొండదిగువ పాత గోశాల నుంచి అడవివరం మార్గం, సింహగిరిఘాట్ రోడ్డు అంతా తీవ్రమైన ట్రాఫిక్ నెలకుంది. పలుమార్లు పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది.



స్వామి దర్శనానికి క్యూల్లో బారులు తీరిన భక్తులు



గుమ్మడికాయలు స్వామికి సమర్పించేందుకు క్యూలో వేచి ఉన్న భక్తులు

జెడ్పీ చైర్‌పర్సన్ సంక్రాంతి శుభాకాంక్షలు



గుడ్లవల్లేరు: ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజలకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి రెండు కళ్లుగా అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలంతా సుఖ శాంతులు, సిరి సంపదలతో తలతూగాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములై తమ తమ జీవితాల్లో ధన, ధాన్య రాశులను నింపుకుని సుభిక్షంగా ఉండాలని ఆకాక్షించారు.

అమరేశ్వరుడికి 'భోగి' సేవ

అమరావతి: సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాలచాముండికా సమేత అమరేశ్వరుని గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామస్తులు దర్శించుకుని హారతులిచ్చి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమరావతి పురవీధులలో ఈ సందర్భంగా స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖర శర్మ మాట్లాడుతూ ఈ పండుగతో పాడిపంటలతో పాటు ఆధ్యాత్మిక సాంప్రదాయాలను కూడా ఆచరించటం విశేషమన్నారు. ఉత్తరాయణ పుణ్యకాలంలో సర్వేశ్వరుని అనుగ్రహం పొందడానికి అనువైన కాలంగా పురాణాలు చెబుతున్నాయన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక పండుగలు

దీవపంలో సందడి చేసిన సినీ హీరోయిన్ ఆమని



చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న ఆమని

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారతీయుల సంస్కృతి, సంప్రదాయాలకు పండుగలు ప్రతీకలుగా నిలుస్తాయని, వాటిని పరిరక్షించుకోవడం ప్రతి భారత పౌరుని కర్తవ్యమని సినీ హీరోయిన్ ఆమని తెలిపారు. విజయవాడ భవానీ ద్వీపంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ నిర్వహిస్తున్న సంక్రాంతి సందడి కార్యక్రమంలో ఆమె శనివారం పాల్గొన్నారు. పర్యాటకులతో కలిసి సందడి చేశారు. సంప్రదాయ దుస్తుల్లో ద్వీపానికి విచ్చేసిన ఆమెను ఏపీటీఏ డెప్యూటీ సీఈఓ వి.రాముడు, బీఐటీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బలరామిరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, అసిస్టెంట్ డైరెక్టర్ లజ్వంతి నాయుడు స్వాగతం పలికారు. తొలుత ద్వీపంలో ఉన్న అమ్మవారి ప్రతిమకు పూజలు చేశారు. అనంతరం చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. అలాగే ద్వీపం అంతా కలయతిరిగి అక్కడ నెలకొన్న పల్లె వాతావరణాన్ని ఆస్వాదించారు. గంగిరెద్దుల విన్యాసాలను ఆసక్తితో చూడటంతోపాటు హరిదాసుల సంకీర్తనలు, పిట్టల దొర హాస్యోక్తులు, కొమ్మదాసరుల పాటలు, సోదెమ్మ కబుర్లు విని ఆనందాన్ని వ్యక్తం చేశారు.



హరిదాసుల సంకీర్తనలు ఆలకిస్తున్న ఆమని

పల్లె సీమ గుర్తుకొస్తుంది

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి అనగానే పల్లె సీమలు గుర్తుకు వస్తాయని, అటువంటి గ్రామీణ వాతావరణాన్ని ఏర్పాటు చేసి సంక్రాంతి సంబరాలను నిర్వహించిన ఏపీ టూరిజం అధికారులు అభినందనీయులన్నారు. ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ద్వీపంలోని సహజ వనరులను కాపాడుకోవడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించిన వారమవుతామని అన్నారు. భారతీయ సంస్కృతిలో సంక్రాంతి పెద్ద పండుగే కాదని, ఓ విశిష్టమైన పండుగ అన్నారు. ప్రతి పండుగ వెనుక ఒక అర్థం అంతకు మించి పరమార్థం ఉందని చెప్పారు. వాటి గురించి నేటి యువత తెలుసుకుని తీరాలన్నారు. ద్వీపంలోని సంక్రాంతి సందడి వేడుకలకు ఆదివారం సినీ హీరోయిన్ ఇంద్రజ రానున్నట్లు అధికారులు తెలిపారు.

మధురంగా త్యాగరాజ స్వామి కీర్తనలు



త్యాగరాజ స్వామి కృతులను గానం చేస్తున్న వేమూరి విశ్వనాథ్



త్యాగరాజ సంగీత వైభవాన్ని చాటుతున్న హర్షిత

విజయవాడ కల్చరల్: నిధి చాలా సుఖమా... రాముని సన్నిధి సేవా సుఖమా.. అని పాడుకున్న భాగవతోత్తముడు సద్గురు త్యాగరాజ స్వామి. ఆయన 176 వ జయంతి సందర్భంగా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న సంగీత మహోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. శనివారం నాటి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు, కళాకారులు త్యాగరాజ స్వామి రచించిన కీర్తనలను మధురంగా గానం చేశారు. నిధి చాలా సుఖమా, నగుమోము కనలేని, ఉపచారములు చేసే వారున్నారా, నన్నుగన్నతల్లి నాభాగ్యమా, పాహిరామా అనుచు భజన చేయవే ఓ మనసా తదితర కీర్తనలు చోటు చేసుకున్నాయి. వేమూరి విశ్వనాథ్, బి.హర్షిత, ఎస్.సుజాత, ఎన్.దుర్గేశ నందిని, బీకే బిందూ, మల్లాది అరవింద్, ఎ.ఐశ్వర్య, గండూరి శ్రీనివాస మూర్తి బృందం, మల్లాది కార్తీక త్రివేణి, సీవీకే శాస్త్రి, శృతి సంహిత త్యాగరాజ కృతులను ఆలపించారు. జి.సందీప్, భవ్యశ్రీ గీతిక, మల్లాది అరవింద్ వాద్య సహకారం అందించారు.

అద్భుత వ్యక్తి బ్రదర్ జోసఫ్ తంబి



దివ్య పూజాబలిని సమర్పిస్తున్న ఫాదర్ జయరాజు

ఉంగుటూరు: బ్రదర్ జోసఫ్ తంబి మన మధ్యలో పవిత్రమైన జీవితాన్ని జీవించి, మరణించిన అద్భుత వ్యక్తి అని నిడదవోలు ప్రావెన్షియల్ హెచ్‌జీఎన్ ఫాదర్ బత్తుల జయరాజు అన్నారు. ఉంగుటూరు మండలం పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి 78వ వర్ధంతి మహోత్సవాలు రెండవ రోజు శనివారం వైభవంగా నిర్వహించారు. తంబి లాంటి అదర్శ వ్యక్తిని మనకు ఇచ్చిన దేవునకు కృతజ్ఞతలు తెలుపుకోవాలని చెప్పారు. ఆ మహనీయుని స్మరించుకుంటూ మూడు రోజులు తిరునాళ్ల కతోలిక శ్రీసభ జరుపుకుంటోందని పేర్కొన్నారు. అనేక మంది తంబి అను పేరు పెట్టుకొని ఆయనను జీవితాంతం గుర్తు చేసుకుంటూ ఉన్నారని తెలిపారు. మధ్యయుగ కాలంలో లోకాన్ని మేల్కొలిపిన గొప్ప పునీతుడు అస్సీసిపుర ఫ్రాన్సిస్ వారి తృతీయ సభలో చేరి ధన్య జీవితాన్ని జీవించారని కొనియాడారు. ఆయన ధన్యతను గుర్తించిన శ్రీసభ 2007లో దైవ సేవకునిగా గుర్తించారని తెలిపారు. తంబి విశ్వాసం, నమ్మకం, ప్రార్థన ఈ రోజు వరకు సజీవంగా ఉన్నాయని చెప్పారు. సాయంత్రం 5గంటలకు శ్రీకాకుళం పీఠాధిపతులు రాయల విజయ్‌కుమార్ సమిష్టి దివ్య పూజా బలిని సమర్పించారు. మిర్యాలగూడ సెయింట్ మేరీస్ చర్చ్ గాయక బృందం స్తుతి గీతాలను ఆలపించారు. నందికొట్కూర్ ఎమ్మెల్యే ఆర్థర్ తంబి మహోత్సవాలకు విచ్చేశారు. తంబి సమధి వద్ద ప్రార్థించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. మేరిమాత కపూచిన్ ప్రావెన్షియల్ కరుణాకర్ కాసు, తంబి పుణ్యక్షేత్ర రెక్టర్ సుధాకర్ లారెన్స్, పలువురు ఫాదర్లు, సిస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.



తంబి సమాధి వద్ద ప్రార్థన చేస్తున్న నందికొట్కూర్ ఎమ్మెల్యే ఆర్థర్

కమనీయం.. గోదా రంగనాథుల కల్యాణం

వైష్ణవాలయాల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

కోదూరు: ధనుర్మాసం ముగింపును పురస్కరించుకొని వైష్ణవాలయాల్లో గోదా రంగనాథుల కల్యాణాన్ని శనివారం కమనీయంగా నిర్వహించారు. అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెంలో గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయంలో ఉదయం గోదాదేవి అమ్మవారికి తిరుమంజనసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పత్యేక పల్లకిలో స్వామివార్లను కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ పర్యవేక్షణలో వేదపండితుల నడుమ గోదా రంగనాథుల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. బెంగళూరు, హైదరాబాద్, విజయవాడ, తమిళనాడుకు చెందిన దంపతులు కల్యాణానికి ఉభయదాతలుగా వ్యవహరించారు. కల్యాణమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. కోడూరులోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో గోదా కల్యాణాన్ని నిర్వహించారు. ప్రధానార్చకులు దుంభాల శ్రీధరాచార్యుల పర్యవేక్షణలో కల్యాణతంతు జరగ్గా, ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. బడేవారిపాలెంలోని రామాలయంలో జరిగిన గోదా కల్యాణానికి బడే ప్రభాకర్ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. లింగారెడ్డిపాలెం శ్రీరామమందిరంలో చిన్నారులు గోదాదేవి వేషధారణతో ఆకట్టుకున్నారు. ఇస్మాయిల్‌బేగ్‌పేట, కోదూరు తూర్పువైపు గ్రామస్తులు ప్రత్యేక వాహనంపై గోదాదేవి అమ్మవారిని పురవీధుల వెంట ఊరేగించారు.



గోదా రంగనాథుల కల్యాణ మూర్తులు



ఉల్లిపాలెం శ్రీమన్నారాయణుడి ఆలయంలో జరిగిన కల్యాణంలో ఉభయదాతలు

హోరాహోరీగా క్రికెట్ టోర్నమెంట్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని వెలంపల్లి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహభరిత వాతావరణంలో హోరాహోరీగా సాగుతోంది. విద్యాధరపురం 39వ డివిజన్ పరిధిలోని షాదీఖానా మైదానంలో నిర్వహిస్తోన్న ఈ టోర్నీలో నగరానికి చెందిన మొత్తం 32 జట్లు పాల్గొన్నాయి. వీటిలో 4 జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. ఆదివారం సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయని టోర్నీ నిర్వాహకులు, వైఎస్సార్ సీపీ నాయకులు డీవీరెడ్డి, కెప్టెన్ ప్రభాకర్, శ్రీకాంత్ తెలిపారు. టోర్నీ విజేతలకు రూ. 20 వేలు ప్రథమ, రూ.15 వేలు ద్వితీయ బహుమతిగా అందజేస్తామన్నారు. దీనికి తోడు మ్యాన్ ఆఫ్ ద సిరీస్ రూ. 5 వేలు నగదు బహుమతి ఇస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి హాజరవుతారన్నారు. మైదానంలో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ని టాస్ వేసి ప్రారంభించిన కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సంక్రాంతి సందర్భంగా మహానేత వైఎస్సార్ పేరిట టోర్నీ నిర్వహించినట్లు చెప్పారు.



• సంక్రాంతి

శుభాలకు వాకిలి

మన మహర్షులు ఏర్పరచిన పండుగలలో మనకు అత్యంత ప్రధానమైనది 'సంక్రాంతి.' మకర సంక్రాంతి పుష్యమాసంలో వస్తుంది. పుష్ – అంటే పోషించటం, పుష్టిని కలిగించటం. సర్వప్రాణికోటికీ పుష్టిని కలిగించే పంటలు ఇంటికి వచ్చే పండుగ సంక్రాంతి పండుగ. మన దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలే కాక ఒకప్పుడు మన భారతదేశంలోని భాగాలే అయిన శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్, మలేషియా వంటి ప్రాంతాల్లో కూడా మకర సంక్రాంతిని జరుపుకుంటున్నారు.

'సం' అంటే 'సమ్యక్' – మంచి, చక్కని. 'క్రాంతి' అంటే మార్పు. సమ్యక్ క్రాంతి – సంక్రాంతి. 'సంక్రాంతి' లేదా 'సంక్రమణం' అంటే – 'చేరటం' అని అర్థం. మేషం మొదలైన పన్నెండు రాశులలో సంచరించే సూర్య భగవానుడు ముందున్న రాశి నుండి తరువాత రాశి లోనికి ప్రవేశించటమే సంక్రాంతి.

ప్రతి నెలలో సూర్యుడు రాశులు మారుతుంటాడు. అలా మేష సంక్రాంతి, వృషభ సంక్రాంతి, మిథున సంక్రాంతి మొదలైన పన్నెండు సంక్రాంతులు ఏర్పడతాయి. వాటిలో సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే పుణ్యకాలాన్ని'మకర సంక్రాంతి పండుగ' గా జరుపుకుంటున్నాం.

సూర్యుడు ఈ మకర రాశిలో ప్రవేశించటాన్నే ఎందుకు పెద్ద పండుగగా జరుపుకుంటున్నాం అంటే, వెలుగు ఎక్కువగా ఉండే దీర్ఘమైన పగళ్ళకూ, ఆరోగ్యాన్ని వృద్ధిపరిచే సుందరమైన, ఆహ్లాదకరమైన కాలానికి నాంది కాగల ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుంది కనుక. ప్రకృతి లో ఇది గొప్ప మార్పు. మన ఉత్తరాయణం ఆరు నెలలు దేవతలకు పగటి కాలం. అందువల్ల కూడా ఉత్తరాయణం అత్యంత పవిత్రమైన కాలం.

ఉత్తరాయణంలోనే మనం ఉపనయనాలు, వివాహాది శుభకార్యాలను జరిపిస్తాం. కనుకే ఉత్తరాయణం ప్రారంభంలో వచ్చే మకర సంక్రమణాన్ని'సంక్రాంతి పండుగ'గా జరుపుకుంటున్నాం. వెలుగుకు, జ్ఞానానికి సూచకమైన 'మకర సంక్రాంతి' మనకు పెద్ద పండుగ.

సాధారణంగా మనం పండుగలకు చాంద్రమానాన్ని పాటిస్తాం. కనుక తిథులను బట్టి ఆయా పండుగలను జరుపుకుంటాం. కానీ సంక్రాంతి పండుగ మాత్రం సౌరమానం ప్రకారం జరుపుకుంటాం. కనుకే ప్రతి సంవత్సరం జనవరి 13, 14, 15, 16 తేదీలలోనే ఈ పండుగ మూడు రోజులు ఉంటాయి. తెలుగువారి ముఖ్య పండుగలలో ఒకటి సంక్రాంతి పండుగ. ఈ పండుగను భోగి, సంక్రాంతి, కనుమ అని మూడు రోజుల పండుగగా జరుపుకుంటాం. మన సనాతన సంప్రదాయాలను, ఆచారవ్యవహారాలను, సామాజిక స్నేహను, నైతిక విలువలను తెలియజేస్తూ, ఆరోగ్యాన్ని కలిగించే, ఆయుష్షను వృద్ధిపరిచే ఎన్నో అంశాలతో కూడి ఉంటుంది ఈ పండుగ. ప్రకృతి, జీవుడు, దేవుడు, పశుపక్ష్యాదుల సమైక్యతను నిరూపిస్తూ, ఆధ్యాత్మికతను కలిగిన గొప్ప పండుగ సంక్రాంతి పండుగ.

మనది వ్యవసాయ ప్రధానమైన దేశం. ఏడాది పాటు కష్టపడి పని చేసిన ఫలితంగా ధాన్యపు రాశులు ఇంటికి వచ్చిన ఆనందంతో సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకుంటారు. కొత్తధాన్యంతో పులగం, పొంగలి, పాయసం చేసి, శ్రీ సూర్యనారాయణ స్వామికి, ఇష్టదైవానికి, కుల దైవానికి నివేదన చేస్తారు.

ప్రతి సంక్రమణంలోనూ పితృతర్పణాలివ్వాలి, శ్రీ సూర్యనారాయణ స్వామికి అర్ఘ్యమివ్వాలి. అయితే అప్పుడు ఇవ్వలేకపోయినా, కనీసం ఉత్తరాయణ పుణ్యకాలమైన సంక్రాంతి పండుగ రోజున అయినా సూర్యుని తప్పక ధ్యానించాలి, పూజించాలి, అర్ఘ్యమివ్వాలి. పితృతర్పణాలివ్వాలి, పితృదేవతలను స్తోత్రించాలి. ధాన్యం, ఫలాలు, విసనకర్ర, వస్త్రం, కాయగూరలు, దుంపలు, నువ్వులు, చెరకు గడలు, ఉదకుంభం మొదలైనవి దానమివ్వాలి. వీలున్న వారు గోదానం చెయ్యటం శ్రేష్ఠం.

మనం మనకు తొలి పండుగ అయిన ఉగాదినాడు ఎలా పంచాంగ శ్రవణం చేస్తామో, అలాగే సంక్రాంతి పండుగనాడు దైవజ్ఞుల ద్వారా సంక్రాంతి పురుషుని గురించి తెలుసుకోవాలి. ఈ ఏడాది సంక్రాంతి పురుషుడు ఎటువంటి ఆకార విశేషాలను కలిగి, ఏ రంగు దుస్తులు ధరించి, ఏ వాహనం మీద ఎక్కి వస్తాడో, దానినిబట్టి దేశ భవిష్యత్తు తెలుస్తుంది, దానివల్ల రాబోయే ఫలితాలను గుర్తించి తగిన విధంగా మెలగటానికి ప్రయత్నం చెయ్యాలి.

సంక్రాంతి రోజే జప తప దానాదుల నాచరించాలి. పండితులకు ధాన్యం, గోధుమలు, తిలలు, వస్త్రాలు, బంగారం, ధనం, కూరలు, పళ్ళు, ఉదకుంభం వంటి వాటిని దానమివ్వాలి. దానివలన ఆరోగ్యం, వర్చస్సు, ఆత్మ సంస్కారం, గ్రహదోష నివారణ జరుగుతాయి. పితృతర్పణాల వలన వంశాభివృద్ధి జరుగుతుంది.

సంక్రాంతి రోజున గంగిరెద్దులను అందంగా అలంకరించి, ఇంటింటికీ గంగిరెద్దు మేళం తెస్తారు. అందరూ గంగిరెద్దుకు నూతన వస్త్రాలు కప్పుతారు. సన్నాయి వాద్యకారులకు ధన, ధాన్య, వస్త్రాదులనిస్తారు.

సంక్రాంతి రోజున ఉదయమే శ్రీ మహావిష్ణు స్వరూపునిగా భావించబడే హరిదాసు తలపైన రాగి అక్షయ పాత్రను పెట్టుకుని, రెండు చేతులతో చిరతలు వాయిస్తూ, 'హరిలో రంగ హరీ' అంటూ గానం చేస్తూ వస్తాడు. హరి నామం గానం చేస్తూ సాతాని జియ్యరు కూడా వస్తాడు. ప్రజలు సాక్షాత్తు శ్రీహరే తమ ఇంటి ముంగిటికి వచ్చినంతగా ఆనందిస్తూ ఆ రాగి చెంబులో ధాన్యం పోస్తారు. డబ్బులిచ్చి సత్కరిస్తారు.

'అంబ పలుకు జగదంబ పలుకు, కంచి కామాక్షి పలుకు, కాశీ విశాలాక్షి పలుకు' అంటూ చేతిలో డమరుకం పట్టుకుని వాయిస్తూ, జోస్యం చెప్పటానికి బుడబుక్కలవాడు వస్తాడు.

ఈశ్వరుని వలె విభూతి రేఖలు నుదుటి మీద ధరించి, చేతిలో శంఖం పట్టుకుని ఓంకార నాదం చేస్తూ 'హర హర మహాదేవ' అంటూ శివ నామ సంకీర్తన చేస్తూ జంగమదేవర వస్తాడు.

వీరందరూ మన సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతీకలు. వీరందరినీ గౌరవిస్తూ, స్వయంపాకాలనిస్తూ, డబ్బులిస్తూ మన సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవలసిన బాధ్యత మనందరిదీ. వీరందరూ మనందరినీ ఆయురారోగ్యాలతో, భోగభాగ్యాలతో విలసిల్లమని ఆశీర్వదిస్తారు.

సంక్రాంతికి ఆంధ్రులు తమ ఇళ్ళల్లో బొమ్మల కొలువును ఏర్పాటు చేసి, బొమ్మలకు ప్రతీకగా పరమాత్మను ప్రార్థిస్తారు.బొమ్మలకు హారతిస్తారు, పేరంటం చేస్తారు. పిల్లలకు పప్పు బెల్లాలు, నువ్వుండలు పంచిపెడతారు. కొత్తగా పెళ్ళైన కూతుళ్ళను, అల్లుళ్ళను ఇంటికి పిలుస్తారు, విందు భోజనాలు, చీరసారె, అల్లుళ్లకు కానుకలూ ఇచ్చి ఆనందిస్తారు. తెలంగాణ ప్రాంతంలో సంక్రాంతి రోజున నోము పడతారు. ముత్తైదువులను ఇంటికి పిలిచి సంక్రాంతి నోము పేరంటం చేస్తారు.

కనుమనాడు మనకు పాడి పంటలనిచ్చే గోవులను, ఎద్దులను, పుడమి తల్లినీ పూజిస్తారు. 'కనుమనాడు మినుము తింటే ఎనుమంత బలం వస్తుంది' అంటారు కనుక కనుమనాడు గారెలు, ఆవడలు చేసి దైవానికి నివేదించి భుజిస్తాం. పంటలు, సమృద్ధికి దోహదపడే, వ్యవసాయానికి సహకరించే ఎద్దులను గౌరవించే శుభ దినం కనుమ పండుగ.

ఈ విధంగా పుడమికీ, ప్రకృతికీ, మానవులకూ, గోవృషభాలకూ ఉన్న సంబంధాన్ని చాటి చెప్పే గొప్ప పండుగ మకర సంక్రాంతి పండుగ. ఆధ్యాత్మికంగా, సాంస్కృతికంగా, సామాజిక పరంగా భారత దేశ ప్రజలందరూ జరుపుకునే పెద్ద పండుగ 'మన సంక్రాంతి పండుగ'.

– డా. తంగిరాల విశాలాక్షి,
– సోమంచి రాధాకృష్ణ

సంక్రాంతి పండుగ సందర్భంగా పిల్లలు, యువకులు అత్యంత ఉత్సాహంగా గాలిపటాలను ఎగురవేస్తారు. రంగురంగుల గాలిపటాలతో ఆకాశం పగలే అందమైన కదిలే చుక్కలతో ప్రకాశిస్తున్న భ్రాంతిని కలుగజేస్తుంది. గాలిపటం మనకు గొప్ప ఆధ్యాత్మిక సందేశాన్నిస్తుంది. దారం మన చేతిలో సవ్యంగా ఉన్నంతసేపే గాలిపటం ఆకాశంలో ఎగురుతుంది. అదుపు తప్పిందా, ఎగిరిపోతుంది. అదేవిధంగా మనం నైతిక విలువలు అనే పట్టులో మెలుగుతున్నంత కాలం సమాజాకాశంలో ఆనందంగా విహరించ గలుగుతాం. విలువలు తప్పితే పతనం తప్పదు. అన్న సత్యాన్ని బోధిస్తుంది.

సంక్రాంతి సంప్రదాయం

పదపదవె ఒయ్యారి గాలిపటమా...

సంప్రదాయాలను చెడగొట్టేవాళ్లు ఎప్పుడూ ఉంటారు. చైనా మాంజాలూ అనవసర పోటీలతో గాలిపటాలకు అడ్డంకులేర్పరుస్తుంటారు. నిజానికి గాలిపటం ఎగురవేయడం చలికాలంలో మంచి వ్యాయామం. సంక్రాంతి వేళ ఖాళీ పొలాల్లో పతంగాలు ఎగురేస్తే వినోదమూ ప్లస్ డి విటమిన్. గాలిపటం చుట్టూ ఎన్నో జీవనసత్యాలు. అది ఆకాశాన్ని అందుకోమని అంటుంది. కాని సూత్రం సరిగా లేకపోయినా దారం చేజారినా తనలాగే జీవితమూ గిరికీలు కొడుతుందని హెచ్చరిస్తుంది. దేశంలో కైట్ ఫెస్టివల్స్ జరిగే సమయం ఇది. పిల్లలకు గాలిపటాలు చాలా ఇష్టం. సంక్రాంతి గాలిపటం ఒక పసిడి జ్ఞాపకం.



ఇప్పుడు ప్లాస్టిక్ షీట్‌తో గాలిపటాలు తయారు చేస్తున్నారుగాని ఒకప్పుడు గాలిపటం అంటే రంగు కాగితమే. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, నీలం, వంకాయ రంగు.... డార్క్ కలర్ కాగితాలతో తయారయ్యి, తోకలు తగిలించుకుని దుకాణాల్లో అమ్మకానికి పెట్టి ఉంటే వాటి అందమే వేరు. పిల్లలకు తమ ఇష్టానికి తగిన రంగు గాలిపటం దొరికేది. 'నీది ఎరుపు... నాది పచ్చ' అని తగాదాలు లేకుండా గుర్తుగా ఇళ్లల్లో దాచుకునేవారు. మైదానంలో, మిద్దెక్కి ఎగరేసేవారు. గాలిపటం సంపాదించడానికి అమ్మ, నాన్నల దగ్గర మారాము చేసేవారు. గాలిపటం, పతంగి, కైట్... పేరు ఏదైనా ఎగిరే కాగితం పిట్ట అది.

బాల్య కుతూహలం

గాలిపటం ఒక బాల్య కుతూహలం. తాను ఎగరలేకపోయినా తాను ఎగిరించగలడు అనే ఇగో సంతృప్తికి సంకేతం. పక్షిలా ఎగరలేని మనిషి పక్షితో సమాంతరంగా ఆకాశంలో గాలిపటం ఎగురవేసి అబ్బురపడ్డాడు. అలా ఎగరడానికి అవసరమైన సూత్రాన్ని కనుగొన్నాడు. కాలాన్ని కూడా గమనించాడు. మితిమీరిన ఎండల కాలం, వానల కాలం గాలిపటం ఎగురవేయడానికి అనువైనది కాదు. ఒకప్పుడు దీపావళి ముగిశాక... అప్పటి నుంచి మొదలయ్యి ఫిబ్రవరి వరకు గాలిపటాలు ఎగుర వేసేవారు. ఇప్పుడు మెల్లగా అది సంక్రాంతి సీజన్‌గా మారింది. దానికి కారణం పొలాలు కోత పూర్తయ్యి ఖాళీగా ఉంటాయి. పల్లెల్లో జనం విశ్రాంతిలో ఉంటారు. సీజన్ అనుకూలంగా ఉంటుంది. సంక్రాంతితో ఎండ మొదలవుతూ ఉష్ణం ఒంటికి తగులుతూ ఉంటుంది. అందుకని ఇది గాలిపటాల సీజన్‌గా మారింది. ఒక్క తెలుగుప్రాంతంలోనే కాదు... తమిళనాడు, రాజస్థాన్, గుజరాత్‌లలో కూడా సంక్రాంతి సమయంలో గాలిపటాలు ఎగురవేస్తారు. హైదరాబాద్‌లో ఈ క్రీడ విఖ్యాతం. గుజరాత్‌లో 'ఉత్తరాయణ్' పేరుతో ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్ నిర్వహిస్తారు.

ప్రతాప చిహ్నం

ఆధిక్య ప్రదర్శన చేయడం కూడా మనిషికి ఇష్టం. గాలిపటాలు ఎగురవేసి ఏది ఎక్కువ ఎత్తుకు ఎగిరితే ఆ ఎగరేసిన మనిషికి ఆ కాసేపు ఆధిక్యం వస్తుంది. 'కోయడం' కూడా ఈ ఆటలో ఒక ఆధిక్యప్రదర్శనే. ఎగురుతున్న గాలిపటాల మీదకు వెళ్లి తమ గాలిపటంతో (దారంతో/ మాంజాతో) కోసి దానిని నేలకూల్చడం గొప్ప. రాను రాను ఇలా కోతకు గురికాని దారం కోసం అంటే ప్రత్యర్థులు దాడి చేసినా తెగని దారం కోసం రకరకాల ప్రయోగాలు, పదార్థాలు కలిపిన దారం తయారు చేసి నేడు పక్షులకు, మనుషులకు ప్రమాదకరంగా మారి గాలిపటాల ఆటకే చేటుకాలాన్ని తెచ్చారు కొందరు. ఈ ఆధిక్య ప్రదర్శను పక్కన పెడితే గాలిపటం ఎగురవేయడం ఎంతో ఆహ్లాదం కలిగించే ఆట.

గాలిపటం పాటలు

గాలిపటం పాటలు సినిమాల్లో చాలా ఉన్నాయి. 'తోడికోడళ్లు'లో 'గాలిపటం గాలిపటం రయ్యిన ఎగిరే గాలిపటం' అని అక్కినేని పాడతాడు. 'కులదైవం' సినిమాలో హీరో చలం 'పద పదవే ఒయ్యారి గాలి పటమా' పాడితే నేటికీ అది హిట్ పాటగా ఉంది. 'చంద్రముఖి'లో 'చిలుకా పద పద మైనా పద పద' అని రజనీకాంత్ కూడా గాలిపటాలు ఎగురవేస్తాడు. గాలిపటంలో తత్త్వం కూడా మనిషి వెతికాడు. అదను మరిస్తే జీవితం తెగిన గాలిపటం అవుతుందని గ్రహించాడు. ఎంత ఎత్తుకు ఎగిరినా దారం లాంటి ఆధారం తప్పక ఉండాలని గ్రహించాడు. గాలిపటంలా మిడిసి పడకూడదని, చివరకు దానిలాగే నేలకు దిగాల్సి వస్తుందని బుద్ధి చెప్పుకున్నాడు.

అపశ్రుతులు లేకుండా

గాలిపటం మన దృష్టిని పైన ఉంచుతుంది. ముందు వెనుకా చూడ వీలు కల్పించదు. అందుకే పిల్లల చేత మైదానాల్లోనే గాలిపటాలు ఎగురవేయించాలి. లేదా రెయిలింగ్ ఉన్న మిద్దెల మీదే ఎగురవేయించాలి. గోడలు ఎక్కనివ్వరాదు. తెగిన గాలిపటాల కోసం కరెంటు స్తంభాల దగ్గరకు వెళ్లనివ్వరాదు. దారం వదిలేప్పుడు వేలు తెగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ●

మేకప్



ట్రెడిషనల్ లుక్

పండగ రోజున సంప్రదాయ దుస్తులతో ప్రత్యేకంగా కనిపిస్తూ సందడి చేస్తారు. అదేవిధంగా మేకప్ కూడా ప్రత్యేకంగా ఉంటే లుక్ మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది. రోజంతా మేకప్‌తో ఫ్రెష్ లుక్‌లో కనిపించాలంటే ఎంపిక చేసుకునే సాధనాలలోనూ జాగ్రత్త వహించాలి.

■ బ్లష్

సంప్రదాయ దుస్తులు ధరించినప్పుడు ఎక్కువ మేకప్ వేసుకోవడం కాస్త కష్టమే. అయితే, ట్రెడిషనల్‌గా నేచురల్ లుక్ కావాలంటే బ్లష్ అప్లై చేసుకోవచ్చు. ఫెయిర్‌గా ఉన్నవారు బ్లష్‌తో వారి ముఖారవిందాన్ని మరింతగా మెరిపించుకోవచ్చు. బ్లష్ అప్లై చేసిన తర్వాత రెగ్యులర్ ఫౌండేషన్‌తో టచ్ అప్ చేయాలి.

■ హైలైటర్

ధరించిన దుస్తులు ప్రకాశవంతమైన రంగులో ఉంటే, దానితో ప్రత్యేకంగా కనిపించడానికి లైట్ మేకప్ ఉత్తమంగా ఉంటుంది. ఇది న్యూడ్ ఐషాడో, లిప్‌స్టిక్‌తో పాటు చాలా తేలికపాటి బేస్ ఉంటుంది. దీనికోసం లైట్ హైలైటర్‌ని ఉపయోగించవచ్చు.

■ మెరిసే కనుబొమ్మ

గ్లిట్టర్ ఐషాడో ఎంపిక పండుగ రోజున ఉత్తమ ఎంపిక. సంప్రదాయ రూపాన్ని అధునాతనంగా మార్చడానికి దీన్ని ప్రయత్నించవచ్చు. జరీ అంచు దుస్తులు ధరిస్తారు కాబట్టి బంగారు లేదా వెండి షిమ్మర్ ఐషాడో వేసుకుంటే ముఖ కాంతి మరింతగా పెరుగుతుంది.


■ మాట్ లుక్

చాలా మంది సినీ తారలు మాట్ లుక్ మేకప్‌ని అనుసరిస్తారు. దీంతో చీర లేదా మరేదైనా సంప్రదాయ వేషధారణలో వారు మరింత అందంగా కనిపిస్తారు. మ్యాట్ లుక్ చర్మాన్ని ప్రకాశవంతంగా, సహజంగా కనిపించేలా చేస్తుంది. అయితే ఈ మేకప్ వేసుకునే ముందు చర్మ తత్వం గురించి తెలుసుకోవాలి.

■ డార్క్ లిప్ స్టిక్

డార్క్ లిప్‌స్టిక్ మీ మేకప్‌ను మరింత అందంగా మారుస్తుంది. పండగరోజుల్లో సాధారణంగా బ్రైట్‌గా ఉండే దుస్తులను ధరిస్తారు కాబట్టి అప్పుడు ముదురు రంగు లిప్‌స్టిక్ ఎంపిక ధరించిన దుస్తులకు తగిన విధంగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్లో మాట్ లిప్‌స్టిక్ షేడ్స్ కూడా బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయి.

ముగ్గు ముచ్చట



19 చుక్కలు
3 వరసలు
3 వచ్చేవరకు



బి.శశికళ,
బాలాజీనగర్,
నెల్లూరు



23 చుక్కలు
3 వరుసలు
నరిచుక్క
3 వచ్చేవరకు



బి.నాగలక్ష్మి,
జిడిసి, వనపర్తి

స్పోర్ట్స్



నేడు ఇంగ్లండ్‌తో భారత్ పోరు

సొంతగడ్డపై జరుగుతున్న పురుషుల ప్రపంచకప్ హాకీ టోర్నీలో పూల్ 'డి'లో భాగంగా నేడు ఇంగ్లండ్‌తో భారత్ తలపడుతుంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని టీమిండియా తొలి మ్యాచ్‌లో స్పెయిన్‌పై 2-0తో విజయం సాధించిన సంగతి తెలిసిందే. మరోవైపు ఇంగ్లండ్ తమ తొలి మ్యాచ్‌లో 5-0తో వేల్స్‌ను ఓడించింది. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో భారత్‌కు గట్టిపోటీ ఎదురయ్యే అవకాశముంది. రాత్రి 7 గంటలకు మొదలయ్యే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

వన్డే ప్రపంచకప్ టోర్నీకీ పంత్ దూరం!



కారు ప్రమాదానికి గురైన భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ సాధారణ స్థితికి రావడానికే కనీసం ఆరు నెలల సమయం పడుతుందని వైద్యులు తెలిపారు. ఆ తర్వాతే ఫిట్‌నెస్, ఆట గురించి ఆలోచించగలిగేది! ఈ నేపథ్యంలో పంత్ స్వదేశంలో అక్టోబర్-నవంబర్‌లలో జరిగే వన్డే ప్రపంచకప్ టోర్నీతోపాటు 2023 మొత్తం సీజన్‌కు దూరమయ్యే చాన్స్ ఉంది. పంత్ కుడి మోకాలిలో మూడు లిగ్మెంట్‌లు బాగా దెబ్బ తినగా...రెండింటిని శస్త్ర చికిత్సతో చక్కదిద్దారు.

మెరిసిన శ్వేత, షఫాలీ వర్మ


శ్వేత


షఫాలీ

- అండర్-19 ప్రపంచకప్ టి20 టోర్నీలో భారత్ శుభారంభం
- తొలి మ్యాచ్‌లో 7 వికెట్లతో దక్షిణాఫ్రికాపై ఘన విజయం

బెనోని: తొలి అండర్-19 టి20 ప్రపంచకప్‌ను భారత మహిళల జట్టు ఘన విజయంతో మొదలు పెట్టింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ ఏడు వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా అండర్-19 మహిళల టీమ్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేయగా... భారత్ 16.3 ఓవర్లలో 3 వికెట్లకు 170 పరుగులు చేసింది. షబ్నమ్ వేసిన తొలి ఓవర్లోనే 3 ఫోర్లు, 1 సిక్స్ కొట్టి వాన్ రెన్స్‌బర్గ్ (23) సఫారీ జట్టుకు శుభారంభం అందించగా, సోనమ్ వేసిన తర్వాతి రెండు ఓవర్లలో కలిపి సిమోన్ లోరెన్స్ (44 బంతుల్లో 61; 9 ఫోర్లు, 1 సిక్స్) 4 ఫోర్లు, సిక్స్ బాదింది. అయితే ఆ తర్వాత ప్రత్యర్థిని భారత బౌలర్లు కట్టడి చేయడంలో సఫలం కాగా, మ్యాడిసన్ ల్యాండ్స్‌మన్ (17 బంతుల్లో 32; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించింది. ఛేదనలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శ్వేత సెహ్రావత్ (57 బంతుల్లో 92 నాటౌట్; 20 ఫోర్లు), కెప్టెన్ షఫాలీ వర్మ (16 బంతుల్లో 45; 9 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగిపోయారు. నిని వేసిన ఓవర్లో షఫాలీ వరుసగా 4, 4, 4, 4, 4, 6తో ఆధిపత్యం ప్రదర్శించింది. మరోవైపు శ్వేత తన దూకుడును తగ్గించకుండా దూసుకుపోయింది. గొంగడి త్రిష (15) తొందరగానే వెనుదిరిగినా... శ్వేత చివరి వరకు నిలబడటంతో భారత్‌కు గెలుపు సులువైంది. ఓపెనర్ శ్వేత 7 ఓవర్లలో కనీసం రెండు ఫోర్ల చొప్పున కొట్టడం విశేషం. ఇతర మ్యాచ్‌ల్లో బంగ్లాదేశ్ ఏడు వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై, యూఏఈ ఆరు వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌పై, శ్రీలంక ఏడు వికెట్ల తేడాతో అమెరికాపై గెలిచాయి.

క్లీన్‌స్వీప్ లక్ష్యంగా...

- మూడో వన్డే బరిలో భారత్
- నేడు శ్రీలంకతో చివరి పోరు
- మధ్యాహ్నం గం.1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం



తిరువనంతపురం: భారత్, శ్రీలంక మధ్య టి20 సిరీస్‌లోనైనా ఫలితం చివరి మ్యాచ్ వరకు ఆగాల్సి వచ్చింది. ఇప్పుడు వన్డే సిరీస్‌లో మాత్రం రెండో మ్యాచ్‌కే ఫలితం తేలిపోయింది. టీమిండియా 2-0తో సిరీస్ గెలుచుకోగా, చివరి పోరుకు ప్రాధాన్యత తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో నేడు జరిగే మూడో వన్డేలో భారత్, శ్రీలంక తలపడనున్నాయి. మరో విజయంతో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని భారత్ భావిస్తుండగా, టి20ల తరహాలో కనీసం ఒక విజయంతోనైనా ముగించి పరువు నిలబెట్టుకోవాలని లంక కోరుకుంటోంది.

మార్పు ఉంటుందా...

'అవసరమైతే తర్వాతి మ్యాచ్‌లో మార్పులు చేస్తాం'... రెండో వన్డే ముగిసిన తర్వాత భారత కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన వ్యాఖ్య ఇది. సిరీస్ ఇప్పటికే చేతికందడంతో స్వల్ప మార్పులతో రిజర్వ్ ఆటగాళ్లను పరీక్షించాలనేది ఆలోచన. గత రెండు మ్యాచ్‌లలోనూ అవకాశం దక్కకుండా అర్ష్‌దీప్, ఇషాన్ కిషన్, వాషింగ్టన్ సుందర్ బెంచీపై వేచి చూస్తున్నారు. వీరిలో ఎవరిని ఆడిస్తారనేది చూడాలి. ముగ్గురికీ అవకాశం ఇవ్వాలనుకుంటే ఉమ్రాన్, రాహుల్, అక్షర్‌లను పక్కన పెట్టవచ్చు. మరోవైపు భుజం నొప్పితో గత మ్యాచ్‌కు దూరమైన చహల్ పూర్తిగా కోలుకున్నాడు. అతడిని ఆడిస్తారా లేక రెండో వన్డే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కుల్దీప్ యాదవ్‌ను కొనసాగిస్తారా అనేది ఆసక్తికరం. ఇతరత్రా భారత జట్టుకు ఎలాంటి సమస్యలు లేవు. అటు బ్యాటర్లు, ఇటు బౌలర్లంతా ఫామ్‌లో ఉన్నారు. కాబట్టి ప్రధాన బృందంలో మార్పులు చేయాల్సిన అవసరం లేదు. వీరంతా తమ స్థాయికి తగినట్లు ఆడితే నిలువరించడం లంకకు చాలా కష్టమవుతుంది.

నిసాంక పునరాగమనం...

గత మ్యాచ్‌లో భారత బ్యాటింగ్‌ను కాస్త ఇబ్బంది పెట్టి మ్యాచ్‌ను హోరాహోరీగా మార్చగలిగినా... శ్రీలంక అసలు సమస్య బ్యాటింగ్‌లోనే ఉంది. ఆశించిన స్థాయిలో కీలక ఆటగాళ్ల ప్రదర్శన ఇవ్వకపోవడంతో పేలవ స్కోరుకే పరిమితమైన జట్టు ఏమీ చేయలేకపోయింది. అందరికంటే సీనియర్ కుశాల్ మెండిస్ మరింత బాధ్యతాయుతంగా ఆడి భారీ స్కోరు చేయాల్సి ఉంది. గాయంతో రెండో వన్డేకు దూరమైన నిసాంక తిరిగి జట్టులోకి వస్తున్నాడు. అతని స్థానంలో ఆడిన నువనిదు ఫెర్నాండో అరంగేట్ర మ్యాచ్‌లోనే అర్ధసెంచరీ సాధించడంతో పక్కన పెట్టలేని పరిస్థితి. దాంతో అసలంకను తప్పించవచ్చు. బౌలింగ్‌లో అంతంత మాత్రంగానే ఉన్న లంక భారత బ్యాటింగ్‌ను ఎంత వరకు నిలువరించగలదో చూడాలి.

సాకేత్ జోడీకి టైటిల్


విన్నర్స్ ట్రోఫీలతో యూకీ బాంబ్రీ, సాకేత్ మైనేని

నొంతాబురి (థాయ్‌లాండ్): గత ఏడాది ఏకంగా ఆరు ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్స్ సాధించి అదరగొట్టిన సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ కొత్త ఏడాదిలో ఆడిన రెండో టోర్నీలోనే టైటిల్ సొంతం చేసుకుంది. శనివారం ముగిసిన బ్యాంకాక్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ ఢిల్లీకి చెందిన తన సహచరుడు యూకీ బాంబ్రీతో కలిసి విజేతగా నిలిచాడు. గంటా 50 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన ఫైనల్లో టాప్ సీడ్ సాకేత్-యూకీ జోడీ 2-6, 7-6 (9/7), 14-12తో 'సూపర్ టైబ్రేక్'లో క్రిస్టోఫర్ రుంగ్‌కాట్ (ఇండోనేసియా)-అకీరా సాంటిలాన్ (ఆస్ట్రేలియా) ద్వయంపై గెలిచింది. చాంపియన్స్‌గా నిలిచిన సాకేత్-యూకీ జోడీకి 4,645 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 3 లక్షల 77 వేలు)తోపాటు 75 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. తాజా టైటిల్‌తో ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో సాకేత్ తొమ్మిది స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ 74వ ర్యాంక్‌కు, యూకీ ఐదు స్థానాలు పురోగతి సాధించి 90వ ర్యాంక్‌కు చేరుకుంటారు. తదుపరి సాకేత్-యూకీ జోడీ సోమవారం మొదలయ్యే ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో బరిలోకి దిగనుంది.

జ్యోతి సురేఖ ప్రపంచ రికార్డు



సాక్షి, హైదరాబాద్: భారత ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఓపెన్ సెలెక్షన్ ట్రయల్స్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ ప్రపంచ రికార్డు నెలకొల్పింది. కోల్‌కతాలో రెండు రోజులపాటు జరిగిన మహిళల కాంపౌండ్ వ్యక్తిగత ట్రయల్స్‌లో విజయవాడకు చెందిన 26 ఏళ్ల జ్యోతి సురేఖ డబుల్ 50 మీటర్ల రౌండ్‌లో 1440 పాయింట్లకుగాను 1418 పాయింట్లు సాధించింది. తొలి రోజు 72 బాణాలు, రెండో రోజు మరో 72 బాణాలు ఉపయోగించారు. ఈ క్రమంలో గత ఏడాది ఆగస్టులో బ్రిటన్ ఆర్చర్ ఎల్లా గిబ్సన్ 1417 పాయింట్లతో నెలకొల్పిన ప్రపంచ రికార్డును జ్యోతి సురేఖ బద్దలు కొట్టింది. 24 మంది ఆర్చర్లు పాల్గొన్న సెలెక్షన్ ట్రయల్స్‌లో జ్యోతి సురేఖ టాప్ ర్యాంక్‌లో నిలిచింది. ఈ ట్రయల్స్ ద్వారా ఈ ఏడాది ప్రపంచకప్ టోర్నీలలో, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో, ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత జట్లను ఎంపిక చేస్తారు.

సాత్విక్-చిరాగ్ జోడీ ఓటమి



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ పోరాటం ముగిసింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంక్ జోడీ సాత్విక్-చిరాగ్ 16-21, 21-11, 15-21తో ప్రపంచ 17వ ర్యాంక్ ద్వయం లియాంగ్ వె కెంగ్-వాంగ్ చాంగ్ (చైనా) చేతిలో ఓడిపోయింది. సెమీఫైనల్లో ఓడిన సాత్విక్-చిరాగ్ జోడీకి 17,500 డాలర్ల (రూ. 14 లక్షల 22 వేలు) ప్రైజ్‌మనీతో పాటు 8,400 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

నాదల్, జొకోవిచ్‌లపైనే దృష్టి

రేపటి నుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్ • ఉదయం గం. 5 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం





మెల్‌బోర్న్: కెరీర్‌లో 23వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించాలనే లక్ష్యంతో రాఫెల్ నాదల్ (స్పెయిన్)... అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన ప్లేయర్‌గా నాదల్ పేరిట ఉన్న రికార్డును సమం చేయాలనే పట్టుదలతో నొవాక్ జొకోవిచ్... రేపటి నుంచి మొదలయ్యే టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో బరిలోకి దిగనున్నారు. ప్రపంచ రెండో ర్యాంకర్ నాదల్ డిఫెండింగ్ చాంపియన్ హోదాలో సోమవారం జరిగే పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో బ్రిటన్‌కు చెందిన 40వ ర్యాంకర్ జాక్ డ్రేపర్‌తో ఆడనున్నాడు. మంగళవారం జరిగే తొలి రౌండ్‌లో ప్రపంచ 75వ ర్యాంకర్ రొబెర్టో బేనా (స్పెయిన్)తో జొకోవిచ్ తలపడతాడు. జొకోవిచ్ 21 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గగా అందులో 9 ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్స్ ఉండటం విశేషం. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానంలో ఉన్న జొకోవిచ్ ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా నిలిస్తే మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటాడు. నాదల్, జొకోవిచ్ కాకుండా ఏడో సీడ్ మెద్వెదేవ్ (రష్యా), రెండో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే), మూడో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) టైటిల్ ఫేవరెట్స్‌గా బరిలోకి దిగనున్నారు.

బెల్జియం భారీ విజయం



భువనేశ్వర్: పురుషుల ప్రపంచకప్ హాకీ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ బెల్జియం జట్టు భారీ విజయంతో బోణీ కొట్టింది. పూల్ 'బి'లో భాగంగా దక్షిణ కొరియాతో శనివారం జరిగిన మ్యాచ్‌లో బెల్జియం 5-0తో గెలుపొందింది. బెల్జియం తరఫున హెండ్రిక్స్ (31వ ని.లో), కాసిన్స్ (43వ ని.లో), ఫ్లోరెంట్ (50వ ని.లో), సెబాస్టియన్ డాకియర్ (52వ ని.లో), ఆర్థర్ స్లూవెర్ (58వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఇతర మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ 3-1తో చిలీపై, నెదర్లాండ్స్ 4-0తో మలేసియాపై, జర్మనీ 3-0తో జపాన్‌పై విజయం సాధించాయి.

సినిమా

ఈ విజయం అందరిదీ

\- చిరంజీవి

"ఓ హిట్ సినిమాను అందించడం కంటే నిర్మాతల బడ్జెట్‌లో సినిమాను తీయగలగడాన్ని దర్శకుల తొలి విజయంగా భావించాలి. 'వాల్తేరు వీరయ్య'ను దర్శకుడు బాబీ పక్కా ప్లానింగ్‌తో తీశాడు. ఔత్సాహిక దర్శకులకు ఈ సినిమా ఓ కేస్ స్టడీలా ఉపయోగపడుతుంది'' అని చిరంజీవి అన్నారు. చిరంజీవి హీరోగా, రవితేజ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. కొల్లి బాబీ (కేఎస్. రవీంద్ర) దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న రిలీజైంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన మెగా మాస్ బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్‌లో చిరంజీవి మాట్లాడుతూ– ''వాల్తేరు వీరయ్య' విజయం ఈ సినిమాకు పని చేసిన కార్మికులందరిదీ. రవితేజను నా తమ్ముడిలా భావిస్తాను. అందుకే తనతో యాక్ట్ చేసేప్పుడు గ్లిజరిన్ లేకపోయినా నాకు కన్నీళ్లు వస్తాయి'' అని అన్నారు. ''ఇంతకుముందు అన్నయ్య చిరంజీవితో రెండు సినిమాలు చేశాను. ఇప్పుడు చేసిన 'వాల్తేరు వీరయ్య' చిత్రం స్పెషల్'' అన్నారు రవితేజ. ''చిరంజీవిగారు ఇచ్చిన ఫ్రీడమ్, నాపై ఉంచిన నమ్మకమే 'వాల్తేరు వీరయ్య' బాగా రావడానికి దోహదపడింది'' అన్నారు బాబీ. ''వాల్తేరు వీరయ్య'తో పెద్ద బ్లాక్‌బస్టర్ కొట్టాం. సినిమా టిక్కెట్ ధరల విషయంలో వెసులుబాటు కల్పించిన ఏపీ ప్రభుత్వానికి, ప్రీమియర్ షోస్‌కి సహకరించిన తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు'' అన్నారు నిర్మాతలు నవీన్, రవి. కాగా 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు..' పాటకు 'బెస్ట్ ఒరిజినల్ స్కోర్' విభాగంలో అవార్డు వచ్చిన సందర్భంగా పాట రచయిత చంద్రబోస్‌ని సత్కరించారు.


● నవీన్, బాబీ, చిరంజీవి, చంద్రబోస్, రవితేజ, దేవిశ్రీ ప్రసాద్, రవిశంకర్

మంచి చేస్తే మంచే జరుగుతుంది

\- హన్సిక

పెళ్లయ్యాక వచ్చిన తొలి పండగ సంక్రాంతి సంబరాల్లో ఉన్న హన్సిక తన అభిమానులకు, శ్రేయోభిలాషులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 4న వ్యాపారవేత్త సోహైల్ కతూరియాతో హన్సిక వివాహం జరిగింది. పెళ్లి తర్వాత షూటింగ్స్‌కి కాస్త బ్రేక్ ఇచ్చారామె. ఇక సంక్రాంతి సంబరాల గురించి హన్సిక ఈ విధంగా చెప్పారు.


● హన్సిక, సోహైల్

సంక్రాంతి మనందరికీ పెద్ద పండగ. మాకు నార్త్‌లో అయితే 13 నుంచి 16వ తేదీ వరకూ పండగ చేసుకుంటాం. శుక్రవారం లోరీ (భోగి పండగ) జరుపుకున్నాం. లోరీ అంటే మాకు నువ్వుల లడ్డు తప్పనిసరి. హల్వా కూడా చేస్తాం. మా అత్తగారింట్లో సంప్రదాయాలు బాగా పాటిస్తారు. కోడలు హల్వా చేయడం ఆనవాయితీ. సో.. లోరీకి నేనే హల్వా తయారు చేశాను. ఇంకా వేరుశెనగ పప్పుతో బర్ఫీ చేస్తాం. లోరీ మంటలో మరమరాలు, పేలాలు వంటివన్నీ వేస్తాం. అగ్నికి చెడు ఆహుతైపోవాలని, రానున్న రోజులన్నీ బాగుండాలని కోరుకుంటూ, మంట చుట్టూ తిరుగుతాం.

పుట్టిల్లు.. అత్తిల్లు ఒకేచోటే...

సంక్రాంతి సందర్భంగా మా అత్తగారు మా పుట్టింటివాళ్లని ఆహ్వానించారు. లోరీ రోజు మా అమ్మవాళ్లు వచ్చారు. పండగ పనులకు అమ్మ సాయం చేశారు. ఆ రోజంతా ఉండి, ఎంజాయ్ చేసి వెళ్లారు. పుట్టిల్లు, అత్తిల్లు ఒకేచోట.. అంటే ముంబైలోనే కావడం ఆనందంగా ఉంది. ఎప్పుడు అనుకుంటే అప్పుడు, ఇలా పండగలప్పుడు కలుసుకునే వీలుంటుంది.


● తల్లి, సోదరుడితో...

గ్రాండ్‌గా పండగ

లోరీని ఘనంగా జరిపినట్లే మిగతా మూడురోజుల పండగను కూడా గ్రాండ్‌గా ప్లాన్ చేశాం. నిష్ఠగా పూజలు చేయడం, పిండి వంటలు చేయడం.. అన్నింటినీ చాలా జాగ్రత్తగా చేస్తున్నాం. ఇక పండగ అంటే ఇతరులను కూడా సంతోషపెట్టాలన్నది నా అభిప్రాయం. నా చిన్నప్పుడే మా అమ్మగారు నాకీ విషయం చెప్పి, ఇతరులకు సహాయపడేలా చేస్తుంటారు.


● అత్తింటివారితో హన్సిక

పిల్లలకు కొత్త బట్టలు కొన్నాం

'మనం మంచి చేస్తే మనకు మంచి జరుగుతుంది' అని మా అమ్మ అంటుంటారు. అందుకే టీనేజ్‌లో నేను హీరోయిన్ అయ్యాక కొంతమంది పిల్లలను దత్తత తీసుకునేలా చేశారు, ఇప్పుడు మేం మొత్తం 31 మంది పిల్లల ఆలనా పాలనా చూస్తున్నాం. సంక్రాంతి సందర్భంగా పిల్లలందరికీ కొత్త బట్టలు కొన్నాం. స్వీట్లు పంచి పెట్టాం. పిల్లల ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. ఆ ఆనందం తాలూకు ఆశీర్వాదాలు మనకు అందుతాయి. ఆ దేవుడి ఆశీర్వాదం ఉండటంవల్లే నా జీవితం సాఫీగా సాగిపోతోంది.

ఈ 20 నుంచి ఫుల్ బిజీ

పెళ్లయ్యాక ప్రొఫెషనల్ లైఫ్‌కి కొన్ని రోజులు బ్రేక్ ఇచ్చాను. ఈ మధ్యే యాడ్ షూట్స్‌లో పాల్గొన్నాను. ఇక ఈ నెల 20న నుంచి గ్యాప్ లేకుండా షూటింగ్ చేయబోతున్నాను. దాదాపు ఏడు సినిమాలు కమిట్ అయ్యాను. రెండు వెబ్ సిరీస్‌లు ఉన్నాయి. వీటితో బిజీ అయిపోతాను కాబట్టి ఈ పండగను వీలైనంత ప్రశాంతంగా జరుపుకుంటున్నాను. మరోవైపు మా ఆయన కూడా తన బిజినెస్ పనులతో బిజీ అయిపోతారు. ప్రొఫెషనల్, పర్సనల్ లైఫ్‌ని జాగ్రత్తగా బ్యాలెన్స్ చేసుకోవాలని ఇద్దరం మాట్లాడుకున్నాం. మరోసారి అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. ఆ దేవుడి దయ వల్ల అందరి జీవితాలూ బాగుండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

వేసవిలో రామబాణం


● గోపీచంద్

'లక్ష్యం' (2007), 'లౌక్యం' (2014) చిత్రాల తర్వాత హీరో గోపీచంద్, దర్శకుడు శ్రీవాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న మూడో చిత్రానికి 'రామబాణం' టైటిల్‌ను ఖరారు చేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను శనివారం ప్రకటించారు. డింపుల్ హయతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు, ఖుష్బూ కీలక పాత్రలు చేస్తున్నారు. ఇందులో గోపీచంద్‌కు అన్నా వదిన పాత్రల్లో జగపతిబాబు, ఖుష్బూ కనిపిస్తారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల ఈ సినిమాను నిర్మిస్తున్నారు. గోపీచంద్ కెరీర్‌లో 30వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ తుది దశలో ఉంది. ''బాలకృష్ణగారు మా సినిమా టైటిల్‌ను ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది. ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు సామాజిక సందేశం కూడా మిళితమై ఉన్న బలమైన కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఈ ఏడాది వేసవిలో ఈ సినిమాను రిలీజ్ చేసేలా సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు కథ: భూపతి రాజా, కెమెరా: వెట్రి పళనీస్వామి, సంగీతం: మిక్కీ జే మేయర్.

థ్రిల్లింగ్ సుందరి


● పూర్ణ

జయప్రద, పూర్ణ, సాక్షి చౌదరి ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'సువర్ణ సుందరి'. చరిత్ర భవిష్యత్తును వెంటాడుతుంది అనేది ట్యాగ్‌లైన్. మాదారపు సురేంద్ర దర్శకత్వంలో ఎమ్.ఎల్. లక్ష్మి నిర్మించిన ఈ సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ మూవీ ఫిబ్రవరి 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు సురేంద్ర మాట్లాడుతూ – ''గతానికి భవిష్యత్తుకు మధ్య వారధిలా జయప్రదగారి పాత్ర ఉంటుంది. కరోనా పరిస్థితుల కారణంగా సినిమా లేట్‌గా విడుదలవుతోంది. విజువల్ పరంగా కావొచ్చు, కంటెంట్ పరంగా కావొచ్చు.. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చే చిత్రం ఇది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సాయికార్తీక్, సహనిర్మాత: శ్రీకాంత్ పండుగుల.

ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ


● మారేష్ శివన్, సాయి సుధాకర్, రాఘవేంద్ర రావు

దినేష్ తేజ్, హెబ్బాపటేల్, పాయల్ రాధాకృష్ణ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'అలా.. నిన్ను చేరి'. మారేష్ శివన్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, కొమ్మాలపాటి సాయిసుధాకర్ నిర్మిస్తున్న చిత్రం ఇది. సంక్రాంతి సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్‌ను దర్శకుడు రాఘవేంద్ర రావు విడుదల చేసి, చిత్ర యూనిట్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ''హీరో దినేష్‌తేజ్ రెండు గెటప్స్‌లో కనిపిస్తారు. ఎమోషన్స్‌తో పాటు ఈ తరం ప్రేక్షకులను అలరించే ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: సుభాష్ ఆనంద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కర్నాటి రాంబాబు.

వార్‌లో సప్తమి


● సప్తమి గౌడ

'ది కశ్మీరీ ఫైల్స్' వంటి సూపర్‌హిట్ ఫిల్మ్ తర్వాత దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'ది వ్యాక్సిన్ వార్'. కోవిడ్ 19 పరిస్థితులు, దేశంలోని వ్యాక్సిన్ డ్రిల్స్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్, నానా పటేకర్, దివ్య సేథ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కాగా ఈ సినిమాలో కన్నడ హిట్ 'కాంతార' ఫేమ్ హీరోయిన్ సప్తమి గౌడ జాయిన్ అయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ సినిమా ఫైనల్ షెడ్యూల్ చిత్రీకరణలో సప్తమి పాల్గొంటున్నారు. ఐయామ్ బుద్ధ ప్రొడక్షన్స్ పతాకంపై 'వ్యాక్సిన్ వార్' సినిమాను నిర్మిస్తుండటంతో పాటు ఇందులో నటిస్తున్నారు పల్లవీ జోషి. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకంపై ఈ సినిమా ఈ ఏడాది ఆగస్టు 15న రిలీజ్ కానుంది. తెలుగు, తమిళ, కన్నడ, ఉర్దూ, హిందీ, ఇంగ్లిష్, గుజరాతీ, పంజాబీ, భోజ్‌పురి, మరాఠీ, అస్సామీ భాషలతో సహా ఈ సినిమాను మరికొన్ని భాషల్లో విడుదల చేయనున్నారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



క్రిస్టియన్/కుల, కట్న ప్రసక్తి లేదు/2వ పెళ్లి/ M.Tech, Ph.D/Asst.ప్రొఫెసర్/1 లక్ష PM / 5'10" ఎత్తు/30 సం॥ల పిల్లలు లేని వరునికి వధువు కావలెను. కుల, కట్న ప్రసక్తి లేదు. Ph: 9963757612 [HA-13171]

క్రిస్టియన్/డైవర్సీ/కులపట్టింపు లేదు/ B.Tech/Govt.ఇంజినీర్/60,000/-PM/ 5'8" ఎత్తు/40 సం॥ల పిల్లలులేని వరునికి వధువు కావలెను. Ph: 8374801504 [HA-13171]

రెడ్డి/27/5'9"/BBA, Business 3 Cr P/A, 500 Cr & 30/5'10"/B.Tech-Business 6 Cr Property, Cont : P.P.Reddy. 8332855246 [H-792907]

రెడ్డి/28/5'10"/B.Tech ONGC Officer & 29/5'10"/B.Tech-Govt AEE. Cont: P.P.Reddy. 8332855246 [H-792907]

బ్రాహ్మణ/40yrs/5'5"/M.Sc., B.Ed/ Pvt Job/Any Cast/వెల్ సెటిల్డ్ అయిన వరుడికి అందమైన వధువు కావలెను. Ph: 85004 27582 [H-792575]

హిందూ/ విడోయర్/52y/ సొంతవ్యాపారం 10 లక్షలు (PM) ఆర్థికంగా స్థిర పడిన వరునికి 1వ, 2వ వధువు కావలెను (కుల, కట్న ప్రసక్తి లేదు పిల్లలున్న OK) డైరెక్ట్ సంప్ర॥ Ph: 9989386365 [H-792955]

రెడ్డి/35/M.Tech/SWE/20 LPA/బెంగళూరులో ఉద్యోగం చేయు వరునికి సివిల్స్/డాక్టర్/SWE వధువు కావలెను. నో బ్రోకర్స్ డైరెక్ట్ కాంటాక్ట్ సెల్: 9951685915. [J-1157569]

Reddy/Gr MBBS-Residency 32/ 5'10"/USA & 26/5'9"/B.Tech/ MS USA, 30Cr. Cont : P.P.Reddy. 8332855246 [H-792907]

Political- Software-Business man, 56, OC wants tall Business Life Partner Lady, 6360474663, Widow Ok. [HA-46751]

Vice President & MD Software Company USA MS $220K Khamma 27 Years. 5'10" Needs Suitable Bride. Cont:9444817468 [NA-21595]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/MBA/UK/Business-Hyd/ Handsome Boy/1994 /5'11" / 250Cr. * Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/ 9347807015

Reddy/Business.B.Tech/MBA/Very Handsome Boy/1995/6'Feet/ 100Cr /3L.M/ Rental income/Hyd. * Cont: K.C. Reddy Ph: 9849321309/9347807015

Reddy/ Business/B.Tech/1990/6'/ 1000Cr/Handsome Boy.* Cont : K.C. Reddy-Mar-Bureau-B.Hills-Hyd. Ph:9849321309/9347807015

Reddy/MBBS/MD / 1995/5'10" /300Cr. * 1994/5'9"/ 50Cr. *1994/5'9"/ 75Cr. * USA Doct - 1989/5'9". *1992/5'11". * 1988/6'. * Cont:K.C. Reddy- Hyd. Ph:9849321309

Reddy/B.Tech/IIT/MS/USA/230K/ Rich Family/1994/5'7"/ *IIT/Job India/ 1992/5'9"/25L/yr. * Cont: K.C. Reddy- Hyd. Ph: 9347807015

Reddy/Business / Good Industry/ B.Tech /1997/5'11"/Very Handsome Boy/ 75Cr * Cont : K.C. Reddy- Hyd. Ph: 9849321309 /9347807015

Reddy/USA-Citizen/BS/Business/Own Company / 1995 / 5'10" /Very Handsome Boy/70Cr/200K. *Cont: K.C. Reddy - Hyd. Ph: 9347807015

Reddy/Divorcee/B.Tech/MBA/Job & Business / Fair / 1994 / 5'10"/200Cr. * Cont : K.C. Reddy - B.Hills- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/Now in Hyd/B.Tech/MS/H1/ USA/1991/5'11" /140K /200Cr. *1989/ 5'7"/100K/100Cr.*Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech/MS/Job-Hyd-24L /Yr/100Cr/Father-Burocrat. * Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph: 9849321309/ 9347807015

వరుడు కావలెను

Reddy/(CAT HOLIC) B.Tech/MS/ Business/Hyd/Beautiful/1993/5'3"/100Cr. * Cont: K.C. Reddy-Mar-Bureau- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/MBBS/PG. *1994/5'3"/75Cr. *1993/ 5'3"/50Cr. *1990/100Cr. *1993/5'7"/100Cr. *1994/5'4"/50Cr. *1994/5'10"/50Cr. *1996/ 5'4"/50Cr. Cont: K.C. Reddy. Ph: 9849321309

Reddy/B.Tech/ MS/ USA/1997/5'5"/10Cr. *1996/5'8"/15Cr. 1996/5'7"/50Cr. 1990/ 5'8"/100Cr. 1996/5'5"/15Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MS/H1/USA/Most Beautiful/1996/5'9"/100Cr. *1990/ 5'8" /160K/100Cr. *1996/5'7"/50Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/ B.Tech / 1994 / 5'6"/ 100Cr * 1995/ 5'8"/ 100Cr. * Cont: K.C. Reddy-Mar-Bureau-Road No.3, B.Hills- Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/Divorcee/BDS-Doc / USA/ 1995 / 5'5" / 8Cr/Needs USA alliance & Well Settled. * Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/BE/(NIT)/MBA/Most Beautiful /1996/5'9"/10Cr.* Need Good Alliance India or Abroad. *Cont: K.C. Reddy - Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/Most Beautiful/Rich. *LLM/1995/5'3"/150Cr.*MS/1996/5'9"/ 100 Cr. *BBA/1997/5'4"/100Cr. *1994/ 5'6"/ 100Cr. *1995/5'8"/100Cr * 9347807015

Reddy/ MS/ INDIA/ 1994/ 5'3"/ 200Cr/ * MBA/ 1988/ 5'3"/ 200Cr * Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/MBBS/1998/5'7"/50Cr. *1996/5'8"/40 Cr. *1999/5'4"/200Cr. *1995 / 5'2"/ 50Cr. * PG/1995/ 5'7"/20Cr. *1995/5'5"/50Cr. *1997/ 5'3"/25Cr. * Cont: Ph: 9849321309 [D-429]

2nd Marriage/ Sunni Muslim/39' 5'8"/Andhra (Vijayawada) 93K P.M, Working in Hyd, No Children, Looking for marriage Proposal Send Bio-Data at Photo to marriage_heaven@hotmail.com [H-792955]

★★

కమ్మ /39Y/5'.9"/MCA/బిజినెస్ చేయు వరుడుకి 1వ, 2వ, విడో వధువు కావలెను. పిల్లలు ఉన్న ఓకే. సంప్రదించండి సెల్: 96522 48330. [T-1916]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి BE, MS, 29, 6' 2", Sr Engineer, 10 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, 29, 5' 6", Engineer, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BBA, 28, 5'8", 80 Crores, Hyd, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5' 11", Engineer, 15 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, 25, 5' 6", 64 L P/A, 10 Crores, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE, 26, 5' 3", SWE, 6 L P/A, 2 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA (ISB), 26, 5' 4", 10 Crores, Hyderabad, Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి USA, BE, MS, 28, 5' 4", Team Leader, 135 K, H1, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

www.avinashreddy.com
అవినాష్ రెడ్డి మ్యారేజెస్
(రెడ్డిలకు మాత్రమే)



D.V. Koti Reddy
690, Road No.3, Banjara Hills, (TV 9 : Opp. Colony) Hyderabad
98480 11818, 93933 11818

రెడ్డి Bengaluru, BE, 30, 5' 8", Business, 30 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE BITS, 28, 5' 5", 30 L P/A, 20 Crores, Bengaluru. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 28, 5' 10", PG Doctor, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి DivorceBusiness, MBBS, MS, 36, 6', 100 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, 27, 5'3", 50 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 28, 5' 9", Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, Bengaluru, BE, 29, 5' 2", SWE, 9 L P/A, 2 Cr. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, 30, 5' 4", SWE, 11 L P/A, 5 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER


క్రిస్టియన్ మాల/MCA/ 32Y, IT ఉద్యోగి, 2లక్షలు-pm,హైట్:5.7/వరుడుకి వధువు కావలి / నెల్లూరు ఫ్యామిలీ ప్రిఫర్డ్ / నోబ్రోకర్లు, డైరెక్ట్ : 90663 66214. [N-5254]

కమ్మ : 39Y చామనఛాయ లేటు మ్యారేజ్ 4 కోట్లు ఆస్తి, బిజినెస్ 5'7" వరునకు అర్జంట్‌గా 1వ లేక 2వ కమ్మ వధువు కావలెను. అర్జంట్ డైరెక్ట్ ✆ 93463 54797 [O-786953]

రెడ్డి/ 36, Fair / 5.4 / B.Tech/ Software Employee/ 18 LPA / 1.40 P.M./ Any 1st / 2nd Fair అందమైన అమ్మాయి కావలెను. డైరెక్ట్‌గా సంప్ర: 90597 78982 [L-793250]

SC మాల II nd 50 సం॥ టీచర్‌కు సాంప్రదాయ కుటుంబం నుండి తగిన వధువు తోడు కావలెను (No broicers) డైరెక్ట్ : 95811 85079 [V- 1142672]

వరుడు కావలెను



రెడ్డి/49y / విడో / 5'3"/ Fair / ఫ్యామిలీ పెన్షనర్/G+1 House/4 ఎకరాల పంట పొలం/సొంత ఇల్లు గల వధువుకు మధ్య తరగతి వరుడు కావలెను. Ph: 9059150892 [H-793254]

కమ్మ/విడో / 50y / Govt.Job / Doctor Own Hospital & Medical Shop/ 14Acres Land/32 Lac Income/కోట్ల ప్రాపర్టీ కలిగిన వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 7416718458 [H-793254]

నాయుడు/55y/విడో/5'4"/Govt. Teacher / 60,000PM/ 2 సొంత ఇల్లు/ ట్యూషన్స్/ 50K PM పిల్లలులేని ఒంటరి వధువుకి వరుడు కావలెను. Ph : 8106358849 [H-793254]

రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు, A : 30. Q: డిగ్రీ, బిజినెస్‌లు గల అందమైన వధువుకు వరుడు కావలెను. (ఇల్లరికం OK) సంప్ర: 9100717575 [HA-13171]

SC మాదిగ/B.Tech/C.Govt.బ్యాంక్ క్లర్క్/SBI/5'4"ఎత్తు/28 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 7032058965 [HA-13171]

రెడ్డి/విడో, 45 సం॥, 5'6", హైదరాబాద్, సొంత ఇల్లు, రెంట్స్, పొలాలు, కోట్ల ఆస్తి గల అందమైన రెడ్డి ఒంటరి వధువుకు వరుడు కావలెను. వాట్సాప్: 9030129988 [HA-13171]

SC/35yrs/5'4"/M.A., B.Ed/ కలర్/ Fair/Pvt Job/Any Cast / అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 85004 27582 [H-792575]

బ్రాహ్మణ/33Yrs/5'2"/ఇంటర్/29Yrs/ 5'4"/డిగ్రీ అందమైన వధువులకు వరులు కావలెను /ట్యూటర్/Pvt, Govt. జాబ్ & పురోహితం అయినా OK. Ph: 6301 953980 [H-792575]

2వ పెళ్లి/కుల పట్టింపు లేదు/40yrs/M.Sc, B.Ed/Govt.టీచర్ 1 లక్ష(pm) పిల్లలు లేని తెల్లని అందమైన వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను+పిల్లలు ఉన్నా OK) సంప్ర: 7396213324 [H-792575]

రెడ్డి/విడో/38 సం. 5.3 ఎత్తు సొంత ఇల్లు 20 ఎకరాల పొలం స్థిరాస్తి కలిగి పిల్లలు లేని ఒంటరి వధువుకు వరుడు కావలెను (ఆస్తి కుల పట్టింపు లేదు) Send Only whatsapp 9441145961 [H-792575]

కుల పట్టింపులేదు/ 46/Widow/Dept Food at Public Distributional/97,500/- PM/ సొంతఇల్లు /39 ఎ॥ పొలాలు కోట్ల ప్రాపర్టీస్ గల వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. Ph: 9121040805 [H-792955]

మాల/26/5'4"/B.Tech IIT/ MBA IIM 30 Lakhs P/A వధువుకు తగిన వరుడు కావలెను No Brokers. Ph: 9493285326 [H-792955]

రెడ్డి/రెండవ పెళ్ళి/ * Bride 26 / 5'3"/ M.Tech & 27/5'3"/MS USA & MBBS Govt. Dr/32/5'3"/V.Fair. Cont: P.P.Reddy. 8332855246 [H-792907]

రెడ్డి/Bride 26/5'6"/B.Tech/MS USA-200Cr & 27/5'5"/B.Tech/ MS/ Australia & 22/5'4"/B.Com. Cont: P.P.Reddy. 8332855246 [H-792907]

బ్రాహ్మణ/30/5'2"B.Com. & 34/5'2"/ ఇంటర్. *35/5'3"B.Tech *36/5'4"/ఇంటర్. *38/ 5'4"/డిగ్రీ వధువులకు జాబ్/బిజినెస్/పురోహితం వరులు కావలెను. వాట్సాప్: 7893005879 [HA-13161]

వేదికలు



రజక వివాహ వేదిక (1994)/ డాక్టర్స్/ ఇంజినీర్స్/ Abroad/ USA/ UK/ B.Ed/ Govt Job సంబంధాలకై సంప్రదించండి ఫోన్: 8106303155/ 9391265304. [H-792955]

క్రైస్తవ వివాహ వేదిక: www.indiachristian matrimony.com 10,000 మంది ప్రొఫైల్స్ అందుబాటులో కలువు 29.01.2023 2 pm-6 pm మహబూబ్ నగర్- హైదరాబాద్ Ph: 8885073555, 8885410555 [H-793254]

గౌడ, ఈడిగ, శెట్టిబలిజ, యాత, శ్రీశైన మా ఖాతాదారులకు శ్రేయోభిలాషులకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు. "శుభమస్తు" మ్యారేజ్ బ్యూరో, DSNR, Hyd. వ్యవస్థాపకులు : స్వర్గీయ S. శారదా గౌడ్ S.నాయుడు గౌడ్. Ph: 8790690309 [H-793254]

BRAHMIN పెళ్ళి సంబంధాలకై సంప్ర॥ Verified Profilesతో నమ్మకమైన సంస్థ. *Shyam. Ph: 6281389448/ Blue Trend Matrimonial (P) Ltd. [H-13171]

KAPU పెళ్ళి సంబంధాలకై సంప్ర॥ Verified Profilesతో నమ్మకమైన సంస్థ. *Nikhil. Ph: 9000487865/ Blue Trend Matrimonial (P) Ltd. [H-13171]

KAMMA-Reddy-Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర॥ Verified Profilesతో *Shyam. Ph: 6281389448/ Blue Trend Matrimonial (P) Ltd. [H-13171]

MADIGA-MALA పెళ్ళి సంబంధాలకై సంప్ర॥ Verified Profilesతో నమ్మకమైన సంస్థ. *Srinivas. Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [H-13171]

CHRISTIAN పెళ్ళి సంబంధాలకై సంప్ర॥ Verified Profilesతో నమ్మకమైన సంస్థ. *Srinivas. Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [H-13171]

గంగపుత్రుల పెళ్లి సంబంధాలకై బెస్త, గూండ్ల, అగ్నికుల క్షత్రియ, వాడబలిజ, జాలరి & ఇతరాత్రా. శ్రీ గంగాభవాని గంగపుత్రుల వివాహ పరిచయాలు. అంబర్‌పేట్. HYD. Ph: 9000541008 [H-787366]

వాసవి విజయవాడ వారి ఆధ్వర్యంలో 26-1-23 తేది ఉ. 9గం॥లకు 62వ ఆర్యవైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదిక మరియు మ. 2 గం॥లకు 17వ పునర్వ వివాహ పరిచయవేదిక విజయవాడ KBN కాలేజ్ లో జరుగును. వివరాలకు ✆ 99895 00130 [B-1679]

మాల, మాదిగ : IAS, IPS, IRS, IRTS, IES, Group-I, II, Bank P.O, USA, UK, SWE, B.Tech (IIT), MBA (IIM), Govt. Officer, MBBS, MD. Cont. Cell : 73969 15712. [M-8470]

SC మాల హిందువులకు మాత్రమే. B.Tech/ M.Tech /IAS / IPS / MBBS / MD /MCA/Abroad & Govt Job Holders సంప్ర: శ్రీలక్ష్మి మ్యారేజ్ బ్యూరో సాయిరాం. Ph: 8008988513, 9000919182 [H-792568]

వడ్డెర వరుడు వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ తక్షణ సంబంధాల కొరకు సంప్రదించండి: 9381553423 [HA-13158]

అబ్రాడ్ & ఇండియాలో ఉన్నవారికి డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్,బిజినెస్,గ్రూప్ 1,2 ఆఫీసర్ల వ్యక్తిగత శ్రద్ధతో తొందరగా పెళ్లి సంబంధాలు కుదుర్చబడును. పూర్ణమాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-424]

★

Free Registration/బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC, Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatapp) [HA-630]

మహబూబ్‌నగర్ మాదిగ వివాహ పరిచయ వేదిక. 29/1/23 ఆదివారం 10-6PM ఫీ 1 వేయి ముందుగా మీ ఫోటో బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. Ph: 9347046175 [H-776690]

★★

మాల (క్రైస్తవ, హిందూ), M.Tech, M.S., MBA, MCA, M.B.B.S. చదువులతో డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, బ్యాంక్ జాబ్స్ చేస్తున్న వధూవరుల కొరకు kalyanamala.org ✆ 94405 45049 [B-1197876]

కాపు, తెలగా, తూర్పు కాపు, బలిజ, నాయుడు వధువు / వరుడుల వివాహ పరిచయ వేదిక 22/01/23, ఉ॥ 9.00 గం॥లకు, నాయుడు గ్రాండ్ హోటల్ A/C, గోపాలపట్నం, వైజాగ్. ఫోన్: 92478 80567, 83309 83711 [V- 6036]

మండలానికో డీసీసీబీ శాఖ

- మూడేళ్లలో 30 కొత్త బ్రాంచ్‌లు
- కొత్తగా మరో 160 బ్రాంచ్‌లకు ప్రతిపాదనలు
- 12 బ్రాంచ్‌లకు అనుమతులు

సాక్షి, అమరావతి: గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సహకార బ్యాంకింగ్ రంగంలో దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్న ఏపీ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ (ఆప్కాబ్) సేవలను మరింత విస్తరిస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు మారుమూల గ్రామాల ప్రజల ఆర్థిక స్థితిగతులను కూడా మెరుగుపరిచే లక్ష్యంతో మండలానికో సహకార బ్యాంకు ఏర్పాటు చెయ్యాలని ప్రభుత్వం సంకల్పించింది. గత మూడేళ్లలో రాష్ట్రంలో కొత్తగా 30 బ్రాంచ్‌లు ఏర్పాటు చేశారు. 332 మండలాల్లో బ్రాంచ్‌ల్లేవని గుర్తించారు. ఈ మండలాల్లోనూ బ్రాంచ్‌ల ఏర్పాటుకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)ల నుంచి ఆప్కాబ్ ప్రతిపాదనలు కోరింది. ఉగాదిలోగా కనీసం వంద మండలాల్లో కొత్త బ్రాంచ్‌లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది.

మూడంచెల పద్ధతిలో ఏర్పాటైన ఆప్కాబ్‌కు రాష్ట్రంలో సొంతంగా 18 జిల్లా బ్రాంచ్‌లున్నాయి. ఆప్కాబ్‌కు అనుబంధంగా 13 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులకు చెందిన 418 శాఖల ద్వారా సేవలందిస్తోంది. డీసీసీబీల పరిధిలో 1997 ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు (పీఏసీఎస్) ఉన్నాయి. ఆప్కాబ్ పరిధిలో కొత్తగా ఆరు శాఖల ఏర్పాటు చేయనున్నారు. కొత్త బ్రాంచ్‌ల ప్రతిపాదనల కోసం ఆప్కాబ్ రాసిన లేఖకు స్పందించిన డీసీసీబీలు ఇప్పటివరకు 154 బ్రాంచ్‌లకు ప్రతిపాదనలు పంపాయి. అత్యధికంగా వైఎస్సార్ డీసీసీబీ పరిధిలో 34, గుంటూరులో 25, ప్రకాశంలో 20, ఏలూరులో 19, విజయనగరంలో 16, నెల్లూరులో 14, విశాఖపట్నంలో 13, చిత్తూరులో 10, కర్నూలులో 3 బ్రాంచ్‌లకు ప్రతిపాదనలు వచ్చాయి. ఆప్కాబ్ శాఖలతో కలిపి మొత్తం 160 శాఖల ప్రతిపాదనలు అధికారులు నాబార్డుకు పంపారు. నాబార్డు నుంచి ఆర్బీఐకి పంపుతున్నారు. ఆర్బీఐ అనుమతించి లభించిన వెంటనే శాఖల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటారు. ఆప్కాబ్ ఏర్పాటు చేసే 6 శాఖలకు, విజయనగరం డీసీసీబీ పరిధిలో ఏర్పాటు చేసే 6 శాఖలకు ఆర్‌బీఐ నుంచి అనుమతులు వచ్చాయి. సంక్రాంతి తర్వాత వీటిని ఏర్పాటు చేయనున్నారు. మిగతా 148 ప్రతిపాదనల్లో 128 నాబార్డు వద్ద, 20 ఆర్‌బీఐ పరిశీలనలో ఉన్నాయి.

ఆర్‌బీఐ అనుమతి తప్పనిసరి

ఇప్పటివరకు కొత్త బ్రాంచ్‌ల ఏర్పాటుకు వార్షిక ప్లాన్, బ్రాంచ్ వయబిలిటీ రిపోర్టులతో డీసీసీబీ పాలక వర్గం సిఫార్సుతో ఆప్కాబ్‌కు పంపాలి. అక్కడి నుంచి నాబార్డుకు, ఆపై కమిషనర్ ఫర్ కోఆపరేటివ్ అండ్ రిజిస్ట్రార్ ఫర్ కోఆపరేటివ్ సొసైటీ (సీసీ అండ్ ఆర్‌సీ)కి పంపిస్తారు. సీసీ అండ్ ఆర్‌సీ అనుమతిస్తే కొత్త బ్రాంచ్‌లు ఏర్పడినట్టే. ఇటీవల బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్టు (బీఆర్)లో తెచ్చిన సవరణ ప్రకారం ప్రభుత్వ, సహకార బ్యాంకుల కొత్త శాఖలకు విధిగా ఆర్‌బీఐ అనుమతి తీసుకోవాలి.

కుప్పంలోనూ టీడీపీ జెండా పీకేయడం ఖాయం

సదుం (చిత్తూరు జిల్లా): వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో కూడా టీడీపీ జెండా పీకేయటం ఖాయమని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. సంక్రాంతి పండుగ నాడు కూడా చంద్రబాబు నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. గోదావరి పుష్కరాల్లో షూటింగ్ కోసం 29 మందిని, మొన్న కందుకూరులో 8 మందిని, గుంటూరులో ముగ్గురిని పొట్టన పెట్టుకొని మళ్లీ వారిపైనే బాబు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రోడ్ల మీద, ఇరుకు సందుల్లో సభలు పెట్టి జనాన్ని చంపుతుంటే.. జీవో నంబర్ 1ను తెచ్చామని, ప్రజల ప్రాణాలకు రక్షణగా ఉండే జీవోను భోగి మంటల్లో కాలుస్తారా..? ప్రజల ప్రాణాలంటే మీకు లెక్కలేదా అంటూ ధ్వజమెత్తారు. కాల్చాల్సింది జీవోని కాదని, బాబు బుద్ధిని అని చెప్పారు. శనివారం సదుం మండలం యర్రాతివారిపల్లెలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు క్యారెక్టర్ లేని వ్యక్తి అని ధ్వజమెత్తారు. గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి పైన, ఇప్పుడు జగన్‌మోహన్ రెడ్డి పైన, మంత్రుల పైన ఏడుస్తున్నారని అన్నారు. చిత్తూరు జిల్లాలో ఎప్పుడూ మెజార్టీ సాధించలేకపోవడం, అధికారం పోయిందనే బాబు ఏడుపుకి కారణమన్నారు. 2024 తర్వాత రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని చంద్రబాబు అంటున్నారని, ఆయనకు అల్జీమర్స్ వ్యాధి ఎక్కువ అవ్వడం వల్ల మధ్యలో 2019 సంగతి మర్చిపోయారని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ సీఎం అయినప్పటి నుంచే రాష్ట్రానికి మంచి రోజులు మొదలయ్యాయని, చంద్రబాబు పీడ రాష్ట్రానికి వదిలిందని తెలిపారు. దేశచరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉన్నారని స్పష్టం చేశారు. వాటిని చూసి చంద్రబాబు ఓర్వలేకుండా ఉన్నారని చెప్పారు. పుంగనూరులో టీడీపీ రౌడీలు, గూండాలు గొడవలు చేస్తుంటే చూస్తూ ఊరుకోవాలా, కేసులు పెట్టకూడదా అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో తమ మీద అక్రమంగా కేసులు పెట్టి, ఎంపీ మిథున్ రెడ్డిని జైలులో కూడా పెట్టించారని, పుంగనూరులో అభివృద్ధిని అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. అప్పుడు కూడా బాబు ఏడవాల్సిందేనని అన్నారు. హత్యా రాజకీయాలు మొదలు పెట్టింది చంద్రబాబేనని గుర్తుచేశారు. కాపు నాయకుడు వంగవీటి మోహన్ రంగాని, పింగళి దశరథరామ్‌ని హత్య చేయించింది ఎవరు అని బాబును ప్రశ్నించారు.

విశాఖలో.. భద్రతకు భరోసా

దొండపర్తి (విశాఖ దక్షిణ): నేర నియంత్రణతో పాటు ప్రజల భద్రతకు భరోసా కల్పించేలా విశాఖను సురక్షిత నగరంగా తీర్చిదిద్దనున్నారు. ఇందుకోసం నగర పోలీస్ శాఖ కసరత్తు చేస్తోంది. ప్రత్యేకంగా సొసైటీ ఫర్ విశాఖ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్(వీసీఎస్‌సీ) ఏర్పాటుకు నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ సంసిద్ధులయ్యారు. ఇందుకోసం పరిశ్రమలు, ఐటీ, హెల్త్‌కేర్, ఫార్మా, రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీ వంటి పలు రంగాలకు చెందిన ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై ప్రశాంత విశాఖకు చేపట్టాల్సిన చర్యలపై చర్చిస్తున్నారు.

కాస్మోపాలిటన్ సిటీగా..

విశాఖ పారిశ్రామిక, ఐటీ, పర్యాటక ఇలా అన్ని రంగాల్లో విశేషాభివృద్ధి దిశగా పయనిస్తోంది. దేశ విదేశాల నుంచి పెద్ద ఎత్తున పరిశ్రమలు నగరానికి తరలివస్తున్నాయి. అలాగే విశాఖ అందాలను తిలకించేందుకు విదేశీ పర్యాటకులు సైతం ఆసక్తి చూపిస్తున్నారు. అన్ని రంగాల్లో దూసుకుపోతున్న విశాఖ కాస్మోపాలిటన్ సిటీగా రూపాంతరం చెందుతోంది. సిటీ ఆఫ్ డెస్టినీగా పేరుపొందిన విశాఖను ప్రశాంత నగరంగా తీర్చిదిద్దేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది.

కొత్తగా వీసీఎస్‌సీ ఏర్పాటుకు చర్యలు

నగరంలో నేర నియంత్రణ కోసం ఇప్పటికే ప్రధాన జంక్షన్లు, ప్రాంతాల్లోనే కాకుండా కాలనీల్లోనూ పోలీస్ శాఖతో పాటు జీవీఎంసీ కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాయి. అయితే నగర పరిధి విస్తరిస్తుండడం, కొత్తగా పరిశ్రమలు ఏర్పాటవుతుండడం, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు విశాఖకు వస్తుండడంతో మరింత భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పోలీస్ శాఖ గుర్తించింది. దీనికి అనుగుణంగా నిఘా వ్యవస్థను మరింత విస్తృతం చేయాలని నిర్ణయించింది. దీనికి పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, ప్రజల నుంచి సహాయ సహకారాలు అవసరమన్న విషయాన్ని అన్ని వర్గాల వారికి అవగాహన కలిగిస్తున్నారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో ముఖ్యంగా మహిళలు, పిల్లల భద్రత, రోడ్ సేఫ్టీ, సైబర్ సేఫ్టీ, క్రైం మానిటరింగ్ వంటి రక్షణ చర్యలను మరింత పకడ్బందీగా అమలయ్యే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ నిర్ణయించారు. ఇందుకోసం సీసీటీవీ, సైబర్ ల్యాబ్ వంటి సాంకేతికతను పెంపొందించేందుకు సొసైటీ ఫర్ విశాఖపట్నం సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (వీసీఎస్‌సీ) ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

సాంకేతికతతో నేరాలకు అడ్డుకట్ట



అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిఘా వ్యవస్థను మరింత పటిష్ట పరుచుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రభుత్వం, పోలీస్ శాఖ చేపట్టాల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. సొసైటీ ఫర్ విశాఖపట్నం సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ఏర్పాటు చేసి.. అందులో అందరి భాగస్వామ్యం అవసరమన్న విషయాన్ని తెలియజేస్తున్నాం.

–సీహెచ్.శ్రీకాంత్, విశాఖ పోలీస్ కమిషనర్

దేవుడు ఎవర్నీ బాధపెట్టడు

తిరుచానూరు (తిరుపతి జిల్లా) : దేవుడు ఎవరినీ బాధపెట్టడని, అందరినీ కాపాడేందుకే అవతరించాడని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. టీటీడీ ఈఓ ధర్మారెడ్డి కుమారుడు చంద్రమౌళిరెడ్డి సంస్మరణ సభ శనివారం ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఎవరైనా తప్పులుచేస్తే భగవంతుడు శిక్షించడని, ఏదో ఒక రూపంలో సరిచేసేలా చెప్తాడన్నారు. పుత్ర శోకం నుంచి తేరుకోక ముందే స్వామి చెంతకు వచ్చి భక్తులకు సేవచేయడం ధర్మారెడ్డి ఆత్మస్థైర్యానికి నిదర్శమని చెవిరెడ్డి అన్నారు. కర్మఫలంతో తన బిడ్డ చనిపోతే స్వామి సన్నిధిలో తప్పులు చేసినందుకు దేవుడు శిక్షవేశాడని తనపై అభాండాలు వేయడం మనస్సును కలచి వేసిందని ధర్మారెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. శ్రీవారి ఆలయం నుంచి పరకామణి బయటకు మార్చానని, శ్రీవారికి తిరుప్పావై సేవను రద్దుచేశానని అందుకే దేవుడిలా శిక్షించారని ఆరోపణలు వచ్చాయని తెలిపారు. ఇవన్నీ ఆగమ పండితుల సలహా, పాలక మండలి ఆమోదాలతో భక్తుల సౌకర్యార్థం చేసినవే అని ఆయన స్పష్టంచేశారు. పలువురు టీటీడీ ఉద్యోగులు రక్తదానం చేశారు.

దేశానికే తలమానికం

- వైద్యులు, ఇతర సిబ్బంది కొరతకు తావులేకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు
- 2019 నుంచి ఇప్పటివరకూ 47,191 పోస్టుల భర్తీ
- దేశవ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల్లో 61 శాతం స్పెషలిస్ట్ వైద్యుల కొరత
- అదే మన రాష్ట్రంలో కేవలం 5.4 శాతం మేర మాత్రమే
- ఈ కొరతను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు



సాక్షి, అమరావతి: విమ్స్ తరహాలోనే రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది లెక్క ఎక్కువైనా పర్లేదు.. తక్కువ కాకుండా ఉండేలా అన్నట్లు సీఎం జగన్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆస్పత్రుల్లో మానవ వనరుల అందుబాటు విషయంలో దేశానికే రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోంది. సాధారణంగా ప్రభుత్వాస్పత్రులను వేధించే ప్రధాన సమస్య మానవ వనరుల కొరత. ఈ సమస్యకు చెక్‌పెట్టేలా 2019 నుంచి ఇప్పటివరకూ వైద్యశాఖలో ఏకంగా 47,191 పోస్టుల భర్తీని చేపట్టారు. అంతేకాక.. వైద్యశాఖలో ఏర్పడే ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీచేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఏడాది పొడవునా నియామకాలు చేపట్టడానికి అవకాశం కల్పించారు.

స్పెషాలిటీ వైద్యుల అందుబాటు 94.6 శాతం

నిజానికి.. దేశవ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. అయితే..

- మన రాష్ట్రంలో 94.6 శాతం మేర స్పెషాలిటీ వైద్యులు ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో ఉన్నారు. కేవలం 5.4 శాతం పోస్టులు మాత్రమే ఖాళీగా ఉండగా భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది.
- ఇదే క్రమంలో దేశవ్యాప్తంగా స్పెషలిస్ట్ వైద్యులను ఓసారి పరిశీలిస్తే.. ప్రభుత్వాస్పత్రుల్లో 39 శాతం మేర మాత్రమే ఉంటోంది. 61 శాతం మేర స్పెషలిస్ట్ వైద్య పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి.
- అదే విధంగా గైనకాలజీ పోస్టులు దేశవ్యాప్తంగా 50 శాతం మేర ఖాళీగా ఉండగా మన రాష్ట్రంలో కేవలం 1.4 శాతం మేర మాత్రమే కొరత ఉంది.
- ఇక స్టాఫ్ నర్సులు దేశవ్యాప్తంగా 27 శాతం మేర కొరత ఉంటే, మన దగ్గర ఏమాత్రం కొరతలేదు.

డీఎంఈలో 12, ఏపీవీవీపీలో 9

డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), ఆంధ్రప్రదేశ్ వైద్య విజ్ఞాన పరిషత్ (ఏపీవీవీపీ) ఆస్పత్రుల్లో స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య పోస్టుల భర్తీకి 2019 నుంచి ఇప్పటికి వరుసగా నోటిఫికేషన్లు జారీచేశారు. డీఎంఈలో 12 నోటిఫికేషన్ల ద్వారా 1,445 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీచేశారు. అదేవిధంగా ఏపీవీవీపీ పరిధిలో 9 నోటిఫికేషన్ల ద్వారా 1,471 వైద్య పోస్టులను నింపారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడానికి ముందు 1,250కు పైగా వైద్య పోస్టులు ఒక్క ఏపీవీవీపీ ఆస్పత్రుల్లోనే ఖాళీగా ఉన్నాయి. వీటికి స్టాఫ్ నర్సు, పారామెడికల్, ఇతర సిబ్బంది పోస్టులు అదనం. ఇలాంటి పరిస్థితుల్లో తొమ్మిది నోటిఫికేషన్లు ఇవ్వడం ద్వారా 277 గైనిక్, 234 మత్తు, 146 పీడియాట్రిషియన్, 168 మంది జనరల్ సర్జన్, 55 ఆర్థో, 78 ఆప్తమాలజీ వంటి స్పెషాలిటీల్లో, మిగిలిన పోస్టులు ఇతర స్పెషాలిటీల్లో భర్తీచేశారు.

స్పెషలిస్టుల కోసం ప్రత్యేక చర్యలు..

ఇక గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో పనిచేయడానికి స్పెషాలిటీ వైద్యులు ముందుకు రాకపోతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.రెండు లక్షలు, గిరిజన ప్రాంతాల్లో రూ.2.5 లక్షల చొప్పున వేతనాలిచ్చి వైద్యుల నియామకం చేపట్టింది. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో వైద్యులు ముందుకు రాకపోతుండటంతో ఈ వేతనాలతో పాటు, అదనంగా అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఈ క్రమంలో 68 మంది వైద్యులు తమకు ఎంత వేతనం కావాలో తెలియజేస్తూ బిడ్డింగ్‌లు దాఖలు చేశారు. వీటిని పరిశీలించి సంక్రాంతి అనంతరం అధికారులు ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

చాలా ఏళ్ల తర్వాత..

ప్రభుత్వం చూపిన చొరవతో గత కొన్నేళ్లుగా స్పెషలిస్ట్ వైద్యులు లేని మారుమూల, గిరిజన ఆస్పత్రుల్లో ప్రస్తుతం స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులోకి వచ్చారు. ఏఎస్ఆర్ జిల్లా చింతూరు ప్రభుత్వాస్పత్రికి 2015 తర్వాత మొదటిసారి ఈ ప్రభుత్వంలో గైనిక్, అనస్థీషియా వైద్యులు అందుబాటులోకి వచ్చారు. ఇదే జిల్లాల్లోని కూనవరం ఆస్పత్రిలో కూడా జనరల్ సర్జన్ వైద్యుడిని నియమించారు. ఈ రెండు ఆస్పత్రుల్లో పనిచేయడానికి ఇద్దరు పీడియాట్రిషియన్ వైద్యులు బిడ్డింగ్ వేశారు. వచ్చే వారంలో వీరి నియామకం ఖరారయ్యే అవకాశం ఉంది.

క్లుప్తంగా...

సంక్రాంతి వేడుకల్లో అమెరికన్ కాన్సులేట్ జనరల్ సందడి



ప్రముఖ నృత్యకారిణి పద్మజారెడ్డి నివాసంలో హైదరాబాద్ యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ సందడి

బంజారాహిల్స్ (హైదరాబాద్): ప్రముఖ నృత్యకారిణి, తెలంగాణ సంగీత, నాటక అకాడమీ తొలి మహిళా చైర్‌పర్సన్ పద్మజారెడ్డి నివాసంలో శనివారం సంక్రాంతి సంబురాలు అంబరాన్ని అంటాయి. జూబ్లీహిల్స్ రోడ్ నం.72లోని పద్మజారెడ్డి నివాసంలో జరిగిన ఈ వేడుకలకు హైదరాబాద్‌లో యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ హాజరై సందడి చేశారు. పద్మజారెడ్డి ఆమెకు సంప్రదాయ బద్ధంగా తిలకందిద్ది ఇంట్లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జెన్నిఫర్ రంగవల్లులు తీర్చిదిద్ది మురిసి పోయారు. సంక్రాంతి ప్రత్యేక వంటకాలైన అరిసెలు, సకినాలు, పొంగల్ రుచిచూసి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం పద్మజారెడ్డి శిష్యబృందం సంక్రాంతి నేపథ్యంగా నిర్వహించిన నృత్యరూపకాన్ని ఆమె తిలకించారు. సంక్రాంతి పర్వదినాన్ని ఎలా జరుపుకుంటారో తెలియజేస్తూ.. ముగ్గులు, భోగి మంటలు, భోగి పండ్లు, సంక్రాంతి, కనుమ విశిష్టతలపై ఈ నృత్యరూపకం కొనసాగింది. మూడు గంటల పాటు జెన్నిఫర్ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం శాస్త్రీయ నృత్య ముద్రలను అభినయించారు. సంక్రాంతి వేడుకల్లో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని జెన్నిఫర్ ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. మన పండుగలను తెలుసుకునేందుకు ఆమె చూపిన ఉత్సాహం మరువలేనిదని ఈ సందర్భంగా పద్మజారెడ్డి వెల్లడించారు. తమ ఇంట్లోకి వచ్చే క్రమంలో చెప్పులను బయట విడిచి రావడమే కాకుండా బొట్టు పెడుతుండగా దానిని ఆనందంతో ఆస్వాదించి పండుగలో నిమగ్నమైన తీరు తనను ఆకట్టుకుందని ఈ సందర్భంగా పద్మజారెడ్డి తెలిపారు.

బ్లూటూత్‌తో వచ్చాను మారాజా...

సంక్రాంతి వేళ ట్రెండ్ మార్చిన తుపాకీ రాముడు



బొమ్మలరామారం: మారాజ.. మారాజ.. అంటూ చేతిలో తుపాకీతో, మాటల గారడీ చేస్తూ సంక్రాంతి వేళ భిక్షాటన చేస్తూ సందడి చేసే తుపాకీ రాముడు నేడు ట్రెండ్ మార్చాడు. పోలీస్ ఆఫీసర్‌లాంటి ఖాకీ యునిఫాం, చేతిలో కట్టె తుపాకీ, నెత్తికి టోపీ, నల్ల రంగు బూట్లను ధరించే తుపాకీ రాముడు ఇప్పుడు టెక్నాలజీని ఉపయోగించుకుంటూ కొత్త అవతారమెత్తాడు. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండల కేంద్రానికి చెందిన మిరాల రాములు సంచార జాతికి చెందిన వ్యక్తి. 42 ఏళ్లకు పైగా తుపాకీ రాముడి వేషధారణతో సంక్రాంతి సమయంలో భిక్షాటన చేస్తున్నాడు. ఇన్నేళ్లుగా నోటితో గారడీ మాటలు చెబుతూ భిక్షాటన చేసిన రాముడు నేడు ఆధునిక టెక్నాలజీని సైతం వినియోగించుకుంటున్నాడు. వయసు మీద పడడంతో తన మాటలను రికార్డు చేసి బ్లూటూత్ స్పీకర్ సాయంతో జనానికి వినిపిస్తున్నాడు. సంక్రాంతి పండుగ వేళ బ్లూటూత్ సాయంతో మాటలు వినిపిస్తున్న తుపాకీ రాముడి సందడిని చూసి ప్రజలు ఔరా అని ఆశ్చర్యపోతున్నారు.

– మిరాల రాములు, బొమ్మలరామారం (తుపాకీ రాముడు)

'సాయంత్రం 5 తర్వాత ఈ-పాస్‌బుక్ సేవలు'

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌వో) చందాదారులకు లెక్కలు దాచి చుక్కలు చూపిస్తోంది. చందాదారుల ఖాతా వివరాలను తెలుసుకునేందుకు ఉన్న ఈ-పాస్‌బుక్ ఆప్షన్ సేవలను ఈపీఎఫ్‌వో నిలిపివేసింది. ఈ-పాస్‌బుక్ సర్వీసు కోసం లాగిన్ అయ్యేందుకు వెబ్‌సైట్‌లో పేజీని తెరవగానే 'ఈ రోజు సాయంత్రం 5 గంటల తర్వాత పాస్‌బుక్ సర్వీసులు పునరుద్ధరిస్తాం'అని ప్రత్యక్షమవుతోంది. కొన్నిరోజులుగా ఇదే సూచన ప్రత్యక్షమవుతోందని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లోనూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఉద్యోగికి భవిష్యనిధి అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశం. ఉద్యోగి పనిచేస్తున్న కంపెనీ నెలవారీ చందా జమచేస్తున్న వివరాలు మొదలు భవిష్యనిధిలో ఉన్న మొత్తం, ఈ నిధిపై వస్తున్న వడ్డీకి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవడం హక్కుగా భావిస్తారు. నగదు నిల్వలు, వడ్డీ డబ్బులతో భవిష్యత్ కార్యకలాపాలకు సైతం ప్రణాళిక రచించుకుంటారు.

రెండేళ్లుగా వడ్డీ ఏమైంది?

వడ్డీ జమ అయ్యిందా?.. అనేది అత్యధిక ఈపీఎఫ్ చందాదారుల్లో తలెత్తుతున్న ప్రశ్న. సాధారణంగా ప్రతి ఆర్థిక సంవత్సరం ముగిసిన నెల, రెండు నెలల్లో ఈపీఎఫ్‌వో చందాదారుల ఖాతాలో వడ్డీ నిధిని జమ చేస్తుంది. ఈ మేరకు ఖాతా రికార్డుల్లో లెక్కలు పేర్కొంటుంది.

సెమీ బుల్లెట్‌లో త్వరలో స్లీపర్ బెర్తులు

ఆ వసతి లేనందున పగటి వేళ తిరుగుతున్న 'వందేభారత్'

- మధ్యాహ్న ప్రయాణానికి మొగ్గుచూపని ప్రయాణికులు
- పట్టాలెక్కిన వందేభారత్‌లలో సగం సీట్లు ఖాళీ
- దీంతో స్లీపర్ కోచ్‌లు చేర్చాలని రైల్వే శాఖ నిర్ణయం
- ఇప్పటికే చెన్నై ఫ్యాక్టరీలో మొదలైన కసరత్తు



సాక్షి, హైదరాబాద్: సెమీ బుల్లెట్ రైలుగా పరిగణిస్తున్న వందేభారత్ రైలు త్వరలో సరికొత్త మార్పులతో రాబోతోంది. ప్రస్తుతం చైర్ కార్‌కే పరిమితమైన ఈ రైల్లో.. స్లీపర్ బెర్తులు ఏర్పాటుచేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. దీంతో ఈ రైళ్లను తయారుచేస్తున్న చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)కి ఆదేశాలివ్వడంతో ఈమేరకు రూపకల్పన పనులు మొదలయ్యాయి. ప్రస్తుతం వందేభారత్ 2.0 సిరీస్ నడుస్తోంది. మొదటిసిరీస్‌లో ఐదు రైళ్లు పట్టాలెక్కగా, రెండో విడతలో మూడు రైళ్లు అందుబాటులోకి వచ్చాయి. సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య సోమవారం నుంచి (ఆదివారం లాంఛనంగా ప్రారంభంకానుంది) ప్రయాణికులకు అందుబాటులోకి రానున్న రైలు కూడా రెండో సిరీస్‌లో భాగం. తదుపరి లేదా ఆ పై సిరీస్ అందుబాటులోకి వచ్చే నాటికి స్లీపర్ బెర్తులతో కూడిన వందేభారత్ రైలు పట్టాలెక్కే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా వందల్లో వందేభారత్ రైళ్లను ప్రవేశపెట్టనున్నట్టు రైల్వే శాఖ స్పష్టం చేసిన నేపథ్యంలో ఈ కసరత్తుకు ప్రాధాన్యం ఏర్పడింది.

ఆక్యుపెన్సీ రేషియో 50 శాతమే

వందేభారత్ రైలుకు విపరీతమైన డిమాండ్ ఉన్నా, కొన్నిచోట్ల ఆక్యుపెన్సీ రేషియో 50 శాతమే ఉంటోంది. వీటిలో స్లీపర్ బెర్తులు లేకపోవటంతో అవి రాత్రి వేళ తిరగవు. దీంతో గమ్యం చేరేవరకు కూర్చునే ప్రయాణించాల్సి ఉంటుంది. దీనికి ప్రయాణికులు మొగ్గు చూపడం లేదు. గతంలో వందేభారత్ తరహాలో వచ్చిన ఏసీ డబుల్ డెక్కర్ రైలుకు ఎంతో డిమాండ్ ఉండేది. ఐదేళ్ల క్రితం కాచిగూడ–తిరుపతి, సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య తిరిగేందుకు డబుల్ డెక్కర్ రైలు మంజూరైంది. బెర్తులు లేక పోవటంతో పూర్తిగా పగటివేళ తిరుగుతుండటంతో దీనిలో ఆక్యుపెన్సీ రేషియో 20 శాతం లోపే నమోదయ్యేది. క్రమంగా నష్టాలు పెరగటంతో దాన్ని ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు వందేభారత్ విషయంలోనూ ఈ ప్రమాదం పొంచి ఉండటంతో అందులో స్లీపర్ బెర్తులు ప్రవేశపెట్టాలని నిర్ణయించారు.

విశాఖకు కొంత మెరుగే..

హైదరాబాద్ నుంచి విశాఖకు వెళ్లే గోదావరి ఎక్స్‌ప్రెస్ సాయంత్రం ఐదు గంటలకు బయలుదేరుతుంది. అదే వందేభారత్ రైలు మధ్యాహ్నం మూడింటికి బయలుదేరి రాత్రి 11.30 గంటలకల్లా గమ్యం చేరుతుంది. కానీ విశాఖ నుంచి ఆ రైలు ఉదయం 5.45 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.15కు సికింద్రాబాద్ చేరుకుంటుంది. అంటే పూర్తిగా పగటి వేళలోనే తిరుగుతుంది. దీంతో ఈ మార్గంలో ఆక్యుపెన్సీ రేషియో తక్కువగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

ధర ప్రభావం చూపుతుందేమో..

సికింద్రాబాద్–విశాఖ వందేభారత్‌లో ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ టికెట్ ధర రూ.3,120గా ఉంది. ఇందులో రూ.369 కేటరింగ్ చార్జి కలిసి ఉంది. అది వద్దనుకుంటే దాన్ని మినహాయించి టికెట్ జారీ చేస్తారు. అదే విశాఖకు వెళ్లే గోదావరిలో ఏసీ ఫస్ట్‌క్లాస్ టికెట్ ధర రూ.2,540 మాత్రమే. దురంతోలో రూ.2,795, ఫలక్‌నుమాలో రూ.2,465గా ఉంది. ఇవన్నీ స్లీపర్ బెర్తులుండే రైళ్లు. వీటి కంటే చైర్‌కార్‌లో వెళ్లే వందేభారత్ రైలు టికెట్ ధర చాలా ఎక్కువగా ఉండటం కూడా కొంత ప్రభావం చూపుతుందంటున్నారు. వందేభారత్ ఎకానమీ క్లాస్ టికెట్ ధర రూ.1,665గా ఉంటే, గోదావరిలో థర్డ్ ఏసీ ధర రూ.1080, ఫలక్‌నుమాలో రూ.1,045 మాత్రమే. వాటిల్లో స్లీపర్ క్లాస్ ధర రూ.450 మాత్రమే కావటం గమనార్హం. అయితే మిగిలిన రైళ్లతో పోలిస్తే.. వందేభారత్ రైలు ప్రయాణ సమయం తక్కువగా ఉంటుంది.

'స్మాల్ క్రెడిట్–బడ్డీ క్యాష్' యాప్‌ను నమ్మొద్దు

మోసపూరితమైనదని ప్రకటించిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ లోన్‌యాప్‌ల దురాగతాలు కొనసాగుతూనే ఉన్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ఆర్థిక అవసరాలు తీర్చుకునేందుకు చాలామంది యువత, నిరుద్యోగులు, చిరు వ్యాపారులు ఈ లోన్ యాప్‌లకు చిక్కుకుంటున్నారు. తమకు తెలియకుండానే ఈ యాప్‌లకు వ్యక్తిగత సమాచారం, ఇతర వివరాలు ఇస్తున్నారు. అప్పు తీర్చిన తర్వాత కూడా ఈ యాప్ నిర్వాహకులు అదనపు డబ్బు కోసం మానసిక వ్యధకు గురిచేస్తున్నారు. అయితే, ఇదే తరహాకు చెందిన ఒక యాప్ గురించి తెలంగాణ సైబర్ క్రైం పోలీసు విభాగం హెచ్చరిక జారీ చేసింది. 'స్మాల్ క్రెడిట్–బడ్డీ క్యాష్'యాప్ మోసపూరితమైందని సైబర్ క్రైం కోఆర్డినేషన్ ట్విట్టర్ ఖాతాలో ఓ పోస్ట్‌ను పెట్టింది. 'ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే మీ వ్యక్తిగత వివరాలు దొంగిలించి, మిమ్మల్ని బెదిరించి మీ దగ్గర నుంచి డబ్బులు కాజేస్తారు'అని ఆ ట్వీట్‌లో సైబర్ క్రైం పోలీసులు పేర్కొన్నారు. సైబర్ క్రైం ఫిర్యాదులకుగాను 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని వారు సూచించారు.

ఏపీ బరుల్లో తెలంగాణ పుంజులు!

- రాష్ట్రంలోని అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో పుంజుల ఫారాలు
- గెలిచే పుంజుల కోసం ఏపీ నుంచి వచ్చి ప్రత్యేకంగా వెతుకులాట
- రూ.20 వేల నుంచి రూ.లక్షన్నర దాకా వెచ్చించి మరీ కొనుగోళ్లు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సంక్రాంతి పండుగ వచ్చిందంటే కోడి పందాల జోరు మొదలవుతుంది. కాళ్లకు కత్తులతో కలబడే పుంజులు, వాటి చుట్టూ చేరి ఉత్సాహంగా పందాలు కాసేవారితో బరులు కళకళలాడుతాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా ప్రాంత జిల్లాలు ఈ కోడి పందాలకు పెట్టింది పేరు. కానీ అక్కడ బరిలోకి దిగే పుంజుల్లో తెలంగాణలో పుట్టిపెరిగినవి పెద్ద సంఖ్యలో ఉంటుండటం గమనార్హం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో, ముఖ్యంగా అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని పామాయిల్ తోటల్లో పందెం పుంజులను పెంచుతుంటారు. ఈ రెండు మండలాల్లోని పదికిపైగా గ్రామాల్లో సుమారుఇరవై కోడి పుంజుల ఫారాలు ఉన్నాయి. ఒక్కో ఫారం నుంచి సంక్రాంతి సీజన్‌లో 80 నుంచి 100 వరకు పుంజులు ఏపీలో పందాలకు తరలుతాయి.

లోకల్ పెట్ట.. పందెం పుంజు..

ఫారాల నిర్వాహకులు ఏపీలో జరిగిన పందాల్లో గెలిచిన పుంజులను కొనుక్కొచ్చి స్థానికంగా కోడిపెట్టలతో క్రాసింగ్ చేయిస్తారు. ఆ కోడిపెట్టలు పెట్టిన పిల్లల నుంచి పుంజులను వేరుచేసి ప్రత్యేకమైన ఆహారం, శిక్షణ ఇస్తారు. ఆరు నెలల వయసు వచ్చే వరకు గుంపుగా ఉంచిన పుంజులను తర్వాత వేరు చేస్తారు. గుడ్లు, రాగులు, నానబెట్టిన బాదం పప్పు, జీడిపప్పు, కిస్మిస్‌లు, మటన్ కీమా వంటివి ఆహారంగా పెడతారు. కాళ్లు దృఢంగా అయ్యేందుకు నీటిలో ఈత కొట్టిస్తారు. మసాజ్ చేస్తారు. కాస్త అటూఇటూగా ఏడాదిన్నర వయసున్న పుంజులను పందాలకు వినియోగిస్తారు. 'కాకి, నెమలి, డేగ, సీతువా, పచ్చకాకి, కోడి డేగ, ఆబ్రాసు, రసంగి డేగ' తదితర జాతుల కోళ్లను పోటీకి దింపుతారు. ఏపీ నుంచి పందెం రాయుళ్లు నవంబర్ నుంచే పుంజుల ఫారాలకు వస్తారు. పుంజుల బలం, ఆరోగ్యం, పంజా విసిరే వేగం, ఒంటిపై జుట్టు విచ్చుకునే తీరు వంటివాటిని బట్టి రూ.20 వేల నుంచి రూ.లక్షన్నర వరకు ధర పలుకుతాయి.

కులవాద రాజకీయాలకు రోజులు దగ్గరపడ్డాయి



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాష్ట్రంలో చంద్రబాబు తరహా కులవాద రాజకీయాలకు రోజులు దగ్గర పడ్డాయని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి 839వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ విభజన అనంతరం చంద్రబాబు చేస్తున్న కుళ్లు రాజకీయాలకు రాష్ట్రం 50 ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని పేరిట బాబు, ఆయన అనుయాయులు కొనుగోలు చేసిన ఆస్తులను కాపాడుకునేందుకే అమరావతి బినామీ ఉద్యమం తప్ప, ప్రజల కోసం కాదనేది బహిరంగ సత్యమన్నారు. అమరావతి పేరుతో జరుగుతున్న ఉద్యమంలో అసలు రైతులు శూన్యమని, ఎల్లో మీడియాలో తప్ప ఈ 29 గ్రామాల్లో ఉద్యమ ప్రభావం ఎక్కడా కనిపించడం లేదని చెప్పారు. రైతులనే వారు ఉంటే అమరావతి–అరసవల్లి యాత్రను ఎందుకు మధ్యలో నిలిపేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలు కోల్పోతుంటే సభలకు అనుమతులు తీసుకోవాలని ప్రభుత్వం జీవోను విడుదల చేస్తే దానిని రాజకీయం చేసి లబ్ధిపొందాలనుకుంటున్న బాబు మరోసారి ప్రజల్లోకి వెళితే చెప్పులు విసిరికొట్టడం ఖాయమన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

ఆ పాస్‌పోర్టుకు పవరెక్కువ!

- నంబర్ 1 స్థానంలో జపాన్ పాస్‌పోర్టు.. చివరి స్థానంలో అఫ్గానిస్తాన్
- బలమైన ఆర్థిక వ్యవస్థలు ఉన్నా అమెరికా, చైనాలు జపాన్ తర్వాతే..
- జపాన్ పాస్‌పోర్టుతో గరిష్టంగా 193 దేశాలకు వీసా ఫ్రీ యాక్సెస్
- 59 దేశాలతో 85వ ర్యాంకులో భారత్
- హెన్లీ పార్టనర్స్ నివేదిక వెల్లడి



సాక్షి, ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్: మన దేశం నుంచి మరోదేశం వెళ్లాలంటే..పాస్‌పోర్టు.. వీసా.. ఈ రెండు తప్పనిసరి అని అందరికీ తెలుసు.. వీసా లేకుండా మరో దేశానికి వెళ్లే అవకాశం లేదు. కానీ కొన్ని దేశాలు తమ విమానాశ్రయాల్లో దిగిన తర్వాత వీసా (అరైవల్ ఆన్ వీసా) మంజూరు చేస్తుంటాయి. ఇంకొన్ని సన్నిహిత, శ్రేయోభిలాష దేశాలు.. వీసా లేకపోయినా పరస్పరం తమ దేశాల ప్రజలు వచ్చిపోవడానికి అనుమతినిస్తుంటాయి. వీసాల సంగతి ఇలావుంటే.. పాస్‌పోర్టుల్లో అత్యంత శక్తివంతమైన (వెరీ పవర్‌ఫుల్), శక్తివంతమైన, బలహీనమైన (వీక్) పాస్‌పోర్టులు ఉండటం కొంత ఆసక్తిరేకెత్తించే అంశం. గడిచిన 20 సంవత్సరాలుగా శక్తివంతమైన పాస్‌పోర్టు అందించే దేశాల జాబితాను లండన్‌కు చెందిన అంతర్జాతీయ పౌరసత్వ, నివాస సలహా సంస్థ హెన్లీ అండ్ పార్టనర్స్ ప్రకటిస్తోంది. ఈ క్రమంలోనే తాజా జాబితా ప్రకటించింది. ప్రపంచ దేశాల్లో జపాన్ పాస్‌పోర్టును అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్టుగా తేల్చింది. ఈ మేరకు శక్తివంతమైన పాస్‌పోర్టుల జాబితాలో జపాన్ ప్రథమ స్థానంలో ఉండగా, సింగపూర్, దక్షిణ కొరియాలు రెండూ రెండో స్థానంలో, జర్మనీ, స్పెయిన్‌లు మూడో స్థానంలో ఉన్నాయి. ఇక అగ్రరాజ్యాలుగా పరిగణింపబడే అమెరికా, బ్రిటన్, చైనా లాంటి దేశాలు కొన్ని ఆ తర్వాతి స్థానాల్లోనే ఉండటం గమనార్హం. కాగా మనదేశం 59 దేశాలతో 85వ స్థానంలో నిలిచింది.

ఏమిటీ శక్తివంతమైన పాస్ట్‌పోర్టు?

మొత్తం 199 దేశాలు పాస్‌పోర్టులు జారీ చేస్తున్నాయి. అయితే ఒక దేశ పాస్‌పోర్టుతో గరిష్టంగా ఎన్ని దేశాలకు వీసా లేకుండా వెళ్లొచ్చు లేదా వీసా ఆన్ అరైవల్ పద్ధతిలో వెళ్లొచ్చనే దానిపై ఆ పాస్ట్‌పోర్టు బలం అంటే అది ఎంత శక్తివంతమైన పాస్ట్‌పోర్టు అనేది ఆధారపడి ఉంటుంది. అంటే ఎన్ని ఎక్కువ దేశాలకు ఇలా వెళ్లేందుకు అవకాశం ఉంటే ఆ పాస్ట్‌పోర్టు అంత శక్తివంతమైందన్న మాట. ఇందుకు సంబంధించి ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ (ఐఏటీఏ) డేటా ఆధారంగా హెన్లీ సంస్థ పాస్‌పోర్టులకు ర్యాంకులు ప్రకటిస్తుంది. ఈసారి మొదటి స్థానంలో నిలిచిన జపాన్ పాస్‌పోర్టుతో గరిష్ఠ స్థాయిలో 193 దేశాలకు/గమ్యస్థానాలకు వీసా లేకుండా లేదా వీసా ఆన్ అరైవల్ పద్ధతిలో సందర్శించేందుకు అవకాశం ఉంది. సింగపూర్, దక్షిణ కొరియా (రెండో స్థానంలో) పాస్‌పోర్టులతో 192 దేశాలు, జర్మనీ, స్పెయిన్ (మూడో స్థానంలో) పాస్‌పోర్టులతో 190 దేశాలను పై పద్ధతిలో సందర్శించే వీలుంది. ఇక ఫిన్లాండ్, ఇటలీ, లగ్జంబర్గ్ నాల్గవ స్థానంలో (189) ఉండగా, ఆస్ట్రియా, డెన్మార్క్, నెదర్లాండ్స్, స్వీడెన్ (188 దేశాలు), ఫ్రాన్స్, ఐర్లాండ్, పోర్చుగల్, యూకే (187), బెల్జియం, చెక్ రిపబ్లిక్, న్యూజిలాండ్, నార్వే, స్విట్జర్లాండ్, యూఎస్ఏ (186), ఆస్ట్రేలియా, కెనడా, గ్రీస్, మాల్టా (185), పోలండ్, హంగేరి (184), లుథ్వేనియా, స్లోవేకియా (183) వరసగా తొలి 10 స్థానాల్లో ఉన్నాయి. 2014లో అమెరికా, బ్రిటన్ దేశాలు మొదటి, రెండు స్థానాల్లో ఉన్నాయి. కాగా అప్పటినుంచి ఇప్పటివరకు దాదాపు ఎనిమిదేళ్లుగా ఈ రెండు దేశాలు మళ్లీ ఆ స్థానాలకు చేరుకోకపోవడం గమనార్హం. కాగా 85వ ర్యాంకులో ఉన్న మన పాస్‌పోర్టుతో 59 దేశాలకు ఆ విధంగా వెళ్లొచ్చు.

పెట్టుబడిదారుకు ఉపయుక్తం..

ఈ విధమైన పాస్‌పోర్టు సమాచారం అంతర్జాతీయ వ్యాపారులకు, అంతర్జాతీయ స్థాయి పెట్టుబడులకు ఉపయోగపడుతుంది. ఈ ర్యాంకుల ఆధారంగా ఆయా దేశాల ఆర్థిక స్థితిగతులు, ఇతర పరిస్థితులు తెలుసుకునేందుకు అవకాశం ఉంది. పాస్‌పోర్టు బలానికి, ఆర్థిక శక్తి మధ్య లంకె ఉన్నట్లు సంస్థ వెల్లడించింది.

సీఎంఆర్‌పై సీబీ'ఐ'

నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ..?

- ధాన్యం కొనుగోళ్లు, కస్టమ్ మిల్లింగ్ రైస్ అప్పగింతల్లో అక్రమాలపై నజర్
- ఇప్పటికే ఢిల్లీ, హరియాణా, పంజాబ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో దాడులు
- 37 మంది ఎఫ్‌సీఐ అధికారులు సహా 74 మంది అరెస్ట్
- త్వరలోనే తెలంగాణలోనూ దర్యాప్తుకు సిద్ధం!
- రాష్ట్రంలో ఉత్పత్తి సామర్థ్యానికి మించి ధాన్యం కొనుగోళ్లపై దృష్టి
- నెలలు గడుస్తున్నా సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లు..లెక్కల్లో తేడాలు
- సీఎంఆర్ గడువులు ఇష్టారాజ్యంగా పొడిగింపు
- ఎఫ్‌సీఐ, నేతలు, పౌరసరఫరాల శాఖ అధికారులు, మిల్లర్ల కుమ్మక్కు దందా
- వీటన్నిటిపై కేంద్ర దర్యాప్తు సంస్థ వద్ద సమాచారం!

సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) అప్పగింతల్లో జరిగిన అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) దృష్టి పెట్టింది. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) అధికారుల సహకారంతో చాలా రాష్ట్రాల్లో రైస్ మిల్లర్లు, వ్యాపారులు, రాష్ట్ర అధికారులు కలిసి వ్యవస్థీకృత సిండికేట్ నడుపుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లో సీబీఐ విచారణ చేపట్టి తనిఖీలు నిర్వహిస్తోంది. ధాన్యం కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడటం, నాసిరకం బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించడం, నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలిచ్చి బియ్యం సరఫరా చేస్తున్నారనే ఆరోపణలపై ఇప్పటికే ఢిల్లీ, హరియాణా, పంజాబ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో దాడులు నిర్వహించింది. 74 మందిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసింది. ఇదే క్రమంలో త్వరలోనే తెలంగాణలోనూ ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు, సీఎంఆర్ అప్పగింతల్లో అవకతవకలపై దర్యాప్తుకు సీబీఐ రంగంలోకి దిగనున్నట్లు కేంద్రప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది. రాష్ట్రంలోని అధికార బీఆర్‌ఎస్ నేతల అండతో మిల్లర్లు సీఎంఆర్ కేటాయింపుల విషయంలో అవకతవకలకు పాల్పడుతున్నట్లుగా ఢిల్లీకి ఉప్పందినట్లు తెలిసింది. మిల్లర్లకు పౌరసరఫరాల శాఖ అధికారుల సంపూర్ణ సహకారం కూడా ఉందని భావిస్తున్న సీబీఐ ఆ దిశగా దర్యాప్తుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

4 రాష్ట్రాల్లోని 50 ప్రాంతాల్లో తనిఖీలు..

విశ్వసనీయ సమాచారం మేరకు.. ధాన్యం ఉత్పత్తి అధికంగా ఉండే పంజాబ్, హరియాణా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో భారీగా అక్రమాలు జరిగినట్లు సీబీఐ గుర్తించింది. దీనితో పాటు సకాలంలో కేంద్రానికి ఇవ్వాల్సిన సీఎంఆర్ ఇవ్వకుండా మిల్లర్లు ప్రైవేటుకు అమ్ముకోవడం, దీనికి కొందరు ఎఫ్‌సీఐ అధికారులతో పాటు ఆయా రాష్ట్రాల ఆహార, పౌరసరఫరాల శాఖల అధికారులు సహకరిస్తుండటాన్ని కూడా గుర్తించింది. సెంట్రల్ పూల్‌కు ఇచ్చే బియ్యంలో నాణ్యత లోపిస్తున్నా, ఎఫ్‌సీఐ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో వినియోగదారులకు నాణ్యత లేని బియ్యం సరఫరా అవుతున్నట్లు నిర్ధారించింది. ఈ నేపథ్యంలోనే మూడ్రోజుల కిందట ఢిల్లీ, పంజాబ్, హరియాణా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని 50 ప్రాంతాల్లో సీబీఐ ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఎఫ్‌సీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజీవ్‌కుమార్ మిశ్రా సహా 74 మందిని అరెస్ట్ చేసింది. ఇందులో 37 మంది ఎఫ్‌సీఐ అధికారులు కాగా మిగతావారిలో మిల్లర్లు, దళారులు, గోదాముల నిర్వాహకులు ఉన్నారు.

ఉత్పత్తి సామర్థ్యానికి మించి కొనుగోళ్లు

మిశ్రా ఎఫ్‌సీఐ ప్రధాన కార్యాలయంలో పనిచేసిన సమయంలోనే తెలంగాణ, పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో ఉత్పత్తి సామర్థ్యానికి మించి ధాన్యం కొనుగోళ్లు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. మిశ్రా చాలా రాష్ట్రాల మిల్లర్లతో కుమ్మక్కై, కేంద్రానికి ఇవ్వాల్సిన సీఎంఆర్ కోటా గడువు పెంపునకు ఆదేశాలు ఇచ్చారని, ఈ క్రమంలో కోట్ల రూపాయలు చేతులు మారాయనే ఆరోపణలు రాగా విచారణ జరుగుతోంది. తెలంగాణకు సంబంధించి ఎఫ్‌సీఐలో గతంలో పనిచేసిన ఓ అధికారి హయాంలో కూడా సీఎంఆర్ కోటా సేకరణ విషయంలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే గత సంవత్సరం వానాకాలం, యాసంగి సీజన్ల సీఎంఆర్ గడువు దాటినా ఎఫ్‌సీఐకి అందకపోవడం, లెక్కల్లో తేడాలుండటం వంటి అంశాలు సీబీఐ దృష్టిలో ఉన్నట్లు చెబుతున్నారు.

సీఎంఆర్ అప్పగింతలో అవకతవకలు

రాష్ట్రంలో వానాకాలం, యాసంగి సీజన్లలో రైతులు పండించిన పంటను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఆ ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలిస్తుంటుంది. సుమారు 3 వేల మిల్లుల ద్వారా ధాన్యాన్ని మిల్లింగ్ చేసి, కేంద్ర ప్రభుత్వం సెంట్రల్‌పూల్ కింద ఇచ్చిన టార్గెట్‌కు అనుగుణంగా సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐ గోడౌన్లకు పంపిస్తుంటుంది. అయితే మిల్లర్లు వ్యాపారమే లక్ష్యంగా రాజకీయ అండదండలతో అవకతవకలకు పాల్పడుతున్నారు. వచ్చిన ధాన్యాన్ని 6నెలల్లోగా మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి అప్పగించాల్సిన మిల్లర్లు ఆ తర్వాత రెండు, మూడు సీజన్లు గడిచినా అప్పగించడం లేదు. మిల్లుల్లోని నాణ్యమైన సర్కారు ధాన్యాన్ని మిల్లింగ్ చేసి, ప్రైవేటు వ్యాపారులకు విక్రయించుకుంటున్నారని, ప్రజా పంపిణీ బియ్యం కొని, రీసైక్లింగ్ చేసి లోటును భర్తీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఆధారాలు సేకరించిన దర్యాప్తు సంస్థ!

రాష్ట్రంలో ఉన్న సుమారు 3 వేల రైస్ మిల్లులకు గత మూడేళ్లుగా ప్రతి సీజన్‌లో సుమారు రూ.15 వేల కోట్ల విలువైన ధాన్యాన్ని ప్రభుత్వం అప్పగించి, సీఎంఆర్ తీసుకుంటోంది. ధాన్యాన్ని మిల్లింగ్ చేసినందుకు లేబర్ ఖర్చుతో సహా ప్రతి పైసా మిల్లర్లకు చెల్లిస్తోంది. అయినా.. 33 జిల్లాల్లోని పలువురు పౌరసరఫరాల శాఖ అధికారుల అండతో మిల్లర్లు సర్కారు ధాన్యాన్ని సొంత వ్యాపారానికి వినియోగించుకుంటున్నట్టుగాసీబీఐ ఆధారాలు సేకరించినట్లు సమాచారం. 2019–20లో 118 మంది మిల్లర్లు రూ.230 కోట్ల విలువైన 1,00,427 మెట్రిక్ టన్నుల బియ్యం ఎఫ్‌సీఐకి బకాయి పడగా, వారిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా సదరు మిల్లులకు మరోసారి సీఎంఆర్ గడువు పెంచడం అనుమానాలకు తావిచ్చింది. 2020–21లో కూడా వందల సంఖ్యలో మిల్లర్లు బకాయిలు పడగా వారిని డిఫాల్టర్లుగా ప్రకటించి, 2021–22 సీజన్లలో ధాన్యం కేటాయింపును నిలిపివేశారు. అయితే ఆ తర్వాత రాజకీయ జోక్యంతో సదరు మిల్లులకు కూడా యథాతథంగా ధాన్యం సరఫరా అయింది. గత మూడేళ్లుగా రాష్ట్రంలో ధాన్యం దిగుబడి గణనీయంగా పెరగ్గా.. పౌరసరఫరాల శాఖ అధికారుల అండతో సాగుతున్న అడ్డగోలు వ్యవహారాలన్నింటిపై సీబీఐ ప్రాథమికంగా సమాచారం సేకరించినట్లు తెలిసింది.

ఇప్పటికీ పెండింగ్‌లో 2021-22 వానాకాలం బియ్యం

రాష్ట్రంలో ప్రస్తుతం 2022–23 వానకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు సాగుతుండగా, మరో నెలలో కస్టమ్ మిల్లింగ్ ప్రారంభం కావలసి ఉంది. కానీ ఇప్పటికీ 2021–22 వానాకాలం సీజన్‌కు సంబంధించిన బియ్యం 8.65 లక్షల మెట్రిక్ టన్నులు (ఎల్ఎంటీ) ఎఫ్‌సీఐకి రావలసి ఉండటం గమనార్హం. ఆ సీజన్‌లో 70.21 ఎల్ఎంటీల ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగించగా, 47.04 ఎల్ఎంటీల బియ్యాన్ని సీఎంఆర్ కింద ఇవ్వాల్సి ఉంది. అయితే ఇప్పటికి పలుమార్లు గడువు పెంచినా ఎఫ్‌సీఐకి ఇచ్చిన బియ్యం 38.39 ఎల్ఎంటీలే. ఇక గత యాసంగి సీజన్‌కి సంబంధించి 50.39 ఎల్ఎంటీ ధాన్యం మిల్లులకు పంపించి, 34.07 ఎల్ఎంటీ సీఎంఆర్ తీసుకోవలసి ఉండగా, ఇప్పటివరకు కేవలం 16 ఎల్ఎంటీల బియ్యం మాత్రమే ఎఫ్‌సీఐకి అందింది. 2020–21 యాసంగి సీజన్‌కు సంబంధించి మిర్యాలగూడలోని వజ్ర పారాబాయిల్డ్ రైస్‌మిల్లు రూ.5.90 కోట్ల విలువైన బియ్యాన్ని ఎగవేయడంతో ఈ నెల 9న ఆ రైస్‌మిల్లు యజమానులు ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇలాంటి కేసులు ప్రతి జిల్లాలో ఉన్నప్పటికీ అధికారుల అండతో అక్రమాలు యథేచ్ఛగా కొనసాగుతూనే ఉన్నాయనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

రోబో లాయర్

సాక్షి సెంట్రల్ డెస్క్: కోర్టులు, కేసులు అనగానే లాయర్లు గుర్తుకొస్తారు. మరి కోర్టుల్లో కేసులు వాదించాల్సింది వారే. నేరస్తులైనా, బాధితులైనా తమ తరఫున గట్టిగా లా పాయింట్లు ఎత్తి వాదించే లాయర్లు ఉంటే బాగుంటుందని భావిస్తుంటారు. మరి మామూలు మనుషులు కాకుండా రోబోలే మన తరఫున కేసులు వాదిస్తే..? ఇదేదో చిత్రంగా ఉందికదా. అమెరికాలోని ఓ కోర్టులో త్వరలో ఓ రోబో లాయర్ వాదనలు వినిపించనుంది. ఆ విశేషాలు ఏమిటో చూద్దామా..

కారు స్పీడు ఎక్కువైందని..

అమెరికాలో నిర్ధారిత వేగం కన్నా ఎక్కువ స్పీడుతో కారు నడిపిన ఓ కేసులో రోబో లాయర్ వాదనలు వినిపించనుంది. వచ్చే నెలలో ఈ విచారణ జరగనుంది. ప్రత్యక్షంగా కోర్టులో తన క్లయింట్ తరఫున రోబో లాయర్ వాదించనుండటం ప్రపంచంలోనే ఇది తొలిసారి కానుంది. కోర్టులో జరిగే వాద ప్రతివాదనలన్నీ నిశితంగా వింటూ, విశ్లేషించుకుంటూ.. బదులుగా ఏమేం చెప్పాలనేది తన క్లయింట్‌కు బ్లూటూత్ ఇయర్‌ఫోన్ ద్వారా సూచిస్తూ ఉంటుంది.

డునాట్‌పే ఏఐ యాప్‌తో..

అమెరికాలో అధికారిక పనులు, చట్టపరమైన చిక్కులకు సంబంధించి సలహాలు ఇచ్చేందుకు 2015లో 'డునాట్‌పే' పేరిట యాప్ అందుబాటులోకి వచ్చింది. అన్నిరకాల అధికారిక ఉత్తర్వులు, చట్టాలను లోడ్ చేసి, వాటిని విశ్లేషించి.. తగిన సూచనలు ఇవ్వగలిగేలా కృత్రిమ మేధ (ఏఐ) పరిజ్ఞానంతో ఈ యాప్‌ను రూపొందించారు. ముఖ్యంగా ఈ–మెయిల్ మోసాలు, పని ప్రదేశంలో వివక్ష, ఒప్పందాల ఉల్లంఘన, మెడికల్, ఇన్సూరెన్స్ మోసాలు, హ్యూమన్ రిసోర్స్‌పై వచ్చే ఫిర్యాదులు వంటివాటి విషయంలో చట్టపరమైన సలహాలను ఈ యాప్ ద్వారా పొందవచ్చు. అమెరికాలో చాలా మంది తమ అవసరాలకు ఈ ఏఐ యాప్‌ను ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు దీనిని నేరుగా కోర్టులో క్లయింట్ తరఫున వాదించే లాయర్‌గా ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at MNS Printers Private Limited, Survey No 76/1 Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Amar Ujala Publications Limited, C-21-22, Sector -59, Noida, Gautam Buddhanagar, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd., 22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943